


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50

సంపుటి: 16 | సంచిక: 333

శుక్రవారం | 23-2-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గుట్ట దిగి.. గుండెల్లో కొలువై

గాల్లో కాల్పులతో సమ్మక్కకు స్వాగతం పలికిన ఎస్పీ

గద్దెలపై కొలువుదీరిన నలుగురు వనదేవతలు

10లో

◀ గురువారం రాత్రి 9:29కి సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠిస్తున్న పూజారులు



మోస్ట్ పాపులర్ గ్లోబల్ లీడర్ జాబితాలో తొలిస్థానం

అత్యంత ప్రజాదరణ కలిగిన నేత నరేంద్ర మోదీ

గ్రామాల అభివృద్ధితోనే 'వికసిత్ భారత్': మోదీ

పుస్తకాలు చూస్తూనే పరీక్ష!

నేడు రైతు సంఘాల 'బ్లాక్ డే'

వివరాలు 6లో

సింగరేణిలో 272 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

మార్చి 1 నుంచి 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

వివరాలు 14లో

ఒంటరి పోరే!



పొత్తులపై రాష్ట్ర నేతలకు స్పష్టతనిచ్చిన బీజేపీ అధిష్టానం

బీఆర్‌ఎస్‌తో ఎలాంటి అవగాహన ఉండదని ప్రజలకు చాటండి

సొంతంగానే ఏడెనిమిది సీట్లు గెలుస్తామని సర్వేలలో తేలింది

కష్టపడితే మరో రెండు సీట్లనూ సాధిస్తామని స్పష్టీకరణ

కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్‌కు ఢిల్లీ నుంచి సూచనలు

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో ఒంటరి పోరుకే బీజేపీ మొగ్గుచూపింది. బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉందంటూ జరుగుతున్న విస్తృత ప్రచారానికి తెరదించేందుకు సిద్ధమైంది. పార్లమెంటు ఎన్నికల్లో ఇక్కడ సొంతంగానే పోటీచేస్తామని.. బీఆర్‌ఎస్‌తో పొత్తుగానీ, ఎలాంటి అవగాహనగానీ ఉండదని ప్రజలకు చాటాలని తెలంగాణ బీజేపీ నేతలకు స్పష్టం చేసింది. దీనిపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌లకు పలు సూచనలు చేసినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలోనే బీజేపీ విజయ సంకల్ప యాత్రలను ప్రారంభించి.. అందరికన్నా ముందుగా ఎన్నికల సమరం ప్రారంభించిందని వివరిస్తున్నాయి.

వరుసగా పొత్తు వార్తల నేపథ్యంలో..

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తుకు బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తోందని, అందుకు బీజేపీ ఢిల్లీనేతలు కూడా సుముఖంగా ఉన్నారంటూ కొన్నిరోజులుగా ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ నేతలు, కొందరు రాష్ట్ర మంత్రులు కూడా బీఆర్‌ఎస్–బీజేపీ మధ్య పొత్తు ఉంటుందని, ఆ రెండు పార్టీల మధ్య రహస్య బంధం

మిగతా 3వ పేజీలో ▶

ప్రధాని మోదీ పాలనలోనే దేశాభివృద్ధి



బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

అరవై ఏళ్ల కాంగ్రెస్ పాలన అవినీతిమయం

5లో

సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, ఉత్తమ్



27 లేదా 29 నుంచి.. మరో రెండు గ్యారంటీలు

ఉచిత విద్యుత్.. రూ.500కే సిలిండర్ అమలుపై సర్కారు నిర్ణయం

తెల్లరేషన్‌కార్డు ఉండి 200 యూనిట్లలోపువాడే వారందరికీ 'గృహజ్యోతి'

- మార్చి నుంచే 'జీరో' విద్యుత్ బిల్లులు ఇచ్చేలా కసరత్తు
- రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందించేలా ఏజెన్సీలతో చర్చలు
- కేబినెట్ సబ్‌కమిటీతో సీఎం సమీక్ష
- ప్రజాపాలన దరఖాస్తులలో తప్పుల సవరణకు చాన్స్ ఇవ్వాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ సర్కారు మరో రెండు గ్యారంటీలను అమల్లోకి తీసుకువచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందించే పథకాలను ఈ నెల 27 లేదా 29వ తేదీ నుంచి ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి

మిగతా 2వ పేజీలో ▶



పెండింగ్ బిల్లులు చెల్లించండి

సర్పంచ్‌ల సంఘం నిరసన

- లేకపోతే ఒక్కో ఎంపీ సెగ్మెంట్‌లో వంద నామినేషన్లు వేస్తామని హెచ్చరిక
- గన్‌పార్కు వద్ద ఆందోళనకు దిగిన తాజా మాజీ సర్పంచ్‌ల అరెస్టు

3లో

◀ గన్‌పార్క్ వద్ద ఆందోళన చేస్తున్న తాజా మాజీ సర్పంచ్‌లు

బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య

- ఇంటి నుంచి వర్సిటీకి వచ్చి.. ఉరి వేసుకున్న వైనం
- వ్యక్తిగత కారణాలతోనే అంటున్న క్యాంపస్ వర్గాలు

5లో

ప్రభుత్వంలోనే దోషులు!

- 'ఐఎంజీ భారత'కు చంద్రబాబు భూ కేటాయింపుల్ని తప్పుబట్టిన ధర్మాసనం
- 2004లో ఆపద్ధర్మ ప్రభుత్వంలోనే జీవోలు విడుదల చేసేసిన చంద్రబాబు
- తదుపరి విచారణ 28కి వాయిదా

14లో

క్లుప్తంగా...

'అప్పుల' ప్రచారం తప్పు: హరీశ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి నిష్పత్తితో పోలిస్తే తెలంగాణ అప్పుల్లో దేశంలోనే దిగువ నుంచి ఐదో స్థానంలో ఉందని ఫోర్బ్స్ ఇండియా నివేదిక చెప్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పేర్కొన్నారు. గత పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం సాధించిన ప్రతిష్టను దెబ్బతీసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల శ్వేతపత్రాలను విడుదల చేసిందని ఫోర్బ్స్ నివేదికను బట్టి అంచనాకు రావొచ్చన్నారు. ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కాగా, రాష్ట్రంలో పొద్దుతిరుగుడు పంటను సాగు చేసిన రైతులు మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గురువారం లేఖ రాశారు.

మద్దతు ధరకే 'పొద్దు తిరుగుడు' కొనండి : తుమ్మల



సాక్షి, హైదరాబాద్: పొద్దు తిరుగుడు పంట భారీ ఎత్తున మార్కెట్‌లోకి వస్తోందని, ధర విషయంలో రైతులు నష్టపోకుండా చూడాలని అధికారులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. నేటి నుంచి మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు కేంద్రాలు ఆరంభించి, పొద్దుతిరుగుడు పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్‌కు సూచించారు. పొద్దుతిరుగుడు సాగయ్యే అన్ని ప్రధాన సెంటర్లలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుత మార్కెట్ ధర మద్దతు ధర రూ.6,760 కంటే తక్కువగా ఉన్నదని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

న్యాయవాది భాస్కర్‌పై మహేందర్‌రెడ్డి దావా



సాక్షి, హైదరాబాద్: న్యాయవాది రాపోలు భాస్కర్‌పై టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పరువునష్టం దావా వేశారు. గతంలో డీజీపీగా పనిచేసిన మహేందర్‌రెడ్డి పదవిని అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడ్డారంటూ భాస్కర్ ఆరోపణలు చేశారు. అయితే భాస్కర్ నిరాధార ఆరోపణలు చేశారని, సంఘంలో గౌరవప్రదమైన హోదాలో ఉన్న తనపై ఇలా వ్యాఖ్యలు చేసి పరువుకు నష్టం కలిగించారని మహేందర్‌రెడ్డి సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ తరఫున న్యాయవాది పాశం మోహిత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 'మహేందర్‌రెడ్డి ఎలాంటి మచ్చ లేకుండా పదవీ విరమణ చేశారు. అందుకే ప్రభుత్వం ఆయనకు మరోసారి పదవి ఇచ్చింది. ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసిన భాస్కర్.. ఆ ఫిర్యాదును పరిశీలించేందుకు అవకాశం కూడా ఇవ్వకుండా చట్టవిరుద్ధంగా వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం ప్రారంభించారు. మీడియా సమావేశం ఏర్పాటు చేసి మహేందర్‌రెడ్డి పరువు తీశారు' అని పేర్కొన్నారు. వాదనలు విన్న కోర్టు.. తదుపరి విచారణను మార్చి 11కి వాయిదా వేసింది.

మా ప్రభుత్వాన్ని టచ్ చేస్తే మసే: పొన్నం



కొత్తపల్లి/కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు చేస్తున్నారని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. తమకు సమ్మక్క–సారలమ్మ అండ ఉందని.. ప్రభుత్వాన్ని టచ్ చేస్తే మాడి మసై పోతారని హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా కేంద్రం శివారులోని రేకుర్తిలో సమ్మక్క–సారలమ్మలను గురువారం దర్శించుకున్న సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడా రు. దేశవ్యాప్తంగా బీజే పీని విమర్శించే వారిపై ఐటీ దాడులు జరుగుతుంటే.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపై మాత్రం జరగడం లేదని గుర్తు చేశారు. బీజేపీ, కేసీఆర్ ఒక్కటేనని అనేందుకు ఇదే నిదర్శనమన్నారు. మార్చిలో రూ.500కు సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు అమలవుతాయని స్పష్టం చేశారు.

ఇవాల్టి కార్టూన్




రిటైర్‌మెంట్ ఎంత అవసరమో చంద్రబాబుగారు మాట్లాడతారు!

తాగునీటికి తొలి ప్రాధాన్యం

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా వెంటనే కార్యాచరణ ప్రణాళిక.. అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

- నిరుపయోగంగా ఉన్న నీటి వనరులను పునరుద్ధరించండి
- బోర్లు, బావుల మోటార్లకు మరమ్మతులు చేయించండి
- కృష్ణా నుంచి తాగు అవసరాలకు నీటి విడుదల కోసం కేఆర్ఎంబీకి లేఖ రాయండి
- మిషన్ భగీరథపై గత సర్కారు తప్పుడు లెక్కలు
- అందుకే కేంద్రం నుంచి జల్‌జీవన్ మిషన్ నిధులు రావడం లేదని ఆరోపణ.. పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి, పురపాలక, నీటిపారుదల శాఖలు కలసి పనిచేయాలని సూచన



సాక్షి, హైదరాబాద్: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నగరాలు, పట్టణాలు, పల్లెలు, తండాలనే తేడా లేకుండా ప్రతి నివాస ప్రాంతానికి తాగునీరు అందేలా చూడాలని సూచించారు. ఇందుకోసం సాగునీటి, పట్టణాభివృద్ధి, పురపాలక, పంచాయతీ రాజ్ శాఖలు కలసి సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. వర్షాభావంతో రాష్ట్రంలోని కీలక జలాశయాలు డెడ్‌స్టోరేజీకి చేరుకున్న నేపథ్యంలో.. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అధికారులతో కలిసి తాగునీటి అంశంపై సమీక్షించారు.

బోర్లు, మోటార్లకు మరమ్మతులు

కొత్త నీటి పథకాలను తెచ్చినప్పుడల్లా అంతకు ముందున్న అనేక నీటి వనరులను వదిలేశారని.. అలాంటి వాటిని ప్రస్తుతం వినియోగంలోకి తెచ్చే అవకాశాన్ని పరిశీలించాలని సమీక్షలో సీఎం సూచించారు. కాగ్నా నుంచి తాండూర్, కొడంగల్ నియోజకవర్గాలకు నీటిని వినియోగించుకునే అవకాశం ఉందని.. కానీ మిషన్ భగీరథ వచ్చాక దానిని వదిలేశారని చెప్పారు. ఇలాంటివి రాష్ట్రంలో ఎక్కడున్నా వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి బోర్లు, బావులు, మోటార్లకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఇందుకోసం ఎమ్మెల్యేలకు కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి (ఏసీడీపీ) నిధుల నుంచి కోటి రూపాయలు, అవసరమైతే అంతకన్నా ఎక్కువగా వినియోగించుకోవాలని సూచించారు.

కృష్ణానీటిపై దృష్టి పెట్టండి

ఏపీ సర్కారు తాగునీటి కోసమంటూ నాగార్జునసాగర్ నుంచి తొమ్మిది టీఎంసీలకుపైగా నీటిని తీసుకుపోతోందని సమీక్షలో అధికారులు తెలిపారు. దీనిపై స్పందించిన రేవంత్.. అంత పెద్దమొత్తంలో తాగునీటిని ఎక్కడ వినియోగిస్తున్నారో సరైన గణాంకాలు తీసుకోవాలని.. ఇతర అవసరాలకు నీరు తీసుకుపోకుండా చూడాలని సూచించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి తాగు నీటిని తీసుకోవాలంటే కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ ఎంబీ)కి లేఖ రాయాల్సి ఉంటుందని చెప్పగా.. ఎంత నీరు అవసరమో వెంటనే సమీక్షించి లేఖ రాయాలని ఆదేశించారు. నారాయణపూర్ జలాశయం నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాల్సిందిగా కర్ణాటకను కోరవచ్చని అధికారులు చెప్పగా.. పరిస్థితిని బట్టి దీనిని చివరి అవకాశంగా తీసుకోవాలని సీఎం సూచించారు.

తప్పుడు నివేదికలతో అందని నిధులు

ఇటీవల తాను ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించినప్పుడు అనేక గ్రామాల్లో తాగునీటి సరఫరా లేదని గుర్తించినట్టు సీఎం చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా 99శాతం ఇళ్లకు నీళ్లు ఇచ్చామని గత ప్రభుత్వం కేంద్రానికి తప్పుడు నివేదికలు ఇచ్చినందునే.. కేంద్రం నుంచి రాష్ట్రానికి జల్ జీవన్ మిషన్ నిధులు రావడం లేదన్నారు. గొప్పలకు పోయి తప్పుడు నివేదికలు ఇవ్వవద్దని అధికారులకు స్పష్టం చేశారు. మొత్తంగా జూలై చివరిదాకా ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్లతో సమీక్షించాలని సీఎస్‌ను ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ తాగునీటికి సమస్య లేకుండా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. అయితే హైదరాబాద్‌కు పెద్దగా ఇబ్బందులు లేవని.. అవసరమైతే ఎల్లంపల్లి, నాగార్జునసాగర్‌ల నుంచి తెప్పించుకునే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఇక వేసవి పూర్తయ్యే వరకు హైదరాబాద్ నగరంలో తాగునీటి ట్యాంకర్ల రాకపోకలకు పోలీసుల నుంచి ఇబ్బంది లేకుండా చూడా లని సీఎం ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బందికి వేతనాలకోసం నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖను సీఎం ఆదేశించారు.

కరెంట్ కట్ చేస్తే.. సస్పెన్షన్!

- విద్యుత్ అధికారులు, సిబ్బందికి సీఎం రేవంత్‌రెడ్డి వార్నింగ్
- ప్రభుత్వాన్ని బద్నాం చేసేలా కొందరు వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం
- అవసరాలకు సరిపడా విద్యుత్ సరఫరా ఉందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా విద్యుత్ కోతలు విధించే అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు మొదలయ్యాయన్న ప్రచారం నేపథ్యంలో సీఎం గురువారం సచివాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రభుత్వం ఎలాంటి విద్యుత్ కోతలు విధించాలని ఆదేశించలేదని.. అనవసరంగా కోతలు పెట్టి రైతులను, ప్రజలను ఇబ్బందిపెడితే క్షమించేది లేదని హెచ్చరించారు. అవసరానికి సరిపడా విద్యుత్ ఉందని, గతంతో పోలిస్తే సరఫరా పెరిగిందన్నారు. అయినా కూడా కోతలు అంటూ జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ అధికారుల దేనని సీఎం పేర్కొన్నారు. ఇటీవల పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపేసిన ఘటనలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

గత ప్రభుత్వ సిబ్బంది అత్యుత్సాహంతో..

ఇటీవల రాష్ట్రంలో మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని.. మిగతాచోట్ల ఎలాంటి ఇబ్బందీ లేదని ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీ ఈ సమీక్షలో వివరించారు. ఆయాచోట్ల సరఫరా లోపానికి కారణాలేమిటని సీఎం ప్రశ్నించగా.. సబ్‌స్టేషన్లలో లోడ్ హెచ్చుతగ్గులను డీఈలు సరిచూడాలని, అలా చేయకపోవడంతో సమస్య తలెత్తిందని సీఎండీ వివరించారు. దీంతో ఇలా నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మరమ్మతులు, సాంకేతిక సమస్యలు, ప్రకృతిపరమైన కారణాలు మినహా విద్యుత్ సరఫరాలో కోతలు ఉండొద్దని స్పష్టం చేశారు. విద్యుత్ కోతలు విధించే పక్షంలో ముందుగా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో నియమితులైన క్షేత్రస్థాయి సిబ్బంది అత్యుత్సాహంతో కోతలు విధిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో సరిపడా విద్యుత్ అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని అధికారులు సీఎంకు వివరించారు. ఈసారి ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 13వ తేదీ వరకు రోజుకు సగటున 264.95 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేశామని.. గతేడాది ఇదే వ్యవధిలో 242.44 మిలియన్ యూనిట్ల సరఫరానే ఉందని తెలిపారు.



జైకా ప్రతినిధి సైటో మిత్సునోరిని సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో భట్టి, ఉత్తమ్, పొంగులేటి, సీఎస్ శాంతికుమారి

మెట్రో రెండోదశకు జైకా నిధులు!

జైకా ప్రతినిధితో సీఎం భేటీ

సాక్షి, హైదరాబాద్: మెట్రో రెండో దశ ప్రాజెక్టు, మూసీ ప్రక్షాళనకు నిధుల సేకరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. గురువారం మెట్రో రైల్ విస్తరణ, మూసీనది పరీవాహక ప్రాంత అభివృద్ధికి తక్కువ వడ్డీకి రుణాలు, వివిధ విభాగాల్లో పెట్టుబడులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా) ఇండియా చీఫ్ రిప్రజెంటేటివ్ సైటో మిత్సునోరితో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రస్తుత అంచనాల మేరకు 70 కిలోమీటర్ల మేర నిర్మించనున్న మెట్రో రెండో దశకు అయ్యే రూ.18,900 కోట్ల వ్యయంలో సుమారు రూ.9,000 కోట్ల వరకు జైకా నుంచి, ఇతర సంస్థల నుంచి రుణాల రూపంలో సేకరించే అవకాశముంది. మెట్రో నిర్మాణ ఒప్పందం మేరకు కేంద్రం 35 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం మరో 20 శాతం నిధులు భరించాలి. మిగతా మొత్తాన్ని రుణాల రూపంలో సేకరిస్తారు. ప్రస్తుతం జైకా మాత్రమే అతి తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థపైనే ఆశలు పెట్టుకుంది. మెట్రోతో పాటు, మూసీ ప్రక్షాళన, అభివృద్ధికి కూడా జైకా నిధులే కీలకం కానున్నాయి. 'ఆ సంస్థ ప్రతినిధులతో జరిపిన చర్చలు ఫలప్రదంగా ముగిశాయి. ఆశించిన స్థాయిలోనే రుణాలు లభిస్తాయని భావిస్తున్నాం.' అని ఒక అధికారి అభిప్రాయపడ్డారు.

యాదాద్రిలో సీఎం కుటుంబ సభ్యుల పూజలు



ధ్వజస్తంభం వద్ద మొక్కుతున్న సీఎం కుమార్తె, సతీమణి

యాదగిరిగుట్ట: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సతీమణి గీత, కుమార్తె నైమిషారెడ్డిలతో పాటు కుటుంబ సభ్యులు గురువారం సాయంత్రం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు వీరికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. సీఎం కుటుంబ సభ్యులు గర్భాలయంలో స్వయంభువులను దర్శించుకున్నారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, ఉత్సవమూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈవో రామకృష్ణారావు లడ్డూ ప్రసాదం అందజేశారు.

పెట్టుబడులు పెట్టండి.. సౌకర్యాలు కల్పిస్తాం

అమెరికా సంస్థ ప్రతినిధులతో భేటీలో మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనుకొనే వ్యాపారవేత్తలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం సచివాలయంలో ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలసి అమెరికాకు చెందిన క్రీడా పరికరాల తయారీ సంస్థ టాప్‌గోల్ఫ్ కాల్లవే బ్రాండ్స్ కార్ప్ ప్రతినిధులతో భేటీఅయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెడితే కలిగే లాభాలను వారికి మంత్రి వివరించారు. కంపెనీలకు సింగిల్ విండో పర్మిషన్లు ఇస్తున్నామని, ప్రపంచస్థాయి మౌలికవసతులు కలిగిన హైదరాబాద్.. అన్ని పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమని ఆయన వివరించారు. సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు హైదరాబాద్ ప్రగతిపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఒకవైపు మూసీ నదిని అభివృద్ధి చేస్తున్నామని, మరోవైపు రాష్ట్రానికి రీజనల్ రింగ్‌రోడ్డు మంజూరైందని.. ఇది తెలంగాణకు గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని శ్రీధర్ బాబు చెప్పారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్‌ను నలుదిశలా అభివృద్ధి చేస్తామని వివరించారు.

'సాగర్'ను సందర్శించిన కేఆర్ఎంబీ బృందం



నాగార్జునసాగర్: కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) అధికారులు స్థానిక ఇంజనీర్లతో కలసి గురువారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. సాగర్ డ్యామ్‌పై బీటీ రోడ్డు వేయడంతో పాటు సీజనల్‌గా చేయాల్సిన నిర్వహణ పనులైన డ్యామ్ రేడియల్ క్రస్ట్‌గేట్లకు రబ్బరు సీళ్లు, గ్యాలరీలలో సీపేజ్ నీరు రాకుండా మరమ్మతులు, గేట్లు ఎత్తి, దింపే స్టార్టర్‌లలో ప్యానల్ బోర్డులు, మోటార్ల మరమ్మతుల వంటి పనులు చేయాల్సి ఉంది. ఈ నెల 16వ తేదీన తెలంగాణ ఇంజనీర్లు నిర్వహణ పనులను ప్రారంభించారు. అయితే, ఈ పనులు చేయవద్దని ఏపీ వైపున ఉన్న సీఆర్పీఎఫ్ సిబ్బంది అభ్యంతరం తెలిపారు. తెలంగాణ అధికారులు అలాగే పనులు చేస్తుండగా.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విషయమై కేఆర్ఎంబీకి లేఖలు రాసింది. దీంతో స్పందించిన కేఆర్ఎంబీ అధికారులు గురువారం సాగర్‌డ్యామ్ మీదకు వచ్చి పరిశీలించారు. డ్యామ్ మెయింటెనెన్స్ పనులు చేసుకోవచ్చని చెప్పారు. శుక్రవారం కేఆర్ఎంబీ అధికారులు సాగర్‌డ్యామ్‌తో పాటు కుడి, ఎడమ కాల్వల హెడ్‌రెగ్యులేటర్లను సందర్శించనున్నట్లు సమాచారం. సాగర్‌డ్యామ్‌పై పర్యటించిన వారిలో కేఆర్ఎంబీ ఎస్ఈ వరలక్ష్మి, సాగర్‌డ్యామ్ ఎస్ఈ నాగేశ్వర్‌రావు, ఈఈ మల్లికార్జున్‌రావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈ కృష్ణయ్య, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, ప్రత్యేక రక్షణ దళం కమాండెంట్ పాల్గొన్నారు.

నీ కుర్చీ లాక్కున్నదే నీకు తెలియదు

- బండి సంజయ్, కిషన్‌రెడ్డిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: 'నీ కుర్చీ మీదనే నీకు సోయి లేదు. నీ కుర్చీ లాక్కున్నదే నీకు తెలియదు. కూర్చున్న కుర్చీ గురించి సోయి లేని నీకు కాంగ్రెస్ పార్టీ గురించి ఎందుకు?' అని బీజేపీ ఎంపీ బండి సంజయ్‌నుద్దేశించి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రశ్నించారు. బీజేపీ పార్టీ నేతలు ముందు వారి బురద కడుక్కుని కాంగ్రెస్ పార్టీకి సుద్దులు చెప్పాలని హితవు పలికారు. గాంధీభవన్‌లో టీపీసీసీ ఫిషర్‌మెన్ సెల్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగమేఘాల మీద కిషన్‌రెడ్డి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎలా అయ్యారో, సంజయ్‌ని కారణం లేకుండా ఎందుకు తప్పించారో అర్థం చేసుకోవాలన్నారు. కేసీఆర్ ప్యాకేజీలో భాగంగానే కిషన్‌రెడ్డి అధ్యక్షుడు అయ్యారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ హామీలను నెరవేర్చలేదని కిషన్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే 20 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఇది నిజం కాదా? కిషన్‌రెడ్డికి కళ్లు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

- చికిత్సలపై సాంకేతిక కమిటీని నియమించాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఆస్పత్రుల నిర్మాణ పనుల పురోగతిపై గురువారం ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పనులను పర్యవేక్షిస్తున్న ఆర్ అండ్ బీ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. వరంగల్‌లో 2,100 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, హైదరాబాద్ అల్వాల్‌లో నిర్మిస్తున్న 1,200 పడకల సామర్థ్యం కలిగిన టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎల్బీనగర్‌లో నిర్మిస్తున్న 1,000 పడకల సామర్థ్యం గల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, సనత్‌నగర్‌లో నిర్మిస్తున్న 1000 పడకల సామర్థ్యం కలిగిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణ పనుల పురోగతితో పాటు ఎర్రమంజిల్ నిమ్స్ ఆసుపత్రిలో 2వేల పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న విస్తరణ పనుల పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆయా ఆస్పత్రుల్లో రోగులకు వైద్య సేవలు అందించేందుకు సాంకేతిక కమిటీలను నియమించాలని ఆదేశించారు. ఆ టెక్నికల్ కమిటీలు సూచించిన విధంగా స్పెషాలిటీ సేవలు, చికిత్సలు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ వాణి, డాక్టర్ శివరాం ప్రసాద్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇంటర్నేషనల్' గురుకుల భవనాలు!

ఇంటర్నేషనల్ స్కూళ్లకు దీటుగా నిర్మాణం: ఉప ముఖ్యమంత్రి భట్టి

సాక్షి, హైదరాబాద్: ఇంటర్నేషనల్ స్కూళ్లకు దీటుగా సమీకృత గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణాలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. రూ.2,500 కోట్లతో ఈ ఏడాది రాష్ట్రంలో 100 ఎస్సీ, బీసీ, మైనారిటీల గురుకుల పాఠశాల భవనాల నిర్మాణం చేపడుతున్నామని, ఒక్కో భవనానికి రూ.25 కోట్ల చొప్పున మంజూరు చేసినట్లు చెప్పారు. సచివాలయంలో గురుకుల పాఠశాలల భవన నిర్మాణాలపై విద్య, సంక్షేమ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎస్సీ, బీసీ, మైనార్టీల గురుకుల పాఠశాలల భవనాలను సమీకృతంగా ఒకేచోట నిర్మిస్తుండటంతో స్థల సమస్య తీరుతుందని, క్రీడా మైదానాలు వంటి ఉమ్మడి సదుపాయాలను అన్ని గురుకులాల విద్యార్థులు వాడుకోవచ్చన్నారు.

మధిరలో పైలట్ ప్రాజెక్టు

సమీకృత గురుకుల పాఠశాలల భవన నిర్మాణానికి మధిర నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు భట్టి విక్రమార్క తెలిపారు. చింతకాని మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియం సమీపంలోని 10 ఎకరాల్లో నిర్మిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్థలాల ఎంపికను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. భవనాల నిర్మాణం సత్వరంగా పూర్తి చేయడానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి అహమ్మద్ నదీమ్‌ను ఆదేశించారు. దేశంలో తాము నిర్మించిన ఇంటర్నేషనల్ మోడల్ పాఠశాలలపై బెంగళూరు ఆర్కిటెక్ట్ సంస్థ సమావేశంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది.

నాలెడ్జ్ కేంద్రాల ఏర్పాటు

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు శిక్షణ కోసం నియోజకవర్గ కేంద్రాల వారీగా నాలెడ్జ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు భట్టి తెలిపారు. త్వరలో టీఎస్‌పీఎస్సీ ద్వారా జాబ్ క్యాలెండర్ ప్రకటించనున్న నేపథ్యంలో పేద, మధ్య తరగతి కుటుంబాల నిరుద్యోగులకు ఆర్థిక వెసులుబాటు కల్పించడానికి వీటిని ప్రారంభిస్తున్నామన్నారు. జ్యోతిబా పూలే ప్రజాభవన్ క్షేత్రంగా నియోజకవర్గాల్లోని నాలెడ్జ్ సెంటర్లకు వచ్చే నిరుద్యోగులకు నేరుగా ఆన్‌లైన్ కోచింగ్ ఇప్పించే ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

27 లేదా 29 నుంచి.. మరో రెండు గ్యారంటీలు

▶ మొదటి పేజీ తరువాయి

మల్లు భట్టి విక్రమార్క, ఆరు గ్యారంటీల అమలు కోసం ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా రెండు పథకాల అమలు, విధివిధానాలపై సూత్రప్రాయ నిర్ణయం తీసుకున్నారు.

జీరో బిల్లింగ్.. ఏజెన్సీలకు సబ్సిడీ సొమ్ము

మార్చి మొదటివారం నుంచి జారీచేసే విద్యుత్ బిల్లులకు సంబంధించి.. 200 యూనిట్లలోపు వాడే అర్హులైన వినియోగదారులకు జీరో బిల్లులు ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. అలాగే రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించేందుకు వీలుగా విధివిధానాలను సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పించిందని.. ఆరోగ్యశ్రీ వైద్య చికిత్సల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందని సీఎం గుర్తు చేశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులందరికీ లబ్ధి జరిగేలా చూడాలని సూచించారు. రూ.500కు గ్యాస్ సిలిండర్ అందించే పథకంలో.. 'ప్రభుత్వ సబ్సిడీని నేరుగా లబ్ధిదారుల ఖాతాకు బదిలీ చేయాలా? లేక ఏజెన్సీలకు చెల్లించాలా? ఈ క్రమంలో వచ్చే అడ్డంకులు, ఇబ్బందులేమిట'న్న అంశాలపై పౌరసరఫరాలు, ఆర్థిక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే ఎలాగైనా సరే లబ్ధిదారు రూ.500 చెల్లిస్తే సిలిండర్ అందించేలా చూడాలని, ప్రజలకు అనువైన విధానాన్ని అనుసరించాలని సూచించారు. దీనికి సంబంధించి గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసే ఏజెన్సీలతో చర్చించాలన్నారు. ప్రభుత్వమిచ్చే సబ్సిడీ నిధులను వెంటవెంటనే చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇక 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ఇచ్చే 'గృహజ్యోతి' పథకాన్ని అనుమానాలు, అపోహలకు తావులేకుండా పారదర్శకంగా అమలు చేయాలని విద్యుత్తు శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. తెల్లరేషన్ కార్డు ఉండి, 200యూనిట్లలోపు వాడే గృహ విద్యుత్ వినియోగదారులందరికీ ఈ పథకం వర్తింపజేయాలని స్పష్టం చేశారు.

తప్పుల సవరణకు అవకాశం

ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుల్లో కార్డు నంబర్లు, విద్యుత్ కనెక్షన్ నంబర్ల తప్పుల కారణంగా జీరో బిల్లుకు అర్హత కోల్పోయిన వారెవరైనా ఉంటే.. సవరించుకునే అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్ సూచించారు. విద్యుత్ బిల్లుల కలెక్షన్ సెంటర్లు, సర్వీస్ సెంటర్లన్నింటా ఈ సవరణ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఈ విషయంలో ప్రజలందరికీ తెలిసేలా ప్రతి గ్రామంలో విద్యుత్ శాఖ తగినంత ప్రచారం కూడా చేపట్టాలని సూచించారు. తప్పులను సవరించుకున్న అర్హులందరికీ తదుపరి నెల నుంచి పథకం వర్తింపజేయాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోనివారు ఇప్పుడు కూడా ఎంపీడీవో, తహసీల్దార్ ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకునేలా.. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి, ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సివిల్ సప్లైస్ కమిషనర్ డీఎస్ చౌహాన్, ట్రాన్స్‌కో, జెన్‌కోల సీఎండీ రిజ్వీ, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలోగా పూర్తి చేయాలి

ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టలపై అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ), డిండి ప్రాజెక్టుల పనులను సత్వరంగా పునరుద్ధరించి, రెండేళ్లలోగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కానీ తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా తీసుకుందని స్పష్టం చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు జరగాలని, ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని తెలిపారు. నల్లగొండ జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలసి గురువారం సచివాలయంలో ఆయన ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు సంబంధించి 44 కిలోమీటర్ల సొరంగ మార్గం పనుల్లో 9 కిలోమీటర్ల మేర తవ్వకం జరగాల్సి ఉందని, రెండు వైపులా నుంచి సొరంగం తవ్వకాల పనులు నిర్వహించాలని ఉత్తమ్ ఆదేశించారు. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థలు అంటున్నాయని, ఆ మేరకు గడువు పెట్టుకుని పనులు చేయాలని సూచించారు. సమస్యలను పరిష్కరించడం, పనులను వేగిరం చేయడానికి అధికారులతో కమిటీ వేయాలని ఆయన నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను కోరారు. అలాగే 95% పూర్తయిన డిండి ప్రాజెక్టుతో పాటు పెండ్లి పాకాల జలాశయం పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. భూసేకరణకు రూ.90 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. కొత్త ఆయకట్టుకు నీరిచ్చే పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు. సమీక్షలో ఎమ్మెల్యేలు రాజగోపాల్ రెడ్డి, బాలు నాయక్, జైవీర్ రెడ్డి, బి.లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, ఈఎన్సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

'జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్లు'

సాక్షి, హైదరాబాద్: పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చేందుకు రాష్ట్రంలోని జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఈ మేరకు 1000 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి గురువారం రాత్రి ఆయన సచివాలయంలో సింగరేణి సంస్థ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల వల్ల మత్స్య సంపదకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని భట్టివిక్రమార్క సూచించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి నీటిపారుదల శాఖ ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తామని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సింగరేణి సంస్థ ఇన్‌చార్జి సీఎండీ బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

తెలంగాణ ఉద్యమానికి వనదేవతల స్ఫూర్తి

మేడారం జాతర సందర్భంగా కేసీఆర్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఆత్మగౌరవ పోరాటంలో వనదేవతలైన సమ్మక్క– సారలమ్మ అందించిన స్ఫూర్తి ఇమిడి ఉన్నదని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి చారిత్రక ప్రతీకలుగా, ఇలవేల్పులుగా సబ్బండ వర్గాలతో పూజలందుకుంటున్న మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా కేసీఆర్ ఒక ప్రకటనలో ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతర ఆసియా ఖండంలోనే అతి పెద్ద అడవిబిడ్డల జాతరగా, తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిందన్నారు. రాష్ట్రం నుంచే కాక దేశవ్యాప్తంగా తల్లుల దర్శనార్థం తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నిండేలా చూడాలని వనదేవతలను కేసీఆర్ ప్రార్థించారు.

జాహ్నవి అంశంపై జోక్యం చేసుకోవాలి: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: అమెరికాలో తెలుగు విద్యార్థిని జాహ్నవి కందులను అమెరికన్ పోలీసు వాహనంతో గుద్ది చంపిన కేసులో సరైన ఆధారాలు లేవంటూ కోర్టు నిందితుడిని విడుదల చేయడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంలో అమెరికా రాయబార కార్యాలయం వెంటనే జోక్యం చేసుకొని ఆ దేశ ప్రభుత్వ వర్గాలతో మాట్లాడి జాహ్నవి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. భారత విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ జయశంకర్ వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకొని అమెరికా ప్రభుత్వంతో మాట్లాడాలన్నారు. సియాటిల్ నగరంలో గత ఏడాది జనవరిలో కెవిన్ డేవ్ అనే పోలీసు అధికారి 115 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తూ జాహ్నవిని ఢీకొట్టడంతో ఆమె మరణించింది. ఈ సంఘటన అనంతరం సదరు పోలీస్ అధికారి ప్రమాదం గురించి పశ్చాత్తాపం చెందకుండా వర్ణ వివక్షతో చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్‌గా మారింది. దీంతో ఆ పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలంటూ అమెరికాలో నిరసన వ్యక్తమైంది.

ఒంటరి పోరే!

▶ మొదటి పేజీ తరువాయి

కొనసాగుతోందని ఆరోపణలు చేస్తున్నారు. ఒకరిద్దరు బీఆర్ఎస్ నేతలు కూడా బీజేపీతో పొత్తు ఉండవచ్చంటూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

అయోమయానికి తెరదించుతూ..

బీఆర్ఎస్‌తో పొత్తు ప్రచారం బీజేపీ శ్రేణుల్లో అయోమయం, గందరగోళానికి దారితీసింది. ఇదిలాగే కొనసాగితే క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలపైనా ప్రభావం పడవచ్చని భావించిన బీజేపీ అప్రమత్తమైంది. బీజేపీ రాష్ట్ర కీలక నేతలు ఎలాంటి పొత్తు ఉండదని పలుమార్లు ప్రకటించారు. ఈ క్రమంలో ఆ పార్టీ అధిష్టానం కూడా రంగంలోకి దిగింది. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఏ పార్టీతోనూ ఎలాంటి పొత్తు, సీట్ల సర్దుబాటు వంటివి ఉండబోవని స్పష్టం చేసింది. వచ్చే నెల రెండోవారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చన్న అంచనా నేపథ్యంలో పార్టీ శ్రేణులు, ప్రజల్లో గందరగోళం తలెత్తకుండా చూడాలని రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ తదితరులకు ఫోన్‌చేసి స్పష్టమైన సూచనలు చేసినట్టు బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. అయితే పొత్తు కోసం బీఆర్ఎస్ చేసిన ప్రతిపాదనలను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఇటీవల ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల దృష్టికి తీసుకెళ్లారని.. వారు నిర్ద్వంద్వంగా తిరస్కరించారని ఢిల్లీ వేదికగా ప్రచారం జరుగుతుండటం గమనార్హం.

మోదీ ఫ్యాక్టర్.. పెరిగిన మద్దతుతో..

రాష్ట్రంలో బీజేపీకి సానుకూలత పెరిగిందని, దీనికి ప్రధాని మోదీ చరిష్మా జతకలిస్తే.. ఇక్కడ మెజార్టీ ఎంపీ సీట్లు సాధిస్తామని ఆ పార్టీ జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు చెప్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో సొంతంగా 4 సీట్లు గెలిచామని గుర్తు చేస్తున్నారు. ఈసారి బీజేపీ ఏడెనిమిది సీట్లు గెలుస్తుందని సర్వేల్లో తేలిందని, పార్టీ నాయకులు కొంచెం కష్టపడితే మరో రెండు సీట్లనూ సాధించవచ్చని జాతీయ నాయకత్వం స్పష్టం చేసిందని అంటున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని ఇతర ప్రధాన పార్టీల కంటే ముందే.. 17 ఎంపీ స్థానాలను ఐదు క్లస్టర్లుగా విభజించి విజయ సంకల్ప యాత్రలకు శ్రీకారం చుట్టినట్టు వివరిస్తున్నారు.

త్వరలోనే అభ్యర్థుల ఎంపిక

ఈనెల 24న ఢిల్లీలో జరగనున్న బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో కనీసం సగం స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అభ్యర్థుల ప్రకటన ఆలస్యం కావడం, జనసేనతో పొత్తు కారణంగా పార్టీ బలంగా ఉన్న కొన్నిసీట్లను కోల్పోవాల్సి రావడంతో ఇబ్బంది ఎదురైందని అంటున్నాయి. అందువల్ల ఈసారి తొందరగానే లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించేందుకు జాతీయ నాయకత్వం సిద్ధమైందని చెప్తున్నాయి. కాగా.. ఈనెల 24న లేదా 25న కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనకు రావాల్సి ఉందని.. కానీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ నేపథ్యంలో పర్యటన వచ్చే నెల 2వ తేదీకి వాయిదా పడిందని పార్టీ వర్గాల సమాచారం.

మీ ఇష్టానుసారంగా వస్తారా?

- సచివాలయంలోనే సమయపాలన పాటించకపోతే ఎలా?
- సమయం 11:40 గంటలు..సెక్షన్‌లో కనీసం 80 శాతం మంది కూడా లేరు
- ఉద్యోగులపై మంత్రి పొంగులేటి అసహనం



రెవెన్యూ శాఖ హాజరుపట్టికను తనిఖీ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సమయపాలన పాటించకుండా..విధులకు మీ ఇష్టానుసారంగా వస్తే ఎలా అంటూ సచివాలయ ఉద్యోగులపై రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. గురువారం సచివాలయంలో పలు విభాగాలను మంత్రి పొంగులేటి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులకు ఎంత మంది సమయానికి హాజరవుతున్నారో తెలుసుకునేందుకు ఉదయం 11:40 నిమిషాలకు మంత్రి సచివాలయంలోని రెవెన్యూ శాఖకు వెళ్లారు. ఎక్కడ చూసినా ఖాళీ కుర్చీలే కనిపించాయి. దీంతో అక్కడే ఉన్న సిబ్బందిని పిలిచి ఆరా తీశారు. ఎవరైనా సెలవులో ఉన్నారా అని అడిగారు. వారు చెప్పిన జవాబుతో ఆయన సంతృప్తి చెందలేదు. మీరే ఇలా చేస్తే ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం పడుతుందో తెలుసా? 'ఉదయం 11: 40 దాటినా ఇంకా 80 శాతం మందికిపైగా ఉద్యోగులు విధుల్లో రాకపోవడం ఏంటని..' మంత్రి వారిని ప్రశ్నించారు.

రిజిస్టర్ తనిఖీ.. పలు విభాగాల పరిశీలన

తనిఖీలో భాగంగా ఉద్యోగుల హాజరు పట్టిక తీసుకురావాలని అక్కడే ఉన్న సిబ్బందిని మంత్రి ఆదేశించారు. రిజిస్టర్ పరిశీలించి ఒక్కో సెక్షన్‌లో ఈ సమయంలో కూడా ముగ్గురు నలుగురే ఉంటే ఎలా అని మండిపడ్డారు. ప్రభుత్వ వారధిగా మీరే సమయానికి రాకపోతే ఎలా? అన్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వానికి సమాచారం, అభివృద్ధిని ఎలా ముందుకు తీసుకెళతారని నిలదీశారు. రెవెన్యూ విభాగంలోని ఐదు సెక్షన్లలో ఏ సెక్షన్‌లో కూడా పూర్తిస్థాయిలో ఉద్యోగులు సమయానికి హాజరు కాకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఉద్యోగులు, సెక్షన్ ఇన్‌చార్జ్‌పై చర్యలు తీసుకుంటాం

సచివాలయంలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా సమయానికి విధుల్లోకి రావాలి. ఉద్యోగుల కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితి రావొద్దు. అనివార్య కారణాలు ఉంటే సెక్షన్ ఇన్‌చార్జ్‌కు సమాచారం ఇవ్వాలి. ముందస్తు సమాచారం లేకుండా విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఆయా ఉద్యోగులు, సెక్షన్ ఇన్‌చార్జ్‌పై చర్యలు తప్పవు.

– మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్‌తో పొత్తుకు అవకాశం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- పొత్తు ఉన్నా లేకున్నా రెండు ఎంపీ సీట్లలో పోటీ చేస్తామని ప్రకటన



సాక్షి, హైదరాబాద్/సుందరయ్య విజ్ఞాన కేంద్రం: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి వెళ్లేందుకు అవకాశాలున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కూడా కమ్యూనిస్టులతో వెళ్లాలని భావిస్తోందన్నారు. ఒకవేళ పొత్తు ఉన్నా లేకున్నా రెండు ఎంపీ సీట్లలో సీపీఎం పోటీ చేయాలనుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రెండు రోజులపాటు జరగనున్న సీపీఎం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రారంభమైంది. ఆ పార్టీ సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. తమ్మినేని మాట్లాడుతూ.. పొత్తు ఉంటుందా? లేదా? అన్నది కాంగ్రెస్ పార్టీనే తేల్చాలన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, కానీ ఒకసారి ఆరు నెలలు, మరోసారి సంవత్సరంలో భర్తీ చేస్తామని అంటున్నారని, ఈ రెండు మాటల్లో మర్మమేంటని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో రామమందిరం ప్రారంభోత్సవ ప్రభావం ఏ మేరకు ఉంటుందో చూడాలని తమ్మినేని వ్యాఖ్యానించారు. అక్షింతలు ఓట్లుగా మారతాయా? బీజేపీకి ఓట్లేస్తారా? అనేది చూడాలన్నారు.

బీజేపీపై రేవంత్‌రెడ్డి పోరాడాలి: బీవీ రాఘవులు

కర్ణాటక ప్రభుత్వ తరహాలో బీజేపీకి వ్యతిరేకంగా రేవంత్‌రెడ్డి ఇక్కడ పోరాడాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు కోరారు. లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు సీబీఐ సమన్లు వచ్చాయని, అవి సమన్లా లేక గాలమా అనేది కొద్దిరోజుల్లో తేలుతుందని వ్యాఖ్యానించారు. ''కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓట్లేస్తే మూసీనదిలో వేసినట్టేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారు కానీ నిజానికి కిషన్‌రెడ్డీ నువ్వే మూసీలో పడిపోతావు జాగ్రత్త''అని రాఘవులు ఎద్దేవాచేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు, జూలకంటి రంగారెడ్డి, డీజీ నరసింహారావు, జాన్‌వెస్లీ, పాలడుగు భాస్కర్, టి.సాగర్, మల్లు లక్ష్మి, పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

బీజేపీపై తిరగబడే రోజులొస్తున్నాయి!

ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాతపాల్



సాక్షి, హైదరాబాద్: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులొస్తున్నాయని ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాతపాల్ వ్యాఖ్యానించారు. ఓ వైపు న్యాయం కోసం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ యాత్ర చేస్తుంటే, మరోవైపు మోదీ రైతులను కాల్చి చంపుతున్నారని అన్నారు. గురువారం గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. రైతులు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఢిల్లీకి వస్తే ఓ యువరైతును కాల్చిచంపడం దారుణమని ధ్వజమెత్తారు.

ఒక్క సీటు చాలు: నారాయణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ జరిగిన ఎన్నికల తరహాలోనే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్, సీపీఐ కలిసి ముందుకెళ్తే మంచి ఫలితాలు వస్తాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అభిప్రాయపడ్డారు. తెలంగాణలో తాము గుర్తించిన ఐదు లోక్ సభ నియోజకవర్గాల్లో ఒక సీటు నుంచి పోటీ చేసేలా కాంగ్రెస్, సీపీఐ మధ్య సీట్ల సర్దుబాటు కుదిరితే బాగుంటుందన్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో తాజా పరిణామాలు, పలు ప్రజా సమస్యలపై చర్చించారు. నారాయణ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 30 లోక్‌సభ స్థానాలలో పోటీ చేసేందుకు తాము కార్యాచరణ సిద్ధం చేసుకున్నామన్నారు.

బీజేపీతో పొత్తు అవసరం లేదు: శ్రీనివాస్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీకి బీజేపీతో పొత్తు అవసరం లేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రెండు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకే ఇతరులతో పొత్తు అవసరమని, గతంలో పాలమూరులో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటిగా పోటీ చేశాయని విమర్శించారు. శ్రీనివాస్ గౌడ్ గురువారం తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలు దేవీ ప్రసాద్, ఈడిగ ఆంజనేయగౌడ్, తుంగ బాలుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో పాలమూరు నుంచి వలసలు ఆగినా అభివృద్ధి జరగలేదని ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ చెప్పడం విడ్డూరమన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిశీలనకు తాము సిద్ధమని, జూరాల నుంచి కొడంగల్‌కు ఎత్తిపోతల పథకంపై పునరాలోచన చేయాలని కోరారు. కర్ణాటక ప్రభుత్వం కొత్త పథకాలను ప్రారంభిస్తే జూరాల నుంచి నీటి తరలింపు సాధ్యం కాదన్నారు. పాలమూరు ప్రాజెక్టుల కాలువల పనులను నాలుగైదు నెలల్లో పూర్తి చేసి సాగునీరు అందించాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సర్పంచ్‌ల సంఘం డిమాండ్

- లేకపోతే ఒక్కో ఎంపీ సెగ్మెంట్‌లో వంద నామినేషన్లు వేస్తాం
- గన్‌పార్కు వద్ద ఆందోళనకు దిగిన తాజా మాజీ సర్పంచ్‌ల అరెస్టు



మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేస్తున్న పోలీసులు

నాంపల్లి (హైదరాబాద్): సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పాలక, ప్రతిపక్షాలు నోరు మెదపకపోవడం బాధాకరమని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుర్వి యాదయ్య ధ్వజమెత్తారు. గురువారం నాంపల్లిలోని గన్‌పార్కు వద్ద తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన తాజా మాజీ సర్పంచ్‌లు ముందుగా పబ్లిక్‌గార్డెన్స్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా గన్‌పార్కుకు వచ్చారు. నిరసన సభ ఉద్రిక్తతకు దారితీయకుండా పోలీసులు భారీగా మోహరించారు. గన్‌పార్కు వద్ద మాజీ సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేసి ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా అక్కడికక్కడే అరెస్టు చేసి, నాంపల్లి పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా సుర్వి యాదయ్య విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం సర్పంచ్‌లను మోసం చేస్తే...అధికారంలోకి రాగానే సర్పంచ్‌లను ఆదుకుంటామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని రెండు పర్యాయాలు కలిసి వినతిపత్రం అందజేశామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలలోపు సర్పంచ్‌లకు అందాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఒక్కో లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో వందకు పైగా నామినేషన్లు దాఖలు చేసి ప్రజాప్రతినిధులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం నేతలు కొలను శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

“ఓ నా కుమారా! నమాజ్‌ను స్థాపించు. ధర్మాన్ని ఆదేశించు. అధర్మాన్ని నిషేధించు. ఆపదలో సహనం వహించు. నిశ్చయంగా, ఇవి ఎంతో గట్టిగా ఆజ్ఞాపించబడిన విషయాలు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 23 ఫిబ్రవరి 2024

అరణ్యానికి ఆసరా

అడవులనూ, ఆదివాసీలనూ రక్షించుకోవటం అంటే మానవాళి తనను కాపాడుకోవటమేనని బ్రెజిల్ పర్యావరణవేత్త చికో మెండిస్ ఏనాడో చెప్పిన మాట. దాన్ని విస్మరించటం ఎంత అనర్థదాయకమో, అది చివరకు ఎటువంటి విపరిణామాలకు దారితీస్తుందో పాలకులు గ్రహించటం లేదు. కనుకనే అడవుల నిర్వచనానికి సంబంధించినంతవరకూ నిఘంటు అర్థానికీ, 1996లో తాము వెలువరించిన తీర్పునకూ తు.చ. తప్పకుండా కట్టుబడివుండాలని మొన్న సోమవారంనాడు సర్వోన్నత న్యాయ స్థానం చెప్పవలసి వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు కావస్తున్నా మన దేశంలో 'అడవి'కి నిర్దిష్టమైన నిర్వచనం లేదు. దేశంలో అటవీభూముల విస్తీర్ణం ఎంతో స్పష్టమైన, సమగ్రమైన రికార్డు కూడా లేదు. ఒక అంచనా ప్రకారం మన దేశంలో మొత్తం ఎనిమిది లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులున్నాయి. ఇది మరో 1,540 చదరపు కిలోమీటర్ల మేర పెరిగిందని మూడేళ్ల క్రితం కేంద్రం ప్రకటించింది. అయితే 1980 నాటి అటవీ సంరక్షణ చట్టానికి నిరుడు ఆగస్టులో తీసుకొచ్చిన సవరణల వల్ల ఆ చట్టం పరిధి కుంచించుకుపోయిందనీ, ఫలితంగా 1,97,000 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతానికి ముప్పు ఏర్పడిందనీ పిటిషనర్లు ఆరోపించారు. వివాదాస్పదమైన 1ఏ నిబంధన అటవీప్రాంతంగా రికార్డుల్లో వుండి 1980–96 మధ్య చట్టబద్ధంగా అటవీయేతర ప్రయోజనాలకు వినియోగిస్తున్న భూములు, అంతర్జాతీయ సరిహద్దులకు 100 కిలోమీటర్ల దూరంలోవుండి వ్యూహాత్మక అవసరాలకు వినియోగపడే ప్రాంతం ఈ చట్టం పరిధిలోనికి రాదని చెబుతోంది. అలాగే మావోయిస్టు ప్రాంతాల్లో ఆంతరంగిక భద్రతకై చేపట్టే నిర్మాణాల కోసం అయిదు హెక్టార్ల వరకూ అటవీయేతర భూమిగా రికార్డుల్లోవున్న ప్రాంతాన్ని సేకరించవచ్చని చెబుతోంది. ఇక జూ, సఫారీ వంటి అవసరాల కోసం కూడా ఈ తరహా భూమిని తీసుకోవచ్చని వివరిస్తోంది. అడవులే అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వంవల్లనో, మరే ఇతర కారణంవల్లనో రికార్డుల్లోకి ఎక్కని భూములన్నిటికీ ఈ చట్టసవరణవల్ల ముప్పు ఏర్పడుతుందని పిటిషనర్ల వాదన. ఈ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తాత్కాలిక ఆదేశాల పర్యవసానంగా 1980 నాటి అటవీ సంరక్షణ చట్టం నిబంధనలూ, 1996లో సర్వోన్నత న్యాయస్థానం టీఎన్ గోదావర్మన్ కేసులో ఇచ్చిన ఆదేశాలూ వర్తిస్తాయి.

అడవులను సంరక్షించాలని పర్యావరణవేత్తలు కోరినప్పుడల్లా అభివృద్ధి మాటేమిటన్న ప్రశ్న వినబడుతూ వుంటుంది. ఆ రెండూ పరస్పర విరుద్ధాలన్నట్టు... ఒకటి కోల్పోతేనే రెండోది సాధ్యమన్నట్టు మాట్లాడతారు. ఇది సరికాదు. ఏ కారణంతో అడవుల్ని హరించినా అది ఆత్మవినాశనానికే దారితీస్తుంది. అడవులంటే కేవలం వృక్షాలు మాత్రమే కాదు... అక్కడుండే ఆదివాసులూ, ఆ అడవిని ఆలంబనగా చేసుకుని జీవించే వన్యమృగాలతో సహా సమస్త జీవరాశులూ కూడా! అడవులను ధ్వంసం చేసినప్పుడు ఆవాసం కరువై వన్యమృగాలు జనావాసాల్లోకి చొరబడతాయి. ఆదివాసులు జీవిక కరువై ఇబ్బందుల్లో పడతారు. ఇవన్నీ కొట్టొచ్చినట్టు కనబడేవి. కానీ పర్యావరణానికి కలిగే చేటు అపారమైనది. అటవీప్రాంతం తగ్గితే కరువు, అకాలవర్షాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయి. అందువల్ల అభివృద్ధికీ, పర్యావరణ పరిరక్షణకూ సమతూకం వుండేలా ప్రభుత్వ విధానాలుండాలి. 2006 నాటి పర్యావరణ (పరిరక్షణ) చట్టం కింద రూపొందించిన పర్యావరణ ప్రభావ మదింపు నిబంధనలు కొంతమేరకు ఈ సమతూకాన్ని సాధించాయి. అయితే దాన్ని నీరుగార్చిన పర్యవసానంగా మైనింగ్ కోసం, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల కోసం, మౌలిక సదుపాయ ప్రాజెక్టుల కోసం, పారిశ్రామిక అవసరాల కోసం ఇస్తున్న అనుమతులు ఆ సమతూకాన్ని దెబ్బతీసి కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చాయని ఇటీవల ఒక ఆంగ్ల దినపత్రిక వెలువరించిన కథనాలు వెల్లడించాయి. వివిధ కారణాలవల్ల పర్యావరణ అనుమతులు పొందని కంపెనీలకు ఆర్నెల్లపాటు మినహాయింపునిచ్చిన 2017 నాటి కేంద్ర నిబంధనలే ఇందుకు కారణం. 2017–24 మధ్య వివిధ కార్పొరేట్ సంస్థలకు చెందిన బాక్సైట్, బొగ్గు, ఇనుము మైనింగ్‌లతోపాటు, సిమెంట్ ఫ్యాక్టరీలు, సున్నపురాయి వంటి వంద ప్రాజెక్టులకు అనుమతులు మంజూరయ్యాయని ఆ కథనం చెబుతోంది. 1996లో జస్టిస్ జేఎస్ వర్మ, జస్టిస్ బీఎన్ కృపాల్ ఇచ్చిన తీర్పు అడవికి విస్తృత నిర్వచనాన్నిచ్చింది. దాని ప్రకారం చట్టం నిర్వచనానికి సరిపోయే అటవీప్రాంతాలతోపాటు యాజమాన్యం ఎవరిదన్న అంశం జోలికి పోకుండా అడవిగా చట్టం గుర్తించిన అన్ని ప్రాంతాలూ అడవులుగానే భావించాలి. నిరుడు అటవీ సంరక్షణ చట్టానికి సవరణలు తీసుకొచ్చిన సందర్భంగా పార్లమెంటులో మాట్లాడిన కేంద్ర పర్యావరణమంత్రి భూపేందర్ యాదవ్ ఆ చట్టం వల్ల ఆదివాసీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో కనీసం ఆడపిల్లల కోసం మరుగుదొడ్లు కూడా నిర్మించలేకపోతున్నామని వాపోయారు. ఇందులో నిజం లేదు. 2006 నాటి అటవీ హక్కుల చట్టం అలాంటి అవసరాల కోసం మినహాయింపునిస్తోంది.

పర్యావరణ సమతూకాన్ని సాధించగలిగినప్పుడే దేశంలో హరితావరణాన్ని కాపాడుకోగలుగుతాం. చాలా దేశాలు అడవుల్ని కోల్పోయిన పర్యవసానంగా జరిగిన నష్టాన్ని గమనించుకుని వాటి పునరుద్ధరణకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాయి. బ్రెజిల్ వంటి దేశాలు అడవులను ప్రాణప్రదంగా చూసుకుంటున్నాయి. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు ప్రభుత్వాల కళ్లు తెరిపించాలి. ధర్మాసనం చెప్పినవిధంగా ఏప్రిల్ 15కల్లా దేశంలోని అన్ని రకాల అటవీ భూములపై సమగ్ర వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. అడవుల రక్షణపై పౌరుల అవగాహనను పెంపొందించే చర్యలకు ఉపక్రమించాలి.

చరిత్ర ఎరుగని వినూత్న నమూనాలు

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

వైఎస్ జగన్ భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత, గత 75 ఏళ్లలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి నమూనాను మార్చేశారు. గత ఐదేళ్లలో రాష్ట్ర మానవాభివృద్ధికి బలమైన పునాది వేయడానికి అనేక చర్యలు తీసుకున్నారు. పిల్లల నాణ్యమైన విద్య కోసం ఖర్చు చేయడం మానవ వనరుల అభివృద్ధికి ఖర్చు చేయడమే తప్ప మరొకటి కాదు. దేశంలోని వికృతమైన విద్యా వ్యవస్థలో ఇది అత్యంత కష్టతరమైన సంస్కరణ. పాఠశాలలు, కళాశాలలపై దృష్టి సారించే మానవశక్తి అభివృద్ధి నమూనాను ఇంతవరకూ ఏ మూడవ ప్రపంచ దేశంలోనూ ప్రయత్నించలేదు. అలాగే, ప్రతి సంక్షేమ పథకాన్నీ పర్యవేక్షించడానికీ వాలంటీర్లను నియమించడం కూడా ప్రజాస్వామ్య పరిపాలనలో పూర్తిగా కొత్త ఆలోచన.

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలోని అధికార వైఎస్సార్‌సీపీకీ, చంద్రబాబు నాయుడు సారథ్యంలోని తెలుగుదేశం పార్టీ, భావోద్వేగ సినీ నటుడు పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీలకూ మధ్య పోటీ నెలకొంది. జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌లు తమిళనాడులో వలె నామమాత్రపు ఆటగాళ్లుగా ఉన్నాయి. ఆసక్తికరంగా, బీజేపీ రాష్ట్ర శాఖకు చంద్రబాబు వదిన పురందేశ్వరి నాయకత్వం వహిస్తుండగా, కాంగ్రెస్ రాష్ట్ర శాఖను జగన్‌మోహన్ రెడ్డి చెల్లెలు షర్మిల నడిపిస్తున్నారు. రెండు జాతీయ పార్టీలు, తమ సమీప బంధువులైన ప్రాంతీయ పార్టీల అధినేతలను ఇబ్బంది పెట్టేందుకు మహిళా అధ్యక్షులను ఎంపిక చేశాయి. ఇలాంటి పరిస్థితి దేశంలో ఎక్కడా లేదు.

2014 ఎన్నికల నుంచి జగన్ ఒంటరి పోరాటం చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి చంద్రబాబు పొత్తుల కోసం తహతహలాడుతున్నారు. 2014లో బీజేపీతో పొత్తు పెట్టుకుని 102 సీట్లు గెలుచుకున్న చంద్రబాబు, 2019లో కేవలం 23 సీట్లు గెలుచుకుని జగన్ చేతిలో ఘోరంగా ఓడిపోయారు. అందుకే ఇప్పుడు ఆయన జనసేన, బీజేపీతో పొత్తుకు తెగ ఆరాటపడుతున్నారు. ఇది కచ్చితంగా బాబులో ఉన్న అలజడిని తెలియజేస్తోంది.

2019 ఎన్నికలకు ముందు ప్రధాని మోదీపై చంద్రబాబు దూషణలు చేసినందున, ప్రధాని ఆయనకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. 'అందితే జుట్టు... అందకపోతే కాళ్ళు' అనే తెలుగు సామెత చెప్పినట్టుగా ఉంది చంద్రబాబు రాజకీయ జీవితం. ఇప్పుడు చంద్రబాబు రాజకీయ స్థితిని మోదీ చక్కగా ఆస్వాదిస్తున్నట్లు కనిపిస్తోంది.

అయితే, ఈ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్‌కు చాలా కీలకమైనవి. ఎందుకంటే వైఎస్ జగన్ 175 సీట్లలో 151 సీట్ల భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత, గత 75 ఏళ్లలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ప్రయత్నించని విధంగా రాష్ట్ర అభివృద్ధి నమూనాను మార్చేశారు. రాష్ట్రంలోని పాఠశాల, విశ్వవిద్యాలయ విద్య ప్రాథమిక నిర్మాణాన్ని మార్చడం ద్వారా వైఎస్ జగన్, భౌతిక అభివృద్ధి అని పిలుచుకునే అభివృద్ధి నమూనాను మానవ అభివృద్ధి నమూనాగా మార్చారు. గత ఐదేళ్లలో రాష్ట్ర మానవాభివృద్ధికి బలమైన పునాది వేయడానికి జగన్ అనేక చర్యలు తీసుకున్నారు. ఆయన తీసుకున్న మొదటి అడుగు – ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టడం. భారతదేశంలోని వికృతమైన విద్యా వ్యవస్థ చరిత్రలో ఇది అత్యంత కష్టతరమైన సంస్కరణ. పట్టణ పేదల పిల్లలను, వ్యవసాయ రంగంలోని గ్రామిక జనాల పిల్లలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటూ కదలలేని



ప్రాంతీయ భాషా విద్యా విధానంలో ఉంచాయి. భాషాప్రయుక్త రాష్ట్రాల ఆలోచన పేద పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలల మెడకు చుట్టుకుంది. ధనవంతులు తమ పిల్లలను ప్రైవేట్ ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చేర్పిస్తే, గ్రామీణ ప్రజలలో మాత్రం ప్రాంతీయ భాషావాదం ప్రచారం చేశారు. పాఠశాల మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన, ఆర్థిక స్థోమత లేని పిల్లలకు మంచి ఆహారం కోసం బడ్జెట్‌ను ఖర్చు చేయడానికి ఏ ప్రభుత్వమూ కూడా సిద్ధపడలేదు. పిల్లల నాణ్యమైన విద్య కోసం ఖర్చు చేయడం మానవ వనరుల అభివృద్ధికి ఖర్చు చేయడమే తప్ప మరొకటి కాదు. అసెంబ్లీల బడ్జెట్ సమావేశాల్లో చర్చలన్నీ రోడ్లు, భవ నాలు, అప్పుడప్పుడు డ్యామ్‌లకు మాత్రమే డబ్బు ఖర్చు చేసే విధంగా సాగుతుంటాయి. ఇలాంటి భౌతిక అభివృద్ధిలో భారీ మొత్తంలో డబ్బులు కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళతాయి.

పాఠశాల విద్యకూ, విశ్వవిద్యాలయ విద్యకూ; పేద పిల్లల తల్లిదండ్రుల ఖాతాలకు నగదు బదిలీ పథకాలకూ గణనీయమైన మొత్తంలో బడ్జెట్‌ను కేటాయించడం ద్వారా ఆ నమూనాను జగన్ ప్రభుత్వం మార్చింది. ఇది దళారుల పాత్రను రూపుమాపింది. ఈ మార్పు అంతరార్థం ఏమిటంటే దళారీ వ్యవస్థ బలహీనపడుతుంది. తాము పొరపాటున అధికారంలోకి వచ్చినా, పాత భౌతిక వనరుల అభివద్ధి నమూనా వైపు తిరిగి వెళ్లలేమన్నది ప్రతిపక్ష పార్టీల ఆందోళన. అదే వైఎస్ జగన్ తిరిగి అధికారంలోకి వస్తే, సంస్కరణలు మరింత లోతుగా సాగుతాయి. పది పదిహేనేళ్లలో మంచి విద్యావంతులు, ఆత్మవిశ్వాసం ఉన్న గ్రామీణ యువత సామాజిక–రాజకీయ వ్యవస్థలోకి వస్తారు. మానవ వనరుల అభివృద్ధికి అలవాటు పడిన ఆర్థిక వ్యవస్థను మార్చడానికి వారు అనుమతించరు. పైగా ఉద్యోగస్వామ్యంతో పనిలేని అవినీతి రహిత కార్యకలాపాల కోసం పని చేస్తారు.

వివిధ స్థాయుల పరిపాలనలో 'సివిల్, పోలీసు నియంతల' వలె పని చేయాలనుకునే అవినీతి ఉద్యోగులు, ఉన్నత స్థాయి బ్యూరోక్రాట్లు కూడా ఈ మానవ అభివృద్ధి నమూనాకు మద్దతు ఇవ్వడానికి ఇష్టపడరు. కానీ నగదు బదిలీ జీవితాన్ని రుచి చూసిన పేద గ్రామీణ, పట్టణ ప్రజలు కొత్త వ్యవస్థకు కచ్చితంగా మద్దతు ఇస్తారు.

ప్రతి సంక్షేమ పథకాన్నీ పర్యవేక్షించడానికీ వాలంటీర్లను నియమించడం ప్రజాస్వామ్య పరిపాలనలో పూర్తిగా కొత్త ఆలోచన. వృద్ధులకు, రోగులకు ప్రభుత్వం నుండి వృద్ధాప్య పింఛన్ అందేలా లేదా రేషన్ వంటి ప్రయోజనాలను ఇంటి వద్దే ఇచ్చేలా వీరు సాయపడుతున్నారు. మధ్య, ఉన్నత స్థాయి బ్యూరోక్రాట్లు గ్రామాల్లో ఉన్న స్వచ్ఛంద సేవకులపై అసంతృప్తిగా ఉన్నప్పటికీ, పెద్ద సంఖ్యలో ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఒక గ్రామంలోని వాలంటీర్ ప్రతి గ్రామస్థునికీ ఒక సహాయ హస్తం!

పాఠశాలలు, కళాశాలలపై దృష్టి సారించే మానవశక్తి అభివృద్ధి నమూనాను ఇంతవరకూ ఏ మూడవ ప్రపంచ దేశంలోనూ ప్రయత్నించలేదు. ఉదాహరణకు, చైనా... విద్య, ఆరోగ్య వ్యవస్థలలో ఒక రకమైన సారూప్య వ్యవస్థను ప్రయత్నించింది. వారు పెద్ద సంఖ్యలో కాలినడక వైద్యులను నియమించారు. మెరుగైన పర్యవేక్షణ వ్యవస్థలతో కూడిన అసమానమైన ఆరోగ్య మౌలిక సదుపాయాలను కూడా జగన్ కల్పించారు. కరోనా సంక్షోభాన్ని అధిగమించడంలో ఇది ఎంతో సహాయపడింది. ఆరోగ్య రంగంలో కూడా గ్రామ వాలంటీర్లు చక్కటి పని చేస్తున్నారు. ఈ కొత్త ప్రయోగాలన్నీ దేశంలోని కాంట్రాక్టర్ వర్గాన్ని ఆశ్చర్యపరిచాయి.

కాంట్రాక్టర్ వర్గం భౌతికాభివృద్ధిని కోరుకుంటుంది కానీ భారీ స్థాయి మానవ శక్తి అభివృద్ధిని కాదు. తెలంగాణలో నా చిన్నతనంలో స్థానిక భూస్వాములు ఊరి స్కూల్ టీచర్లను చదువు చెప్పవద్దనీ, జీతం తీసుకుని ఇంట్లో సంతోషంగా ఉండమనీ అనేవారు. పల్లెటూరి పిల్లలందరూ చదువుకుంటే తమ పశువుల చుట్టూ బాలకార్మికులుగా ఎవరు పని చేస్తారు, పెద్దయ్యాక జీతగాళ్లుగా ఎవరు పని చేస్తారన్నది వారి తర్కం. ఆ సమయంలో భూస్వాములు విద్య ద్వారా మానవ శక్తిని అభివృద్ధి చేయడాన్ని భూస్వామ్య వ్యతిరేకతగా చూశారు. ఇప్పుడు ఏపీలో ఇంగ్లీషు విద్యావంతులైన మానవశక్తిని అభివృద్ధి చేయడాన్ని కాంట్రాక్ట్ వ్యతిరేక పెట్టుబడిగా చూస్తున్నారు. కాంట్రాక్ట్ పెట్టుబడికీ, ప్రైవేట్ విద్యా రంగానికీ, చంద్రబాబుకూ చాలా దగ్గరి సంబంధం ఉంది.

2024 ఎన్నికలలో జగన్ గెలిస్తే ఈ మోడల్ దాని మూలాలను మరింత లోతుగా పాతుకుపోయేలా చేస్తుంది. పైగా దానిని ఎవరూ మార్చలేరు. ఇది జాతీయ విద్యావ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇదా గౌరవం?



అత్యంత ప్రాధాన్యం గల తమ ప్రకటనల్లోంచి డాక్టర్ వర్గీస్ కురియన్‌ను తొలగించింది 'అమూల్'. ఒక్కొక్క రాయి పేర్చి ఆయన ఆ సంస్థను నిర్మించారు. అంతటా మోదీ మోదీ మాత్రమే! అదేదో ఇండియా 2014 లోనే పుట్టినట్టూ, అంతకుముందేమీ లేనట్టూ!

– సందీప్ మనుధానే, విద్యావేత్త

భారతీయుడిని!



మా నాన్న తన జీవితాంతం జిన్నానూ, పాకిస్తాన్‌నూ వ్యతిరేకించాడు. దేశవిభజన తప్పదు అనుకున్నప్పుడు లాహోర్ నుంచి ఢిల్లీకి వలస వచ్చాడు. స్కూల్లోనూ, ఆఖరికి పార్లమెంటులోనూ నన్ను పాకిస్తానీ అన్నారు. జిన్నా ప్రతిపాదించిన రెండు దేశాల సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన లక్షలాది మంది ముస్లింలు ఎదుర్కొనే దారుణమైన దూషణ ఇది. ఇదే తరహా దూషణకు గురయ్యే సిక్కుల బాధను నేను అర్థం చేసుకోగలను.

– షాహిద్ సిద్దిఖీ, ఆర్‌ఎల్‌డీ నేత

అంతవరకే...



నిత్యం సందడిగా ఉండే భారత రాజకీయాలకు తాను సరిపోతానని రాహుల్ గాంధీ నటించడం మానుకుంటే మంచిదని నా అభిప్రాయం. ఆయనకు ఉన్న పేరు గుర్తింపునకు ఇన్‌స్టాగ్రామ్ ట్రావెల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా బాగా పనికొస్తారు. నేషనల్ జియోగ్రాఫిక్ కూడా ఆయనకో షో ఇవ్వొచ్చు.

– సదానంద్ ధూమే, వాల్‌స్ట్రీట్ జర్నల్ కాలమిస్ట్

అదే సాక్ష్యం



ఒక పార్శీ కుటుంబం నడిపే టాటా గ్రూప్ మొత్తం పాకిస్తాన్ స్థూల జాతీయోత్పత్తి కంటే ఎక్కువగా పెరిగింది. ఇండియాలో మైనారిటీ వ్యతిరేక ఎజెండా ఉండివుంటే, మతపీడన వల్ల ఇండియాకు శరణార్థులుగా వచ్చిన ఈ చిన్న సమాజం ఇంత విజయవంతం కాకపోయేది.

– ఒమార్ ఘూజీ, రచయిత

లేని మమత



పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే, రానున్న తరాల్లో తల్లిదండ్రులు తమ కూతుళ్లకు మమత అని పేరు పెట్టడం ఆపేస్తారు. చూస్తూ ఉండండి.

– శాశ్వతీ సర్కార్, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

సాహితీ చందురుడు

ప్రజల నాడి తెలుసుకుని సమాజంలోని రుగ్మతలకు కాయకల్ప చికిత్స చేసే రచయిత వైద్యుడు లాంటివాడు. నిజంగా అలాంటి వైద్యుడు రచయిత కూడా అయితే... ఆ చికిత్స మహాద్భుతం. విజయవాడకు చెందిన డాక్టర్ జి.వి. పూర్ణచందు ఆ కోవలోకే వస్తారు. తాత, తండ్రుల నుంచి సాహితీ సంపదను వారసత్వంగా పొందారు. అంతకుమించి చదువు నేర్పిన గురువులు, సాహితీ దిగ్గజాల అడుగుజాడల్లో నడుస్తూ స్వతహాగా ఎదిగారు. యాభై ఏళ్ల కిందట స్లేట్ చేతపట్టకముందే కలం పట్టిన ఆయన ప్రస్తుతం చెయ్యి తిరిగిన ప్రముఖ రచయితల్లో ఒకరు. డాక్టర్ జి.వి. పూర్ణచందు చారిత్రక, వైజ్ఞానిక, పాకశాస్త్ర, సైన్స్ విభాగాల్లో ఎన్నో రచనలు చేశారు. 143 పుస్తకాలను ప్రచురించారు. కొన్ని పత్రికలకు సంపాదకుడిగా, మరికొన్నింటిలో కాలమిస్టుగా సేవలందించారు. ఆయన రచనలు 'సప్తసింధు' (నవల), 'కాంతిస్వప్న' (దీర్ఘ కవిత), జీవిత చరిత్ర తదితర రచనలపై ఎంఫిల్, ఆయన సాహితీ జీవితంపై పరిశోధనలు గావించి పలువురు పీహెచ్‌డీలు పొందడం విశేషం.



డా॥ జి.వి. పూర్ణచందు

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్న పూర్ణచందు ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణా జిల్లా రచయితల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 'హంస' పురస్కారం, అధికార భాషా సంఘం నుంచి 'తెలుగు భాషా' పురస్కారం, వేటూరి ప్రభాకరశాస్త్రి పీఠం, తిరుమల తిరుపతి దేవస్థానం, జానమద్ది వారి పురస్కారాలూ, 'అజోవిభో' సత్కారం... ఇలా లెక్కకు మించిన అవార్డులూ, రివార్డులూ అందుకున్నారు.

– చెన్నాప్రగడ వీఎన్నెస్ శర్మ ౹ సీనియర్ జర్నలిస్ట్

(ఫిబ్రవరి 25న విజయవాడలో డా॥ జి.వి. పూర్ణచందు సాహితీ స్వర్ణోత్సవం)

వ్యవస్థను సంస్కరిస్తేనే... రైతుకు రక్షణ

అభిప్రాయం



సారంపల్లి మల్లారెడ్డి

తెలంగాణలో మార్కెట్ కమిటీ, కొనుగోలు దారులు, అడిదారులు (దళారీలు) కుమ్మక్కై రైతులను నష్టపరుస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ చట్టాలు ఉన్నా వాటి అమలును ఎవరూ పట్టించుకోవడం లేదు. మార్కెట్ కమిటీలు కొనుగోలు దారులకు లాభాలు ఆర్జించి పెడుతున్నాయే తప్ప రైతులకు ఏలాంటి రక్షణ కల్పించడం లేదు. చివరికి రైతు బజార్‌లో కూడా కూరగాయల అమ్మకంలో రైతులు మోసపోతూనే ఉన్నారు. మార్కెట్ వ్యవస్థను సంస్కరించకుండా రైతులకు రక్షణ కల్పించడం సాధ్యం కాదు.

రైతు సరుకు మార్కెట్‌కు తెచ్చినప్పుడు గేటు వద్దనే నాణ్యత పరిశీలించి గ్రేడింగ్ నిర్ణయించాలి. తూకం వేసి రిజిష్టర్‌లో నమోదు చేయాలి. కానీ ఇవేమీ చేయకుండానే రైతులు తమ సరుకును మార్కెట్‌కు తేగానే కమీషన్‌దారు వచ్చి సమాచారం సేకరిస్తాడు. ఆ తరువాత కొనుగోలుదారులను పిలిచి కొన్ని మార్కెట్లలో వేలం వేస్తారు. మరి కొన్ని మార్కెట్లలో కమీషన్‌దారు కొనుగోలు దారుతో కుమ్మక్కై... నిర్ణయించిన మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముతాడు. ఇదంతా మార్కెట్ కమిటీ కనుసన్నల్లోనే నడుస్తుంది.

ప్రతి మార్కెట్‌లో శాంపిల్స్ టెక్నికల్ ఆఫీసర్ ఉండి, రైతుల సరుకుల నాణ్యతను పరిశీలించి గ్రేడింగ్ చేయాలి. కానీ, అన్ని మార్కెట్లలోనూ ఈ ఉద్యోగం ఖాళీగానే ఉంటోంది. తక్కువ ధరకు కొనుగోలు చేసిన కొనుగోలుదారు తూకం వేసే సందర్భంలో సరుకు నాణ్యత తక్కువగా ఉన్నదని అదనపు తూకం వేస్తాడు. దాని ప్రకారం రైతుకు 'తక్పట్టి'' (రశీదు) ఇస్తారు. రశీదులోని డబ్బులు చెల్లించేటప్పుడు మళ్లీ కోత పెడతారు. నాణ్యతా ప్రమాణాలు నిర్ణయించడంలో లోపం, అదనపు తూకం వేయడం, ఇచ్చిన రశీదులోని బిల్లులు పూర్తిగా చెల్లించకపోవడం వల్ల ఏటా రూ. 500 కోట్లు రైతులు నష్టపోతున్నారు. ఒక్క వరి కొనుగోలులోనే ఐకేపీ కేంద్రాలు, మార్కెట్ కమిటీలు, రైస్ మిల్లర్లు కలిసి ఈ కుంభకోణం కొనసాగిస్తున్నారు. దీనిపై మార్కెట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితాలూ లేవు. చివరికి రైతులపై దాడులు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితులను గమనించిన అనేక మంది రైతులు తమ వ్యవసాయోత్పత్తులను మార్కెట్‌కు తీసుకురాకుండా ఇంటివద్దనో, ప్రైవేట్ మిల్లర్ల వద్దనో అమ్ముకుంటున్నారు. వరి, పత్తి,



వేరుసెనగ, మిరప, పసుపు తదితర వాణిజ్య పంటల్లో కమీషన్‌దారుకు నిర్ణయించిన రెండు శాతం కన్నా అదనంగా నాలుగైదు శాతం కమీషన్ తీసుకుంటారు. మార్కెట్లలో త్రాగునీటి సౌకర్యం ఉండదు. విశ్రాంతి గృహాలు పని చేయవు. ఏ– గ్రేడ్ మార్కెట్లలో కూడా రైతుల సరుకుకు రక్షణ ఉండదు. దొంగతనాలు, దోపిడీలు, శాంపిల్స్ పేరుతో క్వింటాళ్ల కొద్దీ రైతుల నుండి అక్రమంగా తీసుకుంటున్నారు.

పైన పేర్కొన్న అంశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవాలి. ధరల నిర్ణాయక కమిషన్ వేయడంతో పాటు ఆ ధరలకు సరుకులను కొనుగోలు చేసి అమ్మడానికి తగిన యంత్రాంగాన్ని, గోదాములను అందుబాటులో పెట్టాలి. ప్రస్తుతం రైతుల ఉత్పత్తులలో 20 శాతం వృథా అవుతున్నట్లు ఒక సర్వేలో తెలిపారు. ఆ నష్టం జరుగకుండా, సరుకు నాణ్యతను దెబ్బ తినకుండా చూసే విధంగా గోదాం సౌకర్యం కల్పించాలి. ఉత్పత్తి ధరపై 50 శాతాన్ని అధికంగా నిర్ణయించి ఆ ధరకు మార్కెట్లో అమ్మకాలు సాగాలి. మార్కెట్ నుండి కొనుగోలుదారు తన సొంత ఖర్చుతో తన గోదాంకు సరుకులను బదిలీ చేసుకోవాలి. కొనుగోలు చేసిన రెండు రోజులలో రైతుకు డబ్బులు చెల్లించాలి. కమీషన్‌దారు (ఆస్తిదారు) ముందు రైతుకు డబ్బులు చెల్లించి ఆ తరువాత కొనుగోలుదారు నుండి రాబట్టుకోవాలి. కొనుగోలుదారు చెల్లించడంలో వైఫల్యం చెందినప్పుడు తన నిధుల నుండి రైతుకు డబ్బులు చెల్లించాలి. మార్కెట్ కమిటీలు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను కంపెనీల నుండి తెప్పించి అమ్మాలి. ఏ మాత్రం కల్తీ జరిగినా ఆ పరిహారాన్ని మార్కెట్ కమిటీలు రైతుకు చెల్లించాలి. మార్కెట్లలో రైతులకు రక్షణ, ప్రాథమిక సౌకర్యాలు, విశ్రాంతి గృహాలు ఏర్పరచాలి. ఉత్పాదకతను పెంచడానికి శాస్త్రవేత్తలతో సమావేశాలు జరిపి యువ రైతులకు ట్రైనింగ్ ఇవ్వాలి. భూసార పరీక్షలు జరిపి వాటి ఆధారంగా ఏ పంటలు వేయాలో రైతులకు వివరించాలి. రైతుబజార్ ద్వారా కూరగాయల విత్తనాలను, సలహాలను వెంట వెంట రైతులకు అందించాలి. రైతుబజార్లకు గ్రామం నుండి రవాణా సౌకర్యాన్ని మార్కెట్ కమిటీలు కల్పించాలి.

ప్రజాస్వామ్యయుతంగా మార్కెట్ కమిటీలను ఎన్నుకుని వారి ద్వారా వ్యాపారాలు సాగించాలి. వ్యవసాయ ఉత్పత్తులు తాకట్టు పెట్టుకుని రైతులకు అప్పులిచ్చే విధానాన్ని (రైతుబంధు) రైతులకు మాత్రమే వినియోగించాలి. ప్రతి మార్కెట్లో గోదాముల సౌకర్యాన్ని మెరుగుపర్చాలి.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

ఇదే నేటి మహాయోగం!

మనిషి ఆనందంగా జీవితాన్ని కొనసాగించటానికీ, మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పర్చుకోవడానికీ కృషిచేసిన మహనీయురాలు పరమ పూజ్యశ్రీ మాతాజీ శ్రీ నిర్మలా దేవి. మనుషులు తమలో ఉన్న దైవిక శక్తిని గుర్తించి, కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారాన్ని పొందే పక్రియకు శ్రీకారం చుట్టారు మాతాజీ. ఆమె అందించిన యోగమే సహజయోగం. అదే నేటి మహాయోగం. ఆమె ప్రసాదించిన సహజయోగ పక్రియ నేడు ప్రపంచవ్యాప్తంగా 140కి పైగా దేశాల్లో కొనసాగుతోంది. స్వతహాగా డాక్టర్ అయిన మాతాజీ నిర్మలాదేవి, మానవులు ఆధ్యాత్మిక ఉన్నతి పొందేందుకుగాను సహజ యోగాన్ని స్థాపించారు. మాతాజీ నిర్మలాదేవి 1923లో రాత్రీ, పగలు సమానంగా ఉండే రోజైన ఫిబ్రవరి 21న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని చింద్వారాలో జన్మించారు.



మాతాజీ శ్రీ నిర్మలాదేవి

మనకు భగవంతుడు ప్రసాదించిన శక్తిని మళ్లీ భగవంతునితో కలుపుకోవడమే సహజ యోగం. ఈ ధ్యానంలో మనిషి మొదటగా తనలోని అంతర్గత శక్తియైన కుండలినీ శక్తి గురించి తెలుసుకుంటాడు. నిద్రాణ స్థితిలో ఉన్న కుండలినీ శక్తిని మాతాజీ చిత్రపటం సహాయంతో, సహజ సాధకుల సహకారంతో ఆత్మ సాక్షాత్కారం పొందొచ్చు. కుండలినీ జాగృతి ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందిన సాధకుడు తనలోని భూత, భవిష్యత్, వర్తమాన ఆలోచనలను తగ్గించుకుని మధ్యే మార్గంలోకి వస్తాడు. ప్రస్తుత క్షణాన్ని ఆనందించే స్థితికి వస్తాడు. ఈ ఆనందకరస్థితి ద్వారా ఆరోగ్యం మెరుగు పడుతుంది. మనిషి ఒత్తిడికి దూరంగా ఉంటాడు. ఆలోచనా విధానం మారుతుంది. సత్యం వైపు అడుగులు వేస్తాడు. ఈ క్రమంలో తమో, రజో గుణాలను వదిలి సత్వ గుణాన్ని అలవర్చుకుంటాడు. మనిషి ఆత్మ ప్రకాశాన్ని పొంది భగవంతుని ప్రతి రూపమైన ఆత్మ తనలో కొలువై ఉందనే సత్యాన్ని గ్రహిస్తాడు. ఆత్మ– పరమాత్మ వేరు కాదనీ, రెండూ ఒక్కటేననీ గుర్తిస్తాడు. కానీ మనిషి సహజంగా మాయకు గురౌతాడు. అంతా భగవంతుడే చేస్తున్నాడనే విషయాన్ని ఆత్మసాక్షాత్కారంద్వారా తెలుసుకున్నప్ప టికీ మళ్లీ మాయలో పడి తానే అన్నీ చేస్తున్నానని అనుకుంటాడు.

ఆధ్యాత్మిక సాధన చేసే వ్యక్తి ప్రతిరోజూ ధ్యానం ద్వారా భూత, భవిష్యత్ ఆలోచనలను వదిలిపెట్టి వర్తమానంలోకి రావటం కోసం సాధన చేయాలి. ఈ సాధన ద్వారా మనిషి వివేకాన్నీ, శుద్ధ విద్యనూ, సంతృప్తినీ, ధైర్యాన్నీ, క్షమాగుణాన్నీ పొంది సత్వ గుణంలో స్థిరపడతాడు. ఆత్మ సాక్షాత్కారం పొందిన వ్యక్తిని 'యోగి' అని అంటారు. మనిషిలోని కుండలినీ శక్తిని జాగృతం చేసి మూడు నాడులు (ఇడా, పింగళ, సుషుమ్నా), ఏడు చక్రాల (మూలాధార, స్వాధిష్ఠాన, నాభి, అనాహత, విశుద్ధి, ఆజ్ఞా, సహస్రార)ను శక్తివంతం చేసుకునే విధానాన్ని మానవాళికి అందించిన మాతాజీ నిర్మలాదేవి వర్ధంతి (ఫిబ్రవరి 23 – పరమ చైతన్య దివస్) సందర్భంగా అక్షర నీరాజనం.

– సద్గుర్తి నాగశిరోమణి, సహజయోగ సాధకురాలు
(నేడు మాతాజీ నిర్మలా దేవి వర్ధంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.చతుర్దశి ప.3.17 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ఆశ్లేష రా.7.18 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ఉ.7.10 నుండి 8.54 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.43 నుండి 9.31 వరకు, తదుపరి ప.12.37 నుండి 1.25 వరకు, **అమృతఘడియలు:** సా.5.34 నుండి 7.22 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.27, **సూర్యాస్తమయం:** 6.00.

గురివింద రామోజీ
రామోజీ-2

అయినా రామోజీ మారలేదు...

అక్రమ డిపాజిట్లు ఆగలేదు

మార్గదర్శి ఫైనాన్షియర్స్ మూసివేసినా ఆగని ఆర్థిక అక్రమాలు ● మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో అక్రమ డిపాజిట్ల దందా

సాక్షి, అమరావతి : ఈనాడు పత్రికాధిపతిగా శ్రీరంగ నీతులు వల్లించే చెరుకూరి రామోజీరావు.. 'మార్గదర్శి' అధినేతగా యథేచ్ఛగా ఆర్థిక దోపిడీకి పాల్పడుతుంటారు. చట్టాలను ఎడాపెడా ఉల్లంఘిస్తూ ఆయన సాగించే ఆర్థిక దోపిడీకి ఈనాడు పత్రికను రక్షా కవచంగానే వాడుకుంటున్నారన్నది నగ్న సత్యం. మరోవైపు చంద్రబాబుకు రాజగురువు కాబట్టి తాను చట్టాలకు అతీతమని భావిస్తూ ఉంటారు. పత్రికాధిపతి కాబట్టి ఆయన అక్రమాలను ఎవరూ ప్రశ్నించకూడదని వాదిస్తూ ఉంటారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం చేపట్టిన కఠిన కార్యాచరణతో 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'ను మూసివేసుకోవాల్సి వచ్చినా, అక్రమ డిపాజిట్ల దందాను మాత్రం విడిచిపెట్టలేదు. 'మార్గదర్శి చిట్‌ఫండ్స్' పేరిట డిపాజిట్లు యథేచ్ఛగా వసూలు చేస్తూ భారీగా ఆర్థిక అక్రమాలను కొనసాగించారు. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం, రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టాలను దర్జాగా ఉల్లంఘిస్తూ అక్రమ డిపాజిట్లు వసూలు చేసి ఆ నిధులను సొంత ప్రయోజనాల కోసం దారి మళ్లించారు. గత ఏడాది స్టాంపులు, రిజిస్ట్రేషన్లు శాఖ, సీఐడీ అధికారులు రాష్ట్రంలోని 38 మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో చేసిన సోదాలతో ఈ ఆర్థిక దోపిడీ ఆధారాలతో సహా బట్టబయలైంది. దాంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ చైర్మన్ చెరుకూరి రామోజీరావు ఏ-1గా, ఆయన పెద్ద కోడలు, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ చెరుకూరి శైలజ ఏ-2గా, మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లను ఏ-3గా సీఐడీ కేసు నమోదు చేసింది. వారిపై సెక్షన్లు 120 (బి), 409, 420, 477 (ఎ) రెడ్‌విత్ 34 సీఆర్‌సీపీ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లను సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. రామోజీరావు, శైలజ కిరణ్‌ను విచారించి కీలక సమాచారాన్ని రాబట్టారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో రామోజీరావు సాగించిన ఆర్థిక దోపిడీ తీరు ఇదిగో ఇలా ఉంది..



భారీగా అక్రమ డిపాజిట్ల సేకరణ

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం-1982, బ్యానింగ్ ఆఫ్ నాన్ రెగ్యులేటెడ్ డిపాజిట్ స్కీమ్స్ (బీయూడీఎస్)-1999 చట్టాలను ఉల్లంఘిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో రామోజీరావు యథేచ్ఛగా అక్రమంగా డిపాజిట్లను సేకరించారు. ఆ రెండు చట్టాల ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీలు వాటి ఖాతాదారులు, ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించకూడదు. కానీ ఈ చట్టాన్ని రామోజీరావు ఏమాత్రం పట్టించుకోకుండా యథేచ్ఛగా అక్రమ డిపాజిట్లు సేకరించారు. రశీదు రూపంలో డిపాజిట్లు సేకరించారు. యాజమాన్య కోటా టికెట్ల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారు. చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా రామోజీ సొంత కంపెనీలు, మ్యూచువల్ ఫండ్స్‌లో అక్రమ పెట్టుబడులుగా పెట్టి భారీగా సొంత ఆస్తులు పెంచుకున్నారు.

రశీదుల ముసుగులో అక్రమ డిపాజిట్లే

రశీదులు, భవిష్యత్ చిట్టీలకు ష్యూరిటీల పేరుతో రామోజీరావు అక్రమ డిపాజిట్ల దందా కొనసాగిస్తున్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థలో చిట్టీ పాడిన చందాదారులకు వారికి రావాల్సిన సొమ్ములో మొత్తం చెల్లించడంలేదు. అందులో కొంత సొమ్మును సంస్థ వద్ద డిపాజిట్‌గా ఉంచుకుంటోంది. ఆమేరకు ఓ రశీదు ఇస్తోంది. అలా రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు చందాదారుల నుంచి రశీదు రూపంలో డిపాజిట్లు సేకరిస్తోంది. ఆ డిపాజిట్లపై 4 శాతం, 5 శాతం వడ్డీ చెల్లిస్తామని చెబుతోంది. ఏదైనా ఆర్థిక సంస్థ ఖాతాదారుల నగదును దాని వద్ద అట్టిపెట్టుకుని దానిపై వడ్డీ చెల్లిస్తామని లిఖితపూర్వకంగా తెలిపితే దానిని డిపాజిట్‌గానే పరిగణిస్తారు. అలా డిపాజిట్లు సేకరించాలంటే ఆర్‌బీఐ నిబంధనలను అనుసరించాలి. ఆర్‌బీఐ నిబంధన ప్రకారం చిట్‌ఫండ్స్ సంస్థలు డిపాజిట్లు వసూలు చేయకూడదు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ రశీదు ముసుగులో డిపాజిట్లు సేకరిస్తోంది. ఇక చందాదారుల నుంచి ష్యూరిటీ తీసుకోవడానికి కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం నిర్దేశించిన విధానాలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ వ్యవహరిస్తోంది. జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల పత్రాలు, బంగారు ఆభరణాలు, లైఫ్ ఇన్సూరెన్స్ పత్రాలు, స్థిరాస్తి పత్రాలు గానీ ముగ్గురు వ్యక్తుల హామీ గానీ ష్యూరిటీగా తీసుకోవాలని చట్టం నిర్దేశించింది. అంతే కానీ, చిట్టీ పాట కింద చెల్లించాల్సిన మొత్తంలోనే కొంత ష్యూరిటీగా అట్టిపెట్టుకోడానికి అవకాశం లేదు. కానీ రామోజీరావు తమ చందాదారుల చిట్టీ పాట మొత్తం నుంచి కొంత భాగాన్ని ష్యూరిటీ పేరుతో అట్టిపెట్టుకుంటున్నారు. ఆ పేరుతో అక్రమంగా డిపాజిట్లు వసూలు చేస్తున్నారు.

యాజమాన్య టికెట్ల పేరుతో దందా

యాజమాన్య కోటా పేరుతో చిట్టీ గ్రూపుల్లోని టికెట్ల ముసుగులో రామోజీరావు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. చిట్‌ఫండ్ కంపెనీలు వేసే చిట్టీలలో నిర్ణీత చందాదారుల సంఖ్య (వీటిని టికెట్స్ అని వ్యవహరిస్తారు)లో కొన్ని ఖాళీగా ఉండిపోతాయి. అలా ఖాళీగా ఉండిపోయే టికెట్స్‌ను ఆ కంపెనీ తీసుకోవాలి. ఆ టికెట్స్‌పై చందాను కంపెనీయే చెల్లించాలి. తరువాత కొత్త చందాదారులు వస్తే వాటితో ఆ టికెట్స్‌ను భర్తీ చేయవచ్చు. చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్లు 27, 32లలో స్పష్టంగా నిర్దేశించిన ఈ నిబంధనలను రామోజీరావు ఏనాడూ పట్టించుకోలేదు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏర్పాటు చేసినప్పుడు ప్రతి చిట్టీలోనూ కనీసం ఒకటి నుంచి 50శాతం టికెట్లను సొంతంగా కలిగి ఉంటామని పేర్కొంది. కానీ తమ పేరుతో ఉన్న టికెట్లపై చందాను ఏనాడూ చెల్లించ లేదు. కేవలం ఒక చిట్టీలోని తమ పేరుతో ఉన్న టికెట్లకు చెల్లించాల్సిన మొత్తాన్ని మరో చిట్టీలోని టికెట్లపై డిస్కౌంట్ మొత్తం నుంచి.., మళ్లీ ఆ చిట్టీలోని తమ టికెట్లను మరో చిట్టీలోని డిస్కౌంట్ మొత్తం నుంచి మళ్లించినట్టు రికార్డుల్లో కనికట్టు చేసింది. అంటే సంస్థ పేరిట ఉన్న టికెట్లపై మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందా ఏనాడూ చెల్లించలేదు. కేవలం రికార్డుల్లో జంబ్లింగ్ అంటే బుక్ అడ్జస్ట్‌మెంట్స్ ద్వారా చూపించి చందాదారులను మోసం చేసింది. మళ్లీ తమ టికెట్లపై చందా పాట మొత్తాన్ని మాత్రం వసూలు చేసుకుంటోంది. ఆ విధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఒక్క రూపాయి కూడా చందాగా పెట్టకుండానే భారీగా చందాదారుల సొమ్మును దాని ఖాతాల్లోకి మళ్లించుకుంటోంది.

ఆ ఒక్క బ్యాంకు ఖాతా... రామోజీ దోపిడీకి కేంద్ర బిందువు

బ్యాంకు ఖాతాల నిర్వహణలోనూ రామోజీరావు నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. చిట్‌ఫండ్ సంస్థలు ప్రతి చిట్టీకి ఓ ప్రత్యేక బ్యాంకు ఖాతా నిర్వహించాలి. ఆ చిట్టీకి సంబంధించిన చందాల వసూళ్లు, చెల్లింపులు వంటివి దాని ద్వారానే జరగాలి. ఇలా ఏఏ బ్యాంకు ఖాతాల ద్వారా చిట్టీలు నిర్వహిస్తారో వెల్లడించాలి. ఈ నిబంధనలను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఉల్లంఘిస్తోంది. అన్ని చిట్టీల చందా మొత్తాలన్నింటినీ ఒకే బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది. చిట్టీల ఒప్పందాల్లో కేవలం బ్యాంకు పేరునే పేర్కొంటోంది గానీ, బ్యాంకు ఖాతాల నంబర్లు, ఇతర వివరాలను ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తోంది. తద్వారా ఒక బ్యాంకు ఖాతాలో భారీ మొత్తాన్ని పోగేస్తోంది. రామోజీరావు ఇలా చేయడం వెనుక అతి పెద్ద ఆర్థిక కుతంత్రం దాగుంది. నిబంధనల ప్రకారం చిట్టీల బ్యాంకు ఖాతాలపై చిట్‌ఫండ్ సంస్థ బ్రాంచి మేనేజర్ (ఫోర్‌మేన్)కు చెక్ పవర్ ఉండాలి. ఆ మేనేజరే చందాదారులకు చిట్టీ మొత్తాన్ని చెల్లించడంతోపాటు ఆన్‌లైన్ వ్యవహారాలు నిర్వహించాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థలో ఏ బ్రాంచి మేనేజర్‌కూ చెక్ పవర్ ఇవ్వలేదు. చెక్ పవర్ అంతా ప్రధాన కార్యాలయం వద్దే అట్టిపెట్టారు. రామోజీరావు, శైలజ కిరణ్‌తోపాటు ప్రధాన కార్యాలయంలో ఉన్న కొద్దిమందికే చెక్ పవర్ కల్పించారు.

సొమ్ము చందాదారులది.. సోకు రామోజీది

కేంద్ర చట్టం ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీలు చందాదారుల సొమ్మును ఇతర కంపెనీల్లో పెట్టుబడిగా పెట్టకూడదు. కానీ రామోజీరావు మాత్రం చందాదారుల సొమ్మును సొంత ఆర్థిక ప్రయోజనాల కోసం అక్రమ పెట్టుబడులుగా మళ్లిస్తున్నారు. తమ కుటుంబ సభ్యులే డైరెక్టర్లుగా ఉన్న ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజస్, మార్గదర్శి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ - చెన్నై, మార్గదర్శి చిట్స్ (కర్ణాటక) ప్రైవేట్ లిమిటెడ్ -బెంగళూరులో అక్రమ పెట్టుబడులుగా తరలించారు. ఆ కంపెనీల్లో ఏకంగా 88.5శాతం వాటా పెట్టుబడిగా పెట్టడం గమనార్హం. దాంతోపాటు ముంబైలోని పలు మ్యూచువల్ ఫండ్స్‌లో అక్రమ పెట్టుబడులు పెట్టారు. రామోజీరావు సొంతంగా రూపాయి కూడా పెట్టుబడి పెట్టకుండా చందా దారుల సొమ్మును అక్రమంగా పెట్టుబడులుగా మళ్లిస్తూ భారీగా అక్రమ ఆదాయాన్ని పొందుతున్నారు.

వైభవంగా పూర్వగిరీశుడి కల్యాణం



శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవంలో భాగంగా కంకణ ధారణ నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: పూర్వగిరి (పాతగుట్ట) శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గురువారం రాత్రి శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణ వేడుక కనుల పండువగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన కల్యాణ మహోత్సవాన్ని పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం వేదపండితులు జరిపించారు. గజవాహనంపై శ్రీస్వామి వారు, ప్రత్యేక పల్లకిపై శ్రీలక్ష్మీదేవి ఆలయం నుంచి ఆస్థాన కల్యాణ మండపానికి చేరుకున్నారు. వేదపండితులు విష్వక్సేనుడిని ఆరాధించి కల్యాణ తతంగాన్ని ప్రారంభించారు. జంధ్యధారణ, జీలకర్ర బెల్లం ఘట్టాలయ్యాక శుభ ముహూర్తంలో శ్రీనృసింహస్వామి వారు శ్రీలక్ష్మీ దేవికి మాంగల్యధారణ చేశారు. గురువారం ఉదయం ఆలయంలో హనుమంత వాహన సేవపై శ్రీస్వామి వారు తిరువీధుల్లో ఊరేగారు.

మోదీ పాలనలోనే దేశాభివృద్ధి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్
- షాద్‌నగర్‌లో బీజేపీ విజయ సంకల్ప యాత్ర



కొందుర్గు వద్ద యాత్రలో మాట్లాడుతున్న బండి సంజయ్. చిత్రంలో డీకే అరుణ, జితేందర్‌రెడ్డి


షాద్‌నగర్, కొందుర్గు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర గురువారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ చేరుకుంది. ఈ సందర్భంగా లాల్‌పహాడ్, కొందుర్గు, షాద్‌నగర్‌లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. దేశంలో మోదీ నాయకత్వాన్ని మరోసారి బలపర్చాలని కోరారు. ప్రజా సంక్షేమం, దేశ భద్ర త, అవినీతి రహిత సమాజం ఆయనతోనే సాధ్యమన్నారు. అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ ఆహ్వానాన్ని తిరస్కరించిన కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటేయాలో ప్రశ్నించాలని సంజయ్ ప్రజలకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆ పార్టీ నేతలు ఇచ్చిన హామీలన్నీ అబద్ధాలేనని స్పష్టంచేశారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలవుతున్నా ఆరు గ్యారంటీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తే.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాటిని దారి మళ్లించి, అవినీతికి పాల్పడిందని ధ్వజమెత్తారు.

రామరాజ్యం కావాలంటే..

'బీజేపీకి మోదీ ఉన్నాడు.. ఆయన వెనక శ్రీరాముడు ఉన్నాడు.. కాంగ్రెస్‌కు రాహుల్, కేసీఆర్, ఒవైసీలు ఉన్నారు. దేశంలో రామరాజ్యం కావాలంటే తిరిగి ఎవరు అధికారంలోకి రావాలో ప్రజలే తేల్చుకోవాలి'అని బండి సంజయ్ అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బాగా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. మళ్లీ మోదీ ప్రధాని అయితేనే రైతులకు సబ్సిడీలు, పేదలకు ఉచిత బియ్యం వస్తాయని తెలిపారు. తెలంగాణలో బీజేపీ ఎంపీలు గెలిస్తేనే రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకొస్తారని అన్నారు. కేంద్రం నుంచి నిధులు వస్తేనే ఆరు గ్యారంటీలు అమలవుతాయని, అలా కావాలంటే బీజేపీ మరోసారి అధికారంలోకి రావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరుకోవాలని చమత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూజ్‌లెస్ ఫెలో.. గెటవుట్..

సీనియర్ నేత, మాజీ మంత్రి గంటాపై చంద్రబాబు అసహనం
చీపురుపల్లి వద్దని.. భీమిలిలోనే పోటీ చేస్తానని చెప్పినందుకు ఆగ్రహం
తాను చెప్పినట్లు చెయ్యకపోతే బయటకు పొమ్మన్న చంద్రబాబు
తనను ఓడించేందుకే ఇలా చేస్తున్నారని వాపోయిన గంటా శ్రీనివాసరావు
బయటకు వచ్చాక మాత్రం... సాధ్యాసాధ్యాలు చూశాకే నిర్ణయమని వ్యాఖ్య



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర రాజకీయాల్లో సీనియర్‌గా చెలామణి అవుతున్న టీడీపీ నేత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడి చేతిలో ఘోరమైన అవమానం జరిగినట్లు తెలియవచ్చింది. గంటాను ఈ సారి విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గంలో మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీ చేయించాలని చంద్రబాబు నాయుడు ఎత్తువేయగా... తనకు ఓడిపోయే సీటిచ్చి పొమ్మనలేక పొగ పెడుతున్నారని గ్రహించిన గంటా దీన్ని బాహటంగానే వ్యతిరేకిస్తున్నారు. తనను విశాఖ జిల్లా నుంచి పంపేయాలని చూస్తున్నారని, అలాంటిదేమీ కుదరదని బయటక్కూడా చెప్పారు. ఇదే విషయంలో ఆయనకు, పార్టీ అధినేత చంద్రబాబుకు తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగి, మాటా మాటా పెరగడంతో 'యూజ్‌లెస్ ఫెలో.. గెటవుట్'అంటూ గంటాపై చంద్రబాబు తీవ్రంగా విరుచుకుపడ్డారని తెలిసింది. అవమానాన్ని భరించలేని గంటా... మారు మాట్లాడకుండా అక్కడి నుంచి వచ్చేశారని, ఇంతటి అవమానం జరిగాక ఇక ఆ పార్టీలో కొనసాగటమెలాగంటూ సన్నిహితుల వద్ద వాపోయారని తెలియవచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు... చీపురుపల్లి నియోజకవర్గంలో మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీ చేయాలని చంద్రబాబు చేసిన ప్రతిపాదనను గంటా తిరస్కరించారు. అంతదూరం వెళ్లి పోటీ చేయలేనని కరాఖండిగా చెప్పేశారు. ''మనుషులు కాదు. పార్టీ ముఖ్యం. పార్టీ అధినేతగా చెబుతున్నా... చీపురుపల్లి వెళ్లి పోటీ చేయాల్సిందే''అని బాబు కూడా అంతే స్పష్టంగా చెప్పటంతో... ''నన్ను ఓడించేందుకే కంకణం కట్టుకున్నట్టున్నారు''అని గంటా బిగ్గరగా బదులిచ్చినట్లు తెలిసింది. దీంతో బాబు సహనం కోల్పోయి కొన్ని మాటలనటం... గంటా కూడా ఎదురు తిరగటంతో.. ''యూజ్‌లెస్ ఫెలో.. గెటవుట్''అంటూ గంటాకు చంద్రబాబు గేటు చూపించారని సమాచారం. అవమానభారంతో బయటకు వచ్చిన గంటా... తాడో పేడో తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని, తానైతే భీమిలి నుంచే పోటీ చేస్తానని సన్నిహితుల వద్ద చెప్పినట్లు సమాచారం.

ఉద్దేశపూర్వకంగానే లీకులు..!

విశ్వసనీయ సమాచారం మేరకు... వచ్చే ఎన్నికల్లో విశాఖ జిల్లాలో ఎక్కడా సీటు లేదని, విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని గంటాకు టీడీపీ సలహాదారు రాబిన్ శర్మ మొదట చెప్పారు. అయితే, అంత దూరం వెళ్లి తాను పోటీ చేయలేనని గంటా బదులిచ్చారు. దీంతో కొద్దిరోజుల క్రితం అనుకూల మీడియాలో టీడీపీ పెద్దలు చీపురుపల్లి నుంచి గంటా పోటీ చేయనున్నట్టు లీకులిచ్చారు. దీనిపై గంటా తన అనుచరుల వద్ద తీవ్రంగా మండిపడ్డారు. తనను ఓడించేందుకే ఈ కొత్త నాటకానికి తెరతీశారని వాపోయారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల చంద్రబాబుతో గంటా భేటీ అయ్యారు. ''ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ కొత్త నియోజకవర్గం నుంచి పోటీ చేసే మీరు.. ఈసారి చీపురుపల్లికి వెళ్లండి''అని బాబు ఆదేశించారు. తాను అక్కడకు వెళ్లి పోటీ చేయలేనని, భీమిలి సీటు కావాలని గంటా కోరారు. దీంతోనే మాటా మాటా పెరిగాయి.

జిల్లా వెలుపల ఎప్పుడూ పోటీ చెయ్యలేదు: గంటా

చీపురుపల్లి అసెంబ్లీ స్థానంలో పోటీ చేయాలని టీడీపీ అధిష్టానం తనకు సూచించడం నిజమేనని గంటా శ్రీనివాసరావు అంగీకరించారు. గురువారం తన ఇంట్లో విలేకరులతో మాట్లాడారు. ''చీపురుపల్లిలో పోటీపై సాధ్యాసాధ్యాలు పరిశీలించాకనిర్ణయాన్ని ప్రకటిస్తా. నేను గతంలో చాలా నియోజకవర్గాలు మారినా ఎప్పుడూ జిల్లా దాటలేదు. కాబట్టే చీపురుపల్లిలో పరిస్థితులను సమీక్షించి... నా నిర్ణయాన్ని అధిష్ఠానానికి చెబుతా''అన్నారు.

గొర్రెల పంపిణీ స్కాంలో నలుగురు అధికారుల అరెస్ట్

- రూ. 2.10 కోట్ల మేర అవినీతి జరిగినట్లు ఏసీబీ గుర్తింపు
- బినామీ ఖాతాలు సృష్టించి డబ్బులు కొల్లగొట్టినట్లు ఆధారాలు

సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకం అమల్లో వెలుగుచూసిన కుంభకోణంలో ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ పేరిట జరిగిన నిధుల దుర్వినియోగానికి సంబంధించి నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా కీలక ఆధారాలు సేకరించి నలుగురు అధికారులను గురువారం అరెస్టు చేశారు. కామారెడ్డి ఏరియా వెటర్నరీ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ డా. డి.రవి, మేడ్చల్ జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఎం ఆదిత్య కేశవసాయి, రంగారెడ్డి జిల్లా భూగర్భజల వనరుల శాఖ జిల్లా అధికారి పాసుల రఘుపతిరెడ్డి, అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ సంగు గణేశ్‌లను ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం మొదటి అడిషనల్ స్పెషల్ జడ్జి ఎదుట హాజరుపరిచారు. గొర్రెల యూనిట్ల కొనుగోళ్లలో రూ. 2.10 కోట్ల మేర నిధులు దారిమళ్లినట్లు ఏసీబీ అధికారులు ఆధారాలు సేకరించారు. కొందరు ప్రైవేటు వ్యక్తులతో కలిసి నిందితులు బినామీ ఖాతాలను సృష్టించినట్లు దర్యాప్తులో గుర్తించారు. గొర్రెలు విక్రయించిన ఏపీ రైతులు తమకు రావాల్సిన డబ్బును కొందరు అధికారులు కాజేశారంటూ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏసీబీ విచారణకు ఆదేశించింది.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో పీయూసీ ఫస్టియర్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. వర్సిటీ అధికారుల వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా మనూరు మండలం దవ్వూరుకు చెందిన తెనుగు శిరీష(17) గురువారం తన ఇంటి నుంచి వర్సిటీకి వచ్చింది. గంగా హాస్టల్‌లోని తన 117 గదిలోనే సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన సిబ్బంది క్యాంపస్ హెల్త్‌సెంటర్‌కి తరలించగా.. అప్పటికే మృతి చెందిందని అక్కడి వైద్యులు నిర్ధారించారు. శిరీష మృతదేహాన్ని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వ్యక్తిగత కారణాలతోనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్టు క్యాంపస్ వర్గాలు చెబుతున్నాయి.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.70 లక్షల బీమా అందజేత

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిధిలోని ఆళ్లగడప నివాసి, కానిస్టేబుల్ ధర్మపురి శ్రీకాంత్ కుటుంబానికి రూ.70 లక్షల బీమా చెక్కును డీజీపీ రవి గుప్తా గురువారం అందజేశారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందారు. శ్రీకాంత్ వేతన ఖాతా హెచ్‌డీఎఫ్‌సీలో ఉండడంతో ఆ బ్యాంకు అధికారులు బీమా మొత్తాన్ని డీజీపీ రవిగుప్తాతో డీజీపీ కార్యాలయంలో మృతుని కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో ఐజీ స్టీఫెన్ రవీంద్ర, బ్యాంకు సర్కిల్ హెడ్ విశాల్ భాటియా, జోనల్ హెడ్ జోస్ స్టీఫెన్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధితోనే 'వికసిత్ భారత్'

సన్నకారు రైతుల జీవితాలను మెరుగుపర్చడానికి కృషి చేస్తున్నాం

- ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తి దేశంగా భారత్ రికార్డు
- అమూల్ కంపెనీని ప్రపంచంలో నంబర్ వన్ డెయిరీగా మార్చాలి
- జీసీఎంఎంఎఫ్ 50వ వార్షికోత్సవంలో మోదీ పిలుపు

అహ్మదాబాద్: గ్రామాలకు సంబంధించిన ప్రతి అంశానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా సన్నకారు రైతుల జీవితాలను మెరుగుపర్చడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ఆర్థికాభివృద్ధితోనే 'వికసిత్ భారత్' లక్ష్యం నెరవేరుతుందని స్పష్టం చేశారు. దేశం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలని అన్నారు. గురువారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గుజరాత్ కో–ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్(జీసీఎంఎంఎఫ్) 50వ వార్షికోత్సవంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. లక్ష మందికిపైగా రైతులు, పాడి పశువుల పెంపకందారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రఖ్యాత అమూల్ కంపెనీని నిర్వహిస్తున్న జీసీఎంఎంఎఫ్‌ని ప్రపంచంలో నంబర్ వన్ డెయిరీగా మార్చడానికి కృషి చేయాలని పాడి రైతులకు, భాగస్వామ్యపక్షాలకు మోదీ పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఈ సహకార సంఘం(అమూల్) ప్రపంచంలో ఎనిమిదో అతిపెద్ద డెయిరీ కంపెనీగా స్థానం దక్కించుకుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా డెయిరీ రంగం ఏటా 2 శాతం వృద్ధి సాధిస్తుండగా, మన దేశంలో మాత్రం 6 శాతం వృద్ధిని సాధిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 10 వేల రైతు ఉత్పత్తి సంస్థలు(ఎఫ్‌పీఓ) ఏర్పాటు చేయాలని నిర్ణయించామని మోదీ చెప్పారు. ఇప్పటికే 8 వేల ఎఫ్‌పీఓలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సన్నకారు రైతులను వ్యవసాయ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా, ఎగుమతిదారులుగా మార్చాలని సంకల్పించామని అన్నారు. అన్నదాతల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు, తీసుకొచ్చిన పథకాలను ప్రస్తావించారు. రైతుల కోసం మైక్రో ఏటీఎంలు, గోబర్ధన్ పథకం, ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు తీసుకొచ్చామని గుర్తుచేశారు.

ఇంధన దాతగా, ఎరువుల దాతగా రైతులు

జంతు సంపదను వ్యాధుల బారి నుంచి కాపాడానికి రూ.15,000 కోట్లతో ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించామని, ఇప్పటికే 60 కోట్ల టీకా డోసుల ఇచ్చామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. గ్రామాల్లో కిసాన్ సమృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇక్కడ పంటలకు సంబంధించి రైతుల సమస్యలకు శాస్త్రీయ పరిష్కార మార్గాలు లభిస్తున్నాయని వివరించారు. సేంద్రీయ ఎరువుల తయారీలో రైతులకు సహకారం అందిస్తున్నామని చెప్పారు. బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు సైతం తోడ్పాటు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులను 'అన్నదాత' నుంచి ఇంధన దాతగా, ఎరువుల దాతగా మార్చాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు.

2 అణు విద్యుత్ రియాక్టర్లు జాతికి అంకితం

సూరత్: నవ్‌సారిలో సభ అనంతరం ఆయన పొరుగునే సూరత్ జిల్లాలో ఉన్న కక్రాపర్‌కు చేరుకున్నారు. కక్రాపర్ అణు విద్యుత్ స్టేషన్ వద్ద ప్రధాని మోదీ రెండు అణు విద్యుత్ రియాక్టర్లను జాతికి అంకితం చేశారు. కక్రాపర్ అటమిక్ పవర్ స్టేషన్‌లో 700 మెగావాట్ల చొప్పున సామర్థ్యం కలిగిన 3, 4 యూనిట్లను న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్) రూ.22,500 కోట్లతో ఏర్పాటు చేసింది. దేశీయంగా రూపుదిద్దుకున్న అతిపెద్ద ప్రెస్సరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్లు ఇవే కావడం విశేషం. ప్రధాని ఇక్కడి సీనియర్ శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఇక్కడ తయారైన విద్యుత్ గుజరాత్‌తోపాటు మహా రాష్ట్ర, గోవా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కేంద్రపాలిత ప్రాంతాలు దాద్రా నాగర్ హవేలీ, డామన్ డయ్యూలకు సరఫరా అవుతుంది.



రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

రైతుల సంక్షేమం విషయంలో తమ ప్రతిజ్ఞను నెరవేర్చడానికి కట్టుబడి ఉన్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రైతులకు సంబంధించిన ప్రతి డిమాండ్‌ను నెరవేర్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో రైతన్నల బాగు కోసం ఇప్పటిదాకా ఎన్నో చర్యలు చేపట్టామని, చెరకు ధర పెంచడం కూడా అందులో ఒకటి అని తెలిపారు. దీనివల్ల కోట్లాది మంది చెరకు రైతులు ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. కేంద్ర కేబినెట్ తాజాగా తీసుకున్న నిర్ణయాలను ప్రస్తావిస్తూ మోదీ గురువారం 'ఎక్స్'లో పలు పోస్టు చేశారు. క్వింటాల్ చెరకు కనీస ధర(ఎఫ్ఆర్‌పీ)ను మరో రూ.25 చొప్పున పెంచుతూ మోదీ నేతృత్వంలో కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో క్వింటాల్ చెరకు కనీస ధర రూ.350కు చేరుకుంది. ఇదొక చరిత్రాత్మక నిర్ణయమని మోదీ అభివర్ణించారు. అంతరిక్ష రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఎఫ్‌డీఐ) అనుమతిస్తూ కేబినెట్ మరో నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. గుర్రాలు, గాడిదలు, కంచర గాడిదలు ఒంటెలు వంటి జంతువుల సంతతి వృద్ధికి సంబంధించిన పరిశ్రమలు, వ్యక్తులకు 50 శాతం పెట్టుబడి రాయితీ మంజూరు చేస్తూ కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

నన్ను అవమానించడమే వారి ఎజెండా

నవ్‌సారీ: సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ గురువారం కాంగ్రెస్ పార్టీపై విమర్శల బాణాలు వదిలారు. దక్షిణ గుజరాత్‌లోని నవ్‌సారీ పట్టణంలో ఒక ప్రజా కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ''మోదీ కులాన్ని ఎంత మంది కాంగ్రెస్ నేతలు దూషించారో మీరందరూ చూసే ఉంటారు. కానీ కాంగ్రెస్ వాళ్లకు తెలియని విషయం ఏంటంటే వాళ్లెంతగా నన్ను తిడతారో 400 లోక్‌సభ సీట్లు గెలవాలన్న మా సంకల్పం అంతగా బలపడుతుంది. దేశం కోసం కాంగ్రెస్‌కు ఎలాంటి ఎజెండా లేదు. నన్ను తిట్టడమే వారి ఎజెండా. దేశ భవిష్యత్తుపై వాళ్లకు ఎలాంటి చింతా లేదు. ఎంతగా మాపై బురద జల్లుతారో అంతగా ఆ బురదలో 370(సీట్లు) కమల పుష్పాలు వికసిస్తాయి' అంటూ లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 370 సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తంచేశారు. ''వారసత్వ రాజకీయాల మాటకొస్తే కాంగ్రెస్‌ను మించినది మరోటి లేదు' అని విమర్శించారు. 'బంధుప్రీతి, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు చేసేవారికి దేశ ఘన వారసత్వ పరిరక్షణ చేతకాదు' అని వ్యాఖ్యానించారు.



పుస్తకాలు చూస్తూనే పరీక్ష!

- ఎంపిక చేసిన స్కూళ్లలో 9–12 తరగతి విద్యార్థులపై పైలట్ ప్రాజెక్ట్
- నవంబర్–డిసెంబర్‌లో పరీక్షించనున్న సీబీఎస్‌ఈ

న్యూఢిల్లీ: పరీక్ష గదిలో విద్యార్థుల దగ్గర చీటీలు కనిపిస్తే వీపు వాయగొట్టే ఉపాధ్యాయులనే మనం చూశాం. అయితే పుస్తకాలు, నోటు పుస్తకాలు చూసుకుంటూ ఎగ్జామ్ ఎంచకా రాసుకోండ్రా అని చెప్పే విధానం ఒకదానికి పైలట్ ప్రాజెక్ట్‌గా పరీక్షించాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) నిర్ణయించింది. ఈ వినూత్న ఆలోచన 2023 డిసెంబర్‌లోనే బోర్డ్ కార్యనిర్వాహక వర్గ సమావేశంలో చర్చకొచ్చింది. నిర్ణీత కాలావధిలో పాఠ్యపుస్తకాలను చూస్తూనే విద్యార్థి పరీక్షగదిలో ఎంత సృజనాత్మకంగా సమాధానాలు రాబట్టగలడు, సూటిగాలేని తికమక, క్లిష్ట ప్రశ్నలకు ఎలా జవాబులు రాయగలడు, విద్యార్థి ఆలోచనా విధానం, విశ్లేషణ సామర్థ్యం వంటి వాటిని మదింపు చేసే ఉద్దేశంతో ఈ 'ఓపెన్–బుక్ ఎగ్జామ్' పైలట్ ప్రాజెక్టుకు సీబీఎస్‌ఈ పచ్చజెండా ఊపింది. అయితే ఈ పరీక్ష విధానాన్ని 10, 12 తరగతి బోర్డ్ పరీక్షల్లో అమలుచేసే ఆలోచన అస్సలు లేదని సీబీఎస్‌ఈ అధికారులు స్పష్టంచేశారు. కొన్ని ఎంపిక చేసిన పాఠశాలల్లో 9, 10వ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్, గణితం, సామాన్య శాస్త్రాల్లో, 11, 12వ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్, గణితం, జీవశాస్త్రాల్లో ఈ ఓపెన్–బుక్ ఎగ్జామ్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టనున్నారు. స్టడీ మెటీరియల్‌ను రిఫర్ చేస్తూనే ఇలాంటి ఎగ్జామ్ పూర్తిచేయడానికి విద్యార్థి ఎంత సమయం తీసుకుంటాడు? అనే దానితోపాటు విద్యార్థులు, టీచర్లు, సంబంధిత భాగస్వాముల అభిప్రాయాలనూ సీబీఎస్‌ఈ పరిగణనలోకి తీసుకోనుంది. ఫార్మాటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ), సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్ఏ)ల కోణంలో ఈ తరహా పరీక్ష అమలు తీరుతెన్నులపై సీబీఎస్‌ఈ ఓ నిర్ణయానికి రానుంది.

నేడు రైతు సంఘాల 'బ్లాక్ డే'

- దేశవ్యాప్తంగా రైతులకు ఎస్‌కేఎం పిలుపు
- సీఎం ఖట్టర్, మంత్రి విజల్‌పై హత్య కేసుకు డిమాండ్
- 26న ట్రాక్టర్లతో రహదారులను దిగ్బంధిస్తామని వెల్లడి

చండీగఢ్: పంజాబ్–హరియాణా సరిహద్దుల్లో ఖనౌరి వద్ద బుధవారం చోటుచేసుకున్న రైతు మరణంపై హరియాణా ముఖ్యమంత్రి, హోం మంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రైతు మృతికి సంతాపం ప్రకటిస్తూ దేశవ్యాప్తంగా శుక్రవారం 'బ్లాక్ డే' గా పాటించాలని రైతులను కోరింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, హరియాణా సీఎం ఖట్టర్, రాష్ట్ర హోం మంత్రి అనిల్ విజ్‌ల దిష్టిబొమ్మలను దహనం చేయనున్నట్లు తెలిపింది. ఈ నెల 26వ తేదీన రైతులంతా తమ ట్రాక్టర్లతో జాతీయ రహదారులను దిగ్బంధించాలని పిలుపునిచ్చింది. అదేవిధంగా, మార్చి 14వ తేదీన ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో మహాపంచాయత్‌లో చేపట్టనున్నట్లు తెలిపింది. ఢిల్లీ చలో కార్యక్రమాన్ని సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం)లు కలిసి చేపట్టగా ఎస్‌కేఎం మద్దతు మాత్రమే ఇస్తోంది. 2020–21లో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సుదీర్ఘంగా పోరాడిన ఎస్‌కేఎం నేతలెవరూ 'ఢిల్లీ చలో'లో పాలుపంచుకోవడం లేదు. గురువారం ఎస్‌కేఎం నేతలు చండీగఢ్‌లో సమావేశమై సరిహద్దుల్లోని శంభు, ఖనౌరిల వద్ద నెలకొన్న పరిస్థితులపై చర్చించారు. అనంతరం ఎస్‌కేఎం నేతలు బల్బీర్ సింగ్ రాజేవాల్, జోగిందర్ సింగ్ ఉగ్రహాన్, రాకేశ్ తికాయత్, దర్శన్‌పాల్ మీడియాతో మాట్లాడారు. ఖనౌరి వద్ద బుధవారం జరిగిన ఆందోళనల్లో శుభ్‌కరణ్ సింగ్ అనే రైతు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై సీఎం ఖట్టర్, మంత్రి విజ్‌లపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వారిద్దరూ వెంటనే పదవులకు రాజీనామా చేయాలన్నారు. మృతుడి కుటుంబానికి పరిహారంగా రూ.కోటి చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అతడికున్న రూ.14 లక్షల రుణాలను మాఫీ చేయాలన్నారు. ఈ నెల 26వ తేదీన ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) దిష్టిబొమ్మను కూడా దహనం చేస్తామన్నారు. ఎస్‌కేఎం (రాజకీయేతర)ను కూడా కలుపుకుని పోయేందుకు చర్చలు ప్రారంభిస్తామని చెప్పారు.

మణిపూర్ హైకోర్టు ఉత్తర్వులో సవరణ

కుకీలు, మైతేయిల ఘర్షణకు దారితీసిన పేరాను తొలగించిన న్యాయస్థానం

ఇంఫాల్: మణిపూర్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో రెండు ప్రధాన వర్గాలైన కుకీలు, మైతేయిల మధ్య ఘర్షణకు దారితీసిన తమ వివాదాస్పద ఉత్తర్వులో సవరణ చేసింది. మైతేయి వర్గాన్ని షెడ్యూల్డ్ తెగ(ఎస్టీ)ల్లో చేర్చాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని మణిపూర్ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ 2023 మార్చి 27న జారీ చేసిన ఉత్తర్వులో ఒక పేరాను తొలగించింది. అప్పట్లో కోర్టు ఉత్తర్వును వ్యతిరేకిస్తూ గిరిజనులైన కుకీలు ఆందోళన ప్రారంభించారు. క్రమంగా పెద్ద ఘర్షణగా మారింది. రాష్ట్రంలో నెలల తరబడి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రెండు వర్గాల మధ్య జరిగిన హింసాకాండలో దాదాపు 200 మంది మృతిచెందారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. హైకోర్టు ఉత్తర్వును వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఆల్ మణిపూర్ ట్రైబల్ యూనియన్ గతేడాది అక్టోబర్ అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. వివాదాస్పద ఉత్తర్వులో రెండు తెగల మధ్య శత్రుత్వానికి కారణమైన ఒక పేరాను తొలగిస్తున్నట్లు వెల్లడించింది. ఇది సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధంగా ఉందని స్పష్టం చేసింది.



చైనాలో వంతెనను ఢీకొట్టిన కార్గో నౌక

వాహనాలు నదిలో పడి ఐదుగురి దుర్మరణం

బీజింగ్: చైనాలోని ఒక సరుకు రవాణా నౌక అక్కడి పెర్ల్ నదిపై నిర్మించిన వంతెనను ఢీకొట్టింది. దీంతో వంతెనలో కొంతభాగం కూలి, వాహనాలు నదిలో పడి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. గురువారం ఉదయం ఈ ఘటన జరిగింది. గ్వాంగ్జూ తీర పట్టణం సమీపంలోని సాన్మిన్ ద్వీపం వద్ద ఈ దుర్ఘటన జరిగింది. గ్వాంగ్జూ నౌకాశ్రయానికి వెళ్లే చిన్నపాటి కార్గో నౌకలు 600 మీటర్ల వెడల్పున్న ఈ లిక్సింటా వంతెన కింద నుంచే వెళ్తుంటాయి. వంతెన ఎత్తు తక్కువగా ఉందని, ఆధునీకరించాలని ప్రతిపాదనలున్నా పనులు జరగట్లేవు. ఈలోపే ఇలా ప్రమాదం జరిగింది. ప్రధానభూభాగాన్ని పక్కనే ఉన్న సాన్మిన్ ద్వీపంతో కలుపుతూ ఈ వంతెన నిర్మించారు. ఇప్పుడు ఇది కూలడంతో రాకపోకలతోపాటు తాగునీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది.

కాంగ్రెస్, ఆప్ సీట్ల సర్దుబాటు!

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దింపే అంశంపై కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు మంతనాలు మొదలెట్టాయి. త్వరలోనే ఢిల్లీ, గుజరాత్, హరియాణా రాష్ట్రాల్లో సీట్ల పంపకాలపై తుది నిర్ణయం వెలువడనుందని విశ్వసనీయ వర్గాలు గురువారం తెలిపాయి. అయితే ఇప్పటికే కొన్ని ఎంపీ స్థానాల్లో ఏ పార్టీ అభ్యర్థిని నిలబెట్టాలనే దానిపై స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. దక్షిణ ఢిల్లీ, పశ్చిమ ఢిల్లీ, వాయవ్య ఢిల్లీ, న్యూఢిల్లీ స్థానాల్లో ఆప్ బరిలో దిగనుంది. చాంద్‌నీ చౌక్, తూర్పు ఢిల్లీ, ఈశాన్య ఢిల్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తన అభ్యర్థిని నిలబెడుతుందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. గత ఎన్నికల్లో ఈ ఏడు ఎంపీ స్థానాల్లో బీజేపీ గెలిచింది. హరియాణాలో ఒకటి, గుజరాత్‌లో రెండు స్థానాలను ఆప్‌కే కేటాయించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. గురుగ్రామ్ లేదా ఫరీదాబాద్‌లో ఆప్ పోటీచేయనుంది. గుజరాత్‌లోని భరూచ్ స్థానం నుంచి ఆప్ నేత చైతర్ వసావా, భావ్‌నగర్‌లో ఉమేశ్‌భాయ్ మాక్వానా పోటీ చేస్తారని ఇప్పటికే ఆప్ ప్రకటించింది.

ఇజ్రాయెల్ దాడుల్లో 48 మంది మృతి

రఫా: గాజాలోని దక్షిణ, మధ్య ప్రాంతాలపై బుధవారం రాత్రి ఇజ్రాయెల్ బలగాలు జరిపిన దాడుల్లో కనీసం 48 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక అధికారులు తెలిపారు. మృతుల్లో సగం మంది మహిళలు, చిన్నారులు ఉన్నారు. రఫాలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు, సెంట్రల్ గాజాలో 14 మంది చిన్నారులు, 8 మంది మహిళలు సహా మొత్తం 44 మంది ప్రాణాలు కోల్పోయారు. రఫా చుట్టుపక్కల జరిగిన వైమానిక దాడుల్లో అల్ ఫరూక్ మసీదు నేలమట్టం అయింది. మరోవైపు, వెస్ట్‌బ్యాంక్ జాతీయరహదారిపై గురువారం ఉదయం రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో సాయుధులు కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో ఒక ఇజ్రాయెల్ యువకుడు చనిపోగా మరో అయిదుగురు గాయపడ్డారు. ఇజ్రాయెల్ పోలీసుల కాల్పుల్లో ఇద్దరు దుండగులు చనిపోయారు. మూడో వ్యక్తి పట్టుబడ్డాడు. ఈ కాల్పులకు కారణమని ఎవరూ ప్రకటించుకోనప్పటికీ హమాస్ సాయుధబలగాలు మాత్రం హర్షం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ దాడులు ఆగి, స్వతంత్ర పాలస్తీనా అవతరించేదాకా ఇటువంటి మరిన్ని దాడులకు దిగాలని పిలుపునిచ్చారు.



బీబీసీ చైర్మన్‌గా భారతీయుడు

లండన్: బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(బీబీసీ) నూతన చైర్మన్‌గా తొలిసారిగా భారతీయ మూలాలున్న డాక్టర్ సమీర్ షా ఎంపికయ్యారు. 72 ఏళ్ల సమీర్ భారత్‌లోని ఔరంగాబాద్‌లో జన్మించారు. తర్వాత 1960లో బ్రిటన్‌కు వలస వెళ్లారు. టీవీ ప్రొడక్షన్, పాత్రికేయరంగంలో నాలుగు దశాబ్దాల అనుభవం గడించిన సమీర్ గతంలో బీబీసీ నాన్–ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సేవలందించారు. బీబీసీలో సమకాలీన, రాజకీయ వ్యవహారాల విభాగం చీఫ్‌గానూ పనిచేశారు. బ్రిటన్ రాజు చార్లెస్–3 ఈవారమే సంబంధిత ఎంపిక ప్రక్రియకు ఆమోదముద్ర వేయడంతో గురువారం ఆయన నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. మార్చి నాలుగో తేదీ నుంచి నాలుగేళ్లపాటు ఈ పదవిలో కొనసాగే సమీర్ దాదాపు రూ.1.68 కోట్ల వార్షిక వేతనం అందుకోనున్నారు. బ్రిటన్ టెలివిజన్ రంగానికి చేసిన విశేష కృషికిగాను 2019లో దివంగత బ్రిటన్ రాణి ఎలిజబెత్–2 సమీర్‌ను కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్‌తో సత్కరించారు. 1998 నుంచి సొంతంగా జ్యూపిటర్ టీవీని ఈయన నడుపుతున్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే

రైతు ఉద్యమ సంబంధ 'ఎక్స్' ఖాతాలపై కేంద్రం ఆంక్షలపై కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ: ఉధృతంగా కొనసాగుతున్న రైతుల ఉద్యమ సంబంధ 'ఎక్స్'ఖాతాలను స్తంభింపజేయాలంటూ 'ఎక్స్' సంస్థకు మోదీ సర్కార్ నుంచి ఆదేశాలు రావడంపై కాంగ్రెస్ కన్నెర్రజేసింది. భావప్రకటనా స్వేచ్ఛను కాలరాస్తూ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తోందని కాంగ్రెస్ మండిపడింది. రైతుల ఉద్యమంతో సంబంధం ఉన్న దేశంలో 177 సామాజికమాధ్యమాల ఖాతాలను తాత్కాలికంగా నిలిపేయాలంటూ 'ఎక్స్'కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశాలిచ్చింది. కేంద్ర హోం శాఖ సిఫార్సుమేరకు ఈ ఆదేశాలొచ్చాయి. దీనిపై తొలుత 'ఎక్స్' స్పందించింది. ''పెనాల్టీలు, జరిమానాలు, నిర్బంధాలకు వీలయ్యేలా 177 ఖాతాలను బ్లాక్ చేస్తూ కేంద్రం నుంచి ఉత్తర్వులొచ్చాయి. తప్పని పరిస్థితుల్లో ఆ ఆదేశాలను పాటించాం. కానీ ఇలా భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడం సబబు కాదు. ఈ అంశంలో పారదర్శకత కోసం ఆయా ఉత్తర్వుల కాపీలను బహిర్గతం చేయాల్సింది. అయితే చట్టంలోని నిబంధనల కారణంగా మేం ఆ పనిచేయలేకపోతున్నాం. పారదర్శకత లేనంత కాలం, బహిర్గతం చేయనంతకాలం ఈ వ్యవస్థలో జవాబుదారీతనం లేనట్లే'' అని 'ఎక్స్' గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్ బృందం ఒక ప్రకటన విడుదలచేసింది.

అత్యంత ప్రజాదరణ కలిగిన నేత మోదీ

వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో ఘనత సాధించారు. అమెరికాకు చెందిన 'మార్నింగ్ కన్సల్ట్' అనే ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఈ ఏడాది జనవరి 30 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ దాకా ఈ సర్వే నిర్వహించారు. దేశాధినేతలకు వారి సొంత దేశాల్లో ప్రజాదరణ ఏ స్థాయిలో ఉందో గుర్తించారు. 'మార్నింగ్ కన్సల్ట్' వెబ్‌సైట్ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. నరేంద్ర మోదీకి సొంత దేశం భారత్‌లో 78 శాతం జనాదరణ ఉన్నట్లు తేలింది. అంటే దేశ జనాభాలో 78 శాతం మంది మోదీని నాయకత్వాన్ని ఆమోదిస్తున్నట్లు తేలింది. మోస్ట్ పాపులర్ గ్లోబల్ లీడర్‌గా ఆయన తొలి స్థానం దక్కించుకున్నారు. మరో విశేషం ఏమిటంటే.. గత ఏడాది డిసెంబర్ నిర్వహించిన ఇదే సర్వేలో నరేంద్ర మోదీకి 76 శాతం ప్రజాదరణ లభించింది. అంటే నెల రోజుల్లో మరో 2 శాతం పెరిగినట్లు స్పష్టమవుతోంది. ఈ జాబితాలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో, బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ తదితరులు మోదీ కంటే వెనుకబడి ఉన్నారు. మెక్సికో అధ్యక్షుడు అండ్రూస్ మాన్యుల్ లోపెజ్ ఒబ్రాడర్ రెండవ స్థానంలో నిలిచారు.

కాంగ్రెస్ చీఫ్ ఖర్గేకు జెడ్ ప్లస్ భద్రత

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జెడ్–ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నట్లు గురువారం కేంద్ర హోం శాఖ ఆదేశాలిచ్చింది. ఆయన భద్రతకు ఉన్న ముప్పును పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక అధికారి వివరించారు. దేశంలో ఆయన ఎక్కడికెళ్లినా సీఆర్‌పీఎఫ్ జవాన్లు వెన్నంటి ఉంటారు. రానున్న ఎన్నికల వేళ ప్రధాన ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడిగా ఉన్న ఖర్గే దేశవ్యాప్తంగా పర్యటించాల్సి ఉంటుంది. అందుకే ఆయనకు భద్రతను పెంచినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇకపై ఆయనకు 24 గంటలపాటూ మూడు షిఫ్టుల్లో 30 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు రక్షణ కల్పిస్తారు. దీంతోపాటు, బుల్లెట్ ప్రూఫ్ వాహనం, పైలట్, ఎస్కార్టు సమకూరుస్తారు. ప్రధాని మోదీకి అత్యంత కట్టుదిట్టమైన స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ భద్రత ఉంది. దేశంలో అధిక ముప్పు ఉన్న వారికి అందించేదే జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత. ఆ తర్వాత ఎక్స్, వై కేటగిరీలుంటాయి.

కేజ్రీవాల్‌కు ఏడోసారి ఈడీ నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: మద్యం విధానం కుంభకోణం కేసులో గురువారం ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఏడోసారి నోటీసులిచ్చింది. ఈనెల 26వ తేదీన తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని కోరింది. ఆరుసార్లు నోటీసులిచ్చినా స్పందించకపోవడంతో కేజ్రీవాల్ విచారణకు సహకరించడం లేదంటూ సీబీఐ ప్రత్యేక కోర్టులో ఇటీవల ఈడీ ఫిర్యాదు చేసింది. కోర్టు సమన్లు అందుకున్న కేజ్రీవాల్ ఈనెల 17న వర్చువల్‌గా కోర్టు విచారణకు హాజరయ్యారు. విచారణ చేపట్టిన రౌస్ అవెన్యూ సీబీఐ కోర్టు విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది. ఇదే కేసులో 26వ తేదీన విచారణకు రావాలంటూ సీబీఐ అధికారులు బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఒకేరోజు కేజ్రీవాల్‌ను ఈడీ, కవితను సీబీఐ లిక్కర్ స్కాంపై విచారించనుండటం గమనార్హం.

అవినీతికి, అభివృద్ధికి మధ్య పోరు: నడ్డా

ముంబై: రానున్న లోక్‌సభ ఎన్నికలు ఒకవైపు వారసత్వ రాజకీయాలు, అవినీతికి, మరోవైపు అభివృద్ధికి మధ్య పోరుకు వేదికగా మారనున్నాయని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు. ముంబైలో గురువారం జరిగిన పార్టీ సమావేశంలో నడ్డా మాట్లాడారు. ప్రపంచంలో అయిదో ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం నరేంద్ర మోదీ నాయకత్వంలో మూడో స్థానానికి చేరుకుందని చెప్పారు. బీజేపీ వ్యతిరేక ప్రతిపక్ష పార్టీలన్నీ వారసత్వ రాజకీయాలు, అవినీతితో కూరుకుపోయి ఉన్నాయని విమర్శించారు. ఇటువంటి పార్టీలతో జరిగేది వినాశనమేనని హెచ్చరించారు.

సింహాలకు సీత, అక్బర్ వంటి పేర్లు పెట్టొద్దు


జూ అధికారులకు కలకత్తా హైకోర్టు మౌఖిక ఉత్తర్వులు

కోల్‌కతా: సిలిగురిలోని బెంగాల్ సఫారీ పార్కుకు తీసుకువచ్చిన రెండు సింహాలకు సీత, అక్బర్ అంటూ పేర్లు పెట్టడం వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. హిందువుల విశ్వాసాలను దెబ్బతీసేలా ఉందంటూ వీహెచ్‌పీ తదితరులు వేసిన పిటిషన్లను గురువారం కోల్‌కతా హైకోర్టులోని జల్పాయ్‌గురి సర్క్యూట్ బెంచ్ విచారణ జరిపింది. ఆ రెండు జంతువులకు ఆ పేర్లను మార్చాలని పశ్చిమబెంగాల్ జూ అథారిటీని కోరింది. వివాదానికి తావివ్వని రీతిలో వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాలని మౌఖిక ఆదేశాలిచ్చింది. ఆడ సింహానికి సీత అని, మరో సింహానికి అక్బర్ అనే పేర్లను అవి పుట్టినప్పుడే 2016, 2018లలో త్రిపురలోని సెపహిజలా జూలాజికల్ పార్కు అధికారులు పెట్టారని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మార్పిడిలో భాగంగా వాటిని ఇక్కడికి తెచ్చారని అన్నారు.

జాహ్నవిని బలిగొన్న పోలీసుపై చర్యలు లేనట్లే!

వాషింగ్టన్: అమెరికాలో నిర్లక్ష్యంగా వాహనం నడిపి, తెలుగు విద్యార్థిని కందుల జాహ్నవి ప్రాణాలను బలిగొన్న పోలీసు అధికారిపై చర్యలు తీసుకొనే అవకాశం లేదని తేలిపోయింది. గత ఏడాది జనవరి 23న అమెరికాలోని సియాటెల్‌లో కెవిన్ డేవ్ అనే పోలీసు అధికారి నిర్వాకం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన 23 ఏళ్ల కందుల జాహ్నవి బలైపోయిన సంగతి తెలిసిందే. రోడ్డు దాటుతుండగా, కెవిన్ డేవ్ నడుపుతున్న పోలీసు పెట్రోలింగ్ వాహనం వేగంగా ఢీకొట్టడంతో ఆమె చనిపోయింది. అయితే, ఈ కేసులో కెవిన్ డవే ప్రమేయాన్ని నిర్ధారించే బలమైన సాక్ష్యాలు వాషింగ్టన్ రాష్ట్రం చట్టం ప్రకారం లేవని, అందుకే అతడిపై నేరాభియోగాలు మోపి, చర్యలు తీసుకోలేమని కింగ్ కౌంటీ ప్రాసిక్యూటింగ్ అటార్నీ కార్యాలయం బుధవారం తేల్చిచెప్పింది. జాహ్నవి మరణం తమకు ఎంతో ఆవేదన కలిగించిందని, కానీ, చట్టప్రకారం ముందుకెళ్లలేకపోతున్నామని అటార్నీ లీసా మానియన్ పేర్కొన్నారు. జాహ్నవి ప్రాణాలకు పెద్దగా విలువ లేదంటూ ఎగతాళిగా మాట్లాడిన పోలీసు అధికారి డేనియల్ అడేరెర్ తీరును మానియన్ తప్పుపట్టారు.

సత్యపాల్ ఇంట్లో సీబీఐ సోదాలు



న్యూఢిల్లీ: కిరో హైడ్రోపవర్ ప్రాజెక్టులో అవినీతి కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు గురువారం జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్‌మాలిక్ ఇల్లు, ఇతర ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. రూ.2,200 కోట్ల ఈ ప్రాజెక్టులో వందలకోట్ల అవినీతి జరిగిందని అప్పట్లో వార్తలొచ్చాయి. దీంతో 100 మంది అధికారులు ముంబై, ఢిల్లీ, గురుగ్రామ్, శ్రీనగర్‌సహా 30 ప్రాంతాల్లో గురువారం ఉదయం ఆకస్మిక తనఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో భారీ ఎత్తున నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఆస్తుల్లో పెట్టుబడుల సంబంధిత డాక్యుమెంట్లు, డిజిటల్ పత్రాలను స్వాధీనం చేసుకున్నామని సీబీఐ అధికార ప్రతినిధి తర్వాత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాలిక్, ఆయన సంబంధీకులకు చెందిన నివాసాలు, స్థలాల్లోనూ సోదాలు జరిగాయి. దీనిపై మాలిక్ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. 'అనారోగ్యంతో నాలుగు రోజులుగా ఆస్పత్రిలోనే ఉన్నా. నేను రైతు బిడ్డను. నన్నెవరూ దాడులతో భయపెట్టలేరు అని అన్నారు. జమ్మూకశ్మీర్‌కు మాలిక్ 2018–2019 కాలంలో గవర్నర్‌గా ఉన్నారు.

గుల్‌మార్గ్‌లో హిమపాతం

గుల్‌మార్గ్: జమ్మూకశ్మీర్‌లో ప్రముఖ పర్యాటక ప్రాంతం గుల్‌మార్గ్‌ను హిమపాతం ముంచెత్తింది. అఫర్వాత్ కొండ ఉన్న ఖిలాన్ మార్గ్ వద్ద సంభవించిన ఈ హిమపాతంలో మంచులో కూరుకుపోయి ఒక రష్యన్ పర్వతారోహకుడు ప్రాణాలు కోల్పోయాడు. హిమపాతాలకు నెలవైన నిషేధిత ఆర్మీ రిడ్జ్ ప్రాంతంలో స్థానిక గైడ్‌తో కలిసి కొందరు రష్యన్లు పర్వతారోహణకు వెళ్లినపుడు ఈ ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. హిమపాతం జరిగిన వెంటనే పర్యాటక విభాగం గస్తీ, ఆర్మీ, పోలీసులు సహాయక, ముమ్మర గాలింపు చర్యలు చేపట్టి మంచులో కూరుకుపోయిన ఏడుగురిని రక్షించారు. వీరిని ఆస్పత్రిలో చేర్పించారు. మృతుడిని మాస్కోవాసి హాంటెన్‌గా గుర్తించారు.


సాక్షి
హైదరాబాద్

శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024



వీగిన అవిశ్వాసం


నగర శివార్లలోని మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు వీగిపోయాయి. మణికొండ, నాగారం, తూంకుంట మున్సిపాలిటీల్లో పాలకవర్గంపై అవిశ్వాసం ప్రకటించగా బలనిరూపణ జరిపారు. -8లో



కళ్లల్లో కారం చల్లి...

ఓ వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు కళ్లల్లో కారం చల్లి..కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేసిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. -8లో

'ప్రభుత్వం' జోలికి వస్తే జైలుకే!



ప్రభుత్వానికి నష్టం వాటిల్లే వ్యవహారాల్లోని కేసులకు కీలక ప్రాధాన్యం ఇవ్వాలని సంయుక్త పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయించారు. సీసీఎస్‌లో నమోదయ్యే కేసులకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేశారు. -8లో

న్యూస్‌రీల్

ఎంపీగా మళ్లీ గెలుస్తా: అసద్



కమ్యూనిటీహాల్ భవన ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్ తదితరులు

గోల్కొండ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మళ్లీ తాను ఎంపీగా గెలుస్తానని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సగర్వంగా చెప్పారు. గురువారం గోల్కొండలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన..ఎన్నికల తర్వాత తాను ఇక్కడ పలు అభివృద్ధి పనులకు తన ఎంపీ లాడ్స్ నిధులు కేటాయిస్తానని చెప్పారు. తద్వారా గెలుపు మళ్లీ నాదే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ డివిజన్‌లో ఖాజీగల్లీ, రిసాలబజార్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం చేశారు. కమ్యూనిటీహాల్స్, భారీ పైపులైన్ పనుల నిర్మాణం కోసం తాము ఎంపీ లాడ్స్ నిధులు కేటాయించానని అన్నారు. ప్రస్తుతం ఉన్న కమ్యూనిటీహాల్స్‌కు ఫస్ట్ ఫ్లోర్ వేయడానికి పార్లమెంటు ఎన్నికల తరువాత ఎంపీ లాడ్స్ నిధులు కేటాయిస్తానని ఆయన చెప్పారు. మజ్లిస్ పార్టీ మాటకు కట్టుబడి ఉండే పార్టీ అని, పదవులతో సంబంధం లేకుండా ప్రజల వెన్నంటే ఉందని అన్నారు. అసద్ వెంట కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్ ఫరాన్, వజీఉజ్జమా సిద్దిఖీ, పాషాభాయ్, షకీల్ అలీఖాన్ తదితరులున్నారు.

చెరువుల ఆక్రమణలపై విజిలెన్స్ విచారణ



ఫిలింనగర్ బాతుర్‌కుంట లేక్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్, ఇరిగేషన్ శాఖ అధికారులు

బంజారాహిల్స్: షేక్‌పేట మండలం జూబ్లీహిల్స్ ఫిలింనగర్‌లోని రామానాయుడు స్టూడియో కింద ఉన్న బాతుర్‌కుంట చెరువు ఆక్రమణలపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) లోపల అక్రమ నిర్మాణాలు వెలిశాయని ఫిర్యాదులు అందడంతో గురువారం విజిలెన్స్ తహసీల్దార్ సంతోష్, డిప్యూటీ ఈఈ వీరభద్రరావు, ఎఫ్ఆర్‌ఓ జ్యోత్స్న, షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి, ఇరిగేషన్ ఏఈ కిషోర్‌వర్మ, జీహెచ్‌ఎంసీ పార్కు నిర్వహణ అధికారి బాలయ్య తదితరులు బాతుర్‌కుంట చెరువును, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలను పరిశీలించారు. మూడెకరాల 30 గుంటల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు చుట్టూ ఎఫ్‌టీఎల్ లోపల ఓ షెడ్డు నిర్మాణంతో పాటు కొంత ప్రాంతాన్ని బ్లూ షీట్లతో ఆక్రమించినట్లుగా గుర్తించారు. జీహెచ్‌ఎంసీ అనుమతులు తీసుకున్న కొంతమంది జిమ్ కూడా నిర్మించినట్లుగా తేలింది. పలుచోట్ల మార్కింగ్‌లు కూడా చెదరగొట్టినట్లుగా విచారణలో తేలింది. చెరువు పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, అక్రమ నిర్మాణాలను తొలగించే వ్యవహారంలో చర్చించారు. మ్యాప్‌ను కూడా పరిశీలించారు. ఎంతమేర లేక్ స్థలం కబ్జా అయ్యిందనే దానిపై ఆరా తీస్తున్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని నిర్ణయించారు. లేక్ చుట్టూ అవసరమైతే ఫెన్సింగ్ ఏర్పాటుచేయడంపై నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

మరో ఏడుగురికి పోస్టింగులు

- జీహెచ్‌ఎంసీలో 'కొత్త' పర్వం

సాక్షి, సిటీబ్యూరో: మునిసిపల్ శాఖతో పాటు ఇతర విభాగాల నుంచి ఇటీవల జీహెచ్‌ఎంసీకి బదిలీపై వచ్చిన పలువురికి కమిషనర్ రోనాల్డ్ రాస్ పోస్టింగ్‌లిస్తున్నారు. బుధవార కొందరికి పోస్టింగులివ్వగా, గురువారం మరో ఏడుగురికి పోస్టింగులిచ్చారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సీహెచ్ అరుణకుమారిని స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం) జాయింట్ కమిషనర్‌గా, పి.రవీందర్‌కుమార్‌ను ఎన్నికల విభాగం జాయింట్ కమిషనర్‌గా, ఎస్.రాజేశ్వరిని ఎన్నికల విభాగం జాయింట్ కమిషనర్‌గా, ఎ.శైలజను ఆరోగ్యవిభాగం జాయింట్ కమిషనర్‌గా, జి.కృష్ణకుమారిని ఎస్‌బీఎం జాయింట్ కమిషనర్‌గా, కె.ఆదిలక్ష్మిని స్పోర్ట్స్ విభాగం డైరెక్టర్‌గా, సి.సురేష్‌కుమార్‌ను ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ ఎస్టేట్ ఆఫీసర్‌గా నియమించారు.

పుతిన్ ప్రైవేట్ ఆర్మీలో తెలంగాణ వాసులు

ఉద్యోగాల ఆశజూపి మహమద్ అస్ఫాన్ సహా 12 మందిని రష్యా తరలించిన ఏజెంట్లు



- అక్కడకు వెళ్లాక పుతిన్ సైన్యంలో చేర్చిన అధికారులు
- ఉక్రెయిన్‌పై యుద్ధంలో వారిని వినియోగిస్తున్న రష్యా
- వెనక్కి రప్పించాలంటూ కుటుంబీకుల ఆవేదన
- స్పందించిన ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ
- ఈ అంశంపై మాస్కోలోని భారత రాయబార కార్యాలయానికి లేఖ

సాక్షి, సిటీబ్యూరో: రష్యాలో సెక్యూరిటీ గార్డు, హెల్పర్ ఉద్యోగాలు ఇప్పిస్తామన్న బ్రోకర్ల వలకు చిక్కి 12 మంది భారతీయ యువకులు ప్రస్తుతం ప్రాణభయంతో విలవిల్లాడుతున్నారు. ఉక్రెయిన్‌పై పోరులో రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్‌కు చెందిన ప్రైవేటు సైన్యం 'ది వాగ్నర్' గ్రూప్‌లో బలవంతంగా పనికి కుదర్చడంతో వారంతా బాంబులు, తుపాకుల మోత మధ్య బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తున్నారు. తమను వీలైనంత త్వరగా తిరిగి తీసుకెళ్లాలని తమ కుటుంబీకులకు ఆడియో, వీడియో సందేశాలు పంపుతున్నారు. ఈ బాధితుల్లో హైదరాబాద్‌లోని బజార్‌ఘాట్‌కు చెందిన మహమద్ అస్ఫాన్, నారాయణ్‌పేట జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ మహ్మద్ సుఫియన్ ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది.

నమ్మించి మోసం..

బాబా బ్లాగ్స్ పేరుతో యూట్యూబ్ చానల్ నిర్వహించే ఫైసల్ ఖాన్ అలియాస్ బాబా ప్రస్తుతం షార్జాలో ఉంటున్నాడు. దాదాపు 50 వేల మంది ఫాలోవర్లు ఉన్న తన బ్లాగ్ ద్వారానే రష్యాలో సెక్యూరిటీ గార్డు, హెల్పర్ ఉద్యోగాలు ఉన్నాయంటూ ఎర వేశాడు. దీనికి ఆకర్షితుడైన బజార్‌ఘాట్ ప్రాంతానికి చెందిన మహమద్ అస్ఫాన్ (30) మొదట బాబాను సంప్రదించాడు. ఏడాది కాలం కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేలా రష్యాలో ఉద్యోగాలు ఉన్నాయని నమ్మబలికాడు.



అస్ఫాన్ (బాధితుడు)





ఏజెంట్లు బాబా, మోయిన్

అతన్నుంచి రూ.3 లక్షలు వసూలు చేసి ఉద్యోగం ఖరారు చేస్తానంటూ నమ్మబలికాడు. మాస్కోలోని తన సబ్ ఏజెంట్లు సుఫాయాన్, మోయిన్, రమేష్‌లను సంప్రదించాలని సూచించాడు. దీంతో గతేడాది నవంబర్ 12న అస్ఫాన్ చెన్నై విమానాశ్రయం నుంచి షార్జా మీదుగా రష్యా చేరుకున్నాడు. ఈ ప్రయాణం కోసం విజిట్ వీసా ఏర్పాటు చేసిన బాబా.. జాబ్ వీసాను మోయిన్ ఇస్తాడని నమ్మించాడు. అక్కడకు వెళ్లిన అతన్ని రిసీవ్ చేసుకున్న రమేష్ సెక్యూరిటీ ఉద్యోగం అని చెప్పి తీసుకువెళ్లాడు.

సంతకాలు తీసుకొని..

మాస్కోలోని ఒక మాల్‌లో పని చేయాలంటూ రష్యన్ భాషలో రాసి ఉన్న పత్రంపై అస్ఫాన్‌తో రమేష్ సంతకాలు చేయించాడు. రమేష్, మోయిన్‌లు అస్ఫాన్ సహా 12 మంది భారతీయులను ఆ సమీపంలోని సైనిక శిబిరానికి తీసుకెళ్లి తుపాకులు వినియోగించడంలో ప్రాథమిక శిక్షణ ఇచ్చారు. సెక్యూరిటీ గార్డు విధుల్లో భాగంగానే ఇది ఇస్తున్నట్లు నమ్మించారు. ఆపై వారిని దాదాపు వెయ్యి కి.మీ. దూరంలోని ఉక్రెయిన్ సరిహద్దుల్లోకి చేర్చారు. దీంతో తాను సంతకం చేసింది పుతిన్‌కు చెందిన ప్రైవేట్ ఆర్మీ ది వాగ్నర్ గ్రూప్‌లో ఏడాది పాటు పని చేసేందుకని అస్ఫాన్ ఆలస్యంగా గుర్తించాడు. ఆజాద్ యూసుఫ్ అనే భారతీయుడు తమ కళ్లెదుటే అశువులు బాయడంతో మిగిలిన వారంతా ఆందోళన చెందారు. అనంతరం వారిని అక్కడ నుంచి ఉక్రెయిన్‌లోని వేర్వేరు ప్రాంతాలకు తరలించారు.

రూ. లక్ష జీతమంటూ సుఫియన్‌ను మోసగించి...

నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన డ్రైవర్ జహీర్, నాసీమా రెండో కుమారుడు సయ్యద్ మహ్మద్ సుఫియన్ ఇంటర్ వరకు చదువుకొని 2021లో జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లి హోటల్‌లో పనిచేస్తున్నాడు. అక్కడే అతనికి బాబా పరిచయమయ్యాడు. దుబాయ్‌లో పనిచేస్తే రూ.30 వేలే వస్తాయ్..అదే రష్యాలో హెల్పర్‌గా పనిచేస్తే రూ.లక్ష వరకు జీతం వస్తుందని నమ్మించాడు. ఇందుకుగాను తనకు రూ.3 లక్షలు ఇవ్వాలని చెప్పాడు. అందుకు సుఫియన్ అంగీకరించడంతో తల్లిదండ్రులు అప్పు చేసి ఆ డబ్బు కుమారుడికి ఇచ్చారు. డిసెంబర్ 17న దుబాయ్‌కు అక్కడి నుంచి 18న రష్యాకు సుఫియాన్ వెళ్లాడు.

రక్షించాలంటూ సందేశాలు..

అస్ఫాన్ గతేడాది డిసెంబర్ 13 వరకు కుటుంబీకులతో సంప్రదింపులు జరిపినా ఆపై సిగ్నల్స్ దొరకలేదు. మిగిలిన 11 మందికీ సరైన సిగ్నల్స్ లభించక కుటుంబీకులకు ఆడియో, వీడియో సందేశాలు పంపారు. వాటిలోనే తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ రికార్డుల్లో బాంబుల మోతలు, తుపాకీ కాల్పులు వినిపిస్తున్నట్లు కుటుంబీకులు చెబుతున్నారు. అస్ఫాన్ సోదరుడు ఇమ్రాన్ 'సాక్షి'తో మాట్లాడుతూ 'అస్ఫాన్‌కు భార్య, కుమార్తె (2), కుమారుడు (8 నెలలు) ఉన్నారు. ఉక్రెయిన్‌లోని యుద్ధ క్షేత్రంలో ఉన్న అతడిని ఇక్కడకు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అస్ఫాన్ ఇటీవల పంపిన సందేశంలో వారి చుట్టూ ఉన్న వాళ్లు యుద్ధంలో మరణిస్తున్నారని చెప్పాడు. నన్ను వెనక్కు తీసుకురావడానికి ఏదైనా చేయాడంటూ వేడుకున్నాడు' అని పేర్కొన్నాడు. బాధిత కుటుంబాల కోరిక మేరకు స్పందించిన ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఈ అంశంపై మాస్కోలోని భారత రాయబార కార్యాలయానికి లేఖ రాశారు.

గుదిబండ!

భారీ ప్రాజెక్టులతో బల్దియాపై భారం

- జీతాల చెల్లింపులకూ కటకటే..
- ప్రభుత్వం కరుణిస్తేనే మనుగడ

సాక్షి, సిటీబ్యూరో: ఒకప్పుడు ఖజానాలో నిధుల గలగలతో కళకళలాడిన గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ప్రస్తుతం నెలనెలా సకాలంలో సిబ్బందికి జీతాలు చెల్లించలేక తిప్పలు పడుతోంది. ఆర్థికంగా కుదేలయ్యే పరిస్థితికి చేరుకుంది. ఇందుకు కారణాలు అన్వేషిస్తే..గత కొన్నేళ్లుగా బల్దియా చేపట్టిన భారీ ప్రాజెక్టులు గుదిబండగా మారడమే అని అంటున్నారు. ముఖ్యంగా వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్సార్డీపీ), వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం(ఎస్ఎన్‌డీపీ), సమగ్ర రోడ్డు నిర్వహణ పథకం (సీఆర్ఎంపీ) వంటి భారీ ప్రాజెక్టుల పనుల కోసం బల్దియా భారీగా అప్పులు చేసింది. బాండ్ల ద్వారానూ నిధులు సేకరించింది. వాటికి చెల్లించాల్సిన వడ్డీ, ఈఎంఐలు చెల్లిస్తూ మనుగడ సాగించడం కష్టంగా మారింది. మెయింటెనెన్స్ పనులు చేసిన సివిల్ కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు సైతం రూ.1200 కోట్ల మేర బకాయిలున్నాయి. దాంతో వారు తరచూ ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వానికి వినతులు చేసుకుంటున్నారు. పనులు ఇక చేయలేమంటూ సాధారణ, దిగువస్థాయి కాంట్రాక్టర్లు పనులు నిలిపివేస్తున్నారు. ఓవైపు జీహెచ్‌ఎంసీ తలకు మించిన భారంగా అప్పులు చేయగా, మరోవైపు జీహెచ్‌ఎంసీకి ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు సైతం రాక పరిస్థితి దారుణంగా తయారైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జీహెచ్‌ఎంసీకి కనిష్టంగా రూ.వెయ్యి కోట్లయినా ఇస్తేనే మనుగడ సాగించగలదని పార్టీల కతీతంగా ఎమ్మెల్యేలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనూ ప్రస్తావించి ప్రభుత్వం ఆదుకోవాల్సిందిగా కోరారు.

కౌన్సిల్‌లోనూ చర్చ..

రాబోయే ఆర్థిక సంవత్సరానికి జీహెచ్‌ఎంసీకి రూ.3,492 కోట్లివ్వాల్సిందిగా కోరుతూ ఇటీవలి జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లందరూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. నిధుల లేమితో నిత్యం చేయాల్సిన నిర్వహణ పనులు కూడా జరగడం లేవని, పారిశుధ్యం పడకేసిందని, వీధి దీపాలు వెలగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకుంటేనే జీహెచ్‌ఎంసీ మనుగడ సాగించనుంది. లేని పక్షంలో పరిస్థితి మరింత దుర్భరం కానుంది. జీహెచ్‌ఎంసీ మనుగడకు, ప్రజల సమస్యల పరిష్కారానికి నిధులు ఇవ్వాలని కార్పొరేటర్ల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వరకు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. దాదాపు మూడున్నర వేల కోట్లు అవసరమని పేర్కొన్నారు.

జీహెచ్‌ఎంసీ పరిస్థితి ఇదీ..

ఆయా ప్రాజెక్టుల కోసం బ్యాంకులు, బాండ్ల ద్వారా చేసిన అప్పులు

ప్రాజెక్టు	అప్పు (రూ.కోట్లు)
ఎస్సార్‌డీపీ	4250.00
సీఆర్ఎంపీ	1304.00
ఎస్ఎన్‌డీపీ	680.00
మొత్తం	6234.00



గడచిన ఐదేళ్లలో జీహెచ్‌ఎంసీ ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తే ఆయా ప్రాజెక్టుల కోసం తీసుకున్న అప్పులు పెరిగాయిలా..

సంవత్సరం	అప్పులు(కోట్లలో)
2018-19	586.16
2019-20	843.05
2020-21	1275.25
2021-22	1275.25
2022-23	1324.50
2023-24	573.57

ఈ ఆర్థిక సంవత్సరానికి ఇప్పటికే రూ.205.23 లోటు బడ్జెట్‌తో ఉంది-

త్వరలో చెల్లించాల్సినవి..

వీటికిగాను మార్చి నెలాఖరు వరకు వడ్డీతో సహ చెల్లించాల్సిన ఈఎంఐ :రూ.824 కోట్లు
కాంట్రాక్టర్లకు మెయింటనెన్స్ పనులకు చెల్లించాల్సిన బిల్లుల బకాయిలు: రూ.1200 కోట్లు.

ప్రభుత్వం నుంచి జీహెచ్‌ఎంసీకి రావాల్సిన బకాయిలు (రూ.కోట్లు)

ప్రొఫెషనల్ ట్యాక్స్: 300.00
ప్రభుత్వ భవనాల ఆస్తిపన్ను: 107.00
పట్టణ ప్రగతి నిధులు: 227.00
మ్యుటేషన్ ఫీజులు: 175.46
ట్రాన్స్‌ఫర్ డ్యూటీ: 2950.00

- వీటిల్లో స్టాంప్‌డ్యూటీపై సర్‌చార్జిని కూడా వసూలు చేసే రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ విభాగం సర్‌చార్జిని(ట్రాన్స్‌ఫర్ డ్యూటీ) జీహెచ్‌ఎంసీకి చెల్లించాల్సి ఉంది. 2019 మే నుంచి చెల్లించాల్సిన సదరు నిధులు చెల్లించకపోవడంతో బకాయిలిలా భారీగా పేరుకుపోయాయి.
- జీహెచ్‌ఎంసీ అధికారుల అంచనాల మేరకే ఇప్పటి నుంచి మార్చి నెలాఖరు వరకు రానున్న ఆదాయం దాదాపు రూ.685 కోట్లు కాగా, వ్యయం మాత్రం రూ.1276 కోట్లుగా ఉంది. అంటే లోటు రూ. 591 కోట్లు.

ఆదాయం ఇలా..

ఆస్తిపన్ను: రూ.300 కోట్లు
భవన నిర్మాణ అనుమతుల ఫీజులు: రూ.150 కోట్లు
ట్రేడ్ లైసెన్సులు, ఇతరత్రా ఫీజులు: రూ.30 కోట్లు
15వ ఆర్థికసంఘం నిధులు: రూ.205 కోట్లు

వ్యయం ఇలా..

సిబ్బంది వేతనాలు: రూ.240 కోట్లు
పనులకు చెల్లించాల్సిన బిల్లులు: రూ.252
ఘనవ్యర్థ నిర్వహణ చెల్లింపులు: రూ.142 కోట్లు
వీధి దీపాలు నిర్వహణ, వాటర్‌బోర్డుకు చెల్లింపులు: రూ.170 కోట్లు.
డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విద్యుత్‌కు: రూ. 92 కోట్లు
భూసేకరణ: రూ. 200 కోట్లు
ఇతరత్రా: రూ. 180 కోట్లు


సామాన్యులకు భరోసా కల్పిద్దాం

పోలీస్ అంటే ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్పడాలి

- 9 నెలల శిక్షణను సద్వినియోగం చేసుకోండి
- ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి
- అంబర్‌పేట పోలీస్ శిక్షణ కేంద్రంలో 582 మందికి శిక్షణ ప్రారంభం



శిక్షణ కోసం వచ్చిన అభ్యర్థులతో అధికారులు



శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి

అంబర్‌పేట్: 'పోలీస్ స్టేషన్‌కు వచ్చే సామాన్య బాధితులకు భరోసా కల్పించేలా పోలీస్ విధులు ఉండాలి. పోలీసులంటే ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్పడాలి. అందుకు పోలీస్ విభాగంలోని అన్ని వర్గాల వారు కృషి చేయాలి' అని రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ ఐజీ శివధర్‌రెడ్డి అన్నారు. సమాజంలో రోజురోజుకు విభిన్న నేరాలు చోటు చేసుకుని పోలీసులకు సవాలుగా మారుతున్నాయని, వాటిని అధిగమించేలా శిక్షణ పొందాలని ఆయన సూచించారు. గురువారం అంబర్‌పేట పోలీస్ శిక్షణ కేంద్రంలో నూతనంగా ఎంపికైన 582 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్ విభాగానికి రావడానికి ఎంతోమంది యువత కలలు కంటారని, అలాంటి కలలు మీరు సాకారం చేసుకోవడం అభినందనీయం అన్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు, పోలీస్ ఉద్యోగాలకు చాలా తేడా ఉంటుందని అది మీరు ఎంచుకున్నందుకు గర్వపడాలన్నారు. సమాజంలో పోలీస్ పాత్ర ఎంతో కీలకమని దానిని దృష్టిలో ఉంచుకొని శిక్షణ పొంది ఉత్తమ పోలీస్‌గా శిక్షణ పొంది రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ పి.మధుకర్ స్వామి మాట్లాడుతూ..9 నెలల శిక్షణ కాలంలో అభ్యర్థులకు అన్ని అంశాల్లో ఉత్తమ శిక్షణ అందిస్తామన్నారు. రెండు సెమిస్టర్‌లుగా విభజించి నేరాల పట్ల సమగ్ర శిక్షణ అందిస్తామన్నారు. 40 సంవత్సరాల పాటు చేసే ఉద్యోగానికి సరిపడా శిక్షణ ఈ తొమ్మిది నెలల కాలంలో అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీలు పిచ్చయ్య, లక్ష్మీ కాంత్‌రెడ్డి, మదన్‌మోహన్, ఇన్‌స్పెక్టర్‌లు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీశైలం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగం అంటే ప్యాషన్



పోలీస్ ఉద్యోగం అంటే నాకు చిన్నప్పటి నుంచి ఇష్టం..ప్యాషన్. అందుకే ఈ ఉద్యోగం కోసం కష్టపడి ప్రిపేర్ అయ్యాను. ఎంతో చరిత్ర ఉన్న పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందే అవకాశం రావడం గర్వంగా ఉంది. శిక్షణను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటాను.

– గద్దె వేణుగోపాల్ ముల్కనూర్, వరంగల్

స్ఫూర్తి పొందాను...



చిన్నప్పుడు మా గల్లీలో ఓ పోలీస్ అధికారిని చూసి స్ఫూర్తి పొందాను. అప్పటినుంచి పోలీస్ అవ్వాలని నిర్ణయించుకుని..కష్టపడి ప్రిపేర్ అయి ఎంపికయ్యాను. శిక్షణ కాలాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ పోలీస్‌గా విధులు నిర్వహిస్తాను.

– టి.సాయికృష్ణ బోధన్, నిజామాబాద్

వేగవంతంగా అభివృద్ధి పనులు

- కమిషనర్ ఆదేశాలు
- పాతబస్తీలో బల్దియా పనులు పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ ప్రాంతాల్లో నాలా పనులు పూర్తికాలేదని, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు నిర్వహణ లోపంతో అధ్వాన్నంగా మారాయని, అభివృద్ధి పనులు కుంటుతున్నాయని జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ల నుంచి వెల్లువెత్తిన విమర్శల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ పాతబస్తీలోని వివిధ ప్రాంతాలను ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి పరిశీలించారు. ఆయా పనులు సత్వరం పూర్తిచేయాలని, నిర్ణీత వ్యవధి కంటే ముందుగానే పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గంగానగర్ వరదనీటి కాలువను పరిశీలించిన కమిషనర్ యాకుత్‌పురా మౌలిక చిల్ల గంగానగర్ నుండి భవాని నగర్ వరకు నాలా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేసవిలోనే యుద్ధప్రాతిపదికన నాలా పనులను పూర్తి చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. అంతకు ముందు మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో స్విమ్మింగ్ పూల్‌కు మరమ్మత్తులు చేపట్టాలని అడిషనల్ కమిషనర్(స్పోర్ట్స్)ను ఆదేశించారు. కమిషనర్, ఎంపీల వెంట చార్మినార్, యాకుత్‌పురాల శాసన సభ్యులు మీర్ జుల్ఫీకర్ అలీ, జాఫర్ హుస్సేన్ మెరాజ్, ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్, కార్పొరేటర్ సోహెల్ ఖాద్రీ, సీసీపీ రాజేంద్ర ప్రసాద్ నాయక్, శానిటేషన్, స్పోర్ట్స్ విభాగాల అడిషనల్ కమిషనర్లు ఉపేందర్ రెడ్డి, యాదగిరి రావు ఉన్నారు.



కలెక్టరేట్ పరిసరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

కలెక్టరేట్‌లోకి అన్ని జిల్లా శాఖలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా స్థాయి ప్రభుత్వ శాఖల కార్యాలయలన్నింటిని లక్డీకాపూల్‌లోని స్నేహ సిల్వర్ జూబ్లీ భవన్‌లోని కలెక్టరేట్‌లోకి తరలించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టరేట్ భవన నిర్వహణపై వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాలు తమ తమ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్టిక్కర్లు, పోస్టర్లు తొలగించాలని, అందంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. పనికిరాని స్క్రాప్‌ను తొలగించాలని, కలెక్టరేట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సంబంధిత విభాగాలకు సూచించారు. అనంతరం ఆయన కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు సీపీఓ ఎస్.సురేందర్, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ నాగలక్ష్మి, డీబీసీడీఓ ఆశన్నా, డిఎస్ఓఆర్. కేశవులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ , డీడబ్ల్యూఓ నాగేశ్వర్ రావు అధికారులు నర్సింహా రావు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

రానున్న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని కమలా నెహ్రూ మహిళా పాలిటెక్నిక్, సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాలను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో హైదరాబాద్ పార్లమెంటరీ లోకసభ నియోజకవర్గంలోని చార్మినార్, యాకుత్ పూర నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కోసం పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ రోజు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే ఏర్పాట్లను సమీక్షించుకోవాలని, ఏజెంట్లు, అధికారులు కౌంటింగ్ కేంద్రంలోనికి ప్రవేశించడానికి దారులు వేరువేరుగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కోసం వేరే హాల్‌లో ఏర్పాట్లు చేయాలని అన్నారు.

ఖరీదైన మద్యం తాగాలని...

పనిచేస్తున్న పబ్‌కే కన్నం వేసిన సెక్యూరిటీ గార్డ్

బంజారాహిల్స్: ఓ పబ్ సెక్యూరిటీ గార్డ్ విదేశీ లిక్కర్ బాటిల్‌ను చోరీ చేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని ఆర్.యూ పబ్‌లో కొంతకాలంగా వినీత్‌కుమార్ అనే యువకుడు సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఈ పబ్‌కు వచ్చే యువత ఖరీదైన విదేశీ లిక్కర్‌ను సేవిస్తుండటాన్ని గుర్తించిన అతను తాను కూడా స్నేహితులతో కలిసి ఆ లిక్కర్‌ను తాగాలనుకుని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న రాత్రి పబ్ మూసివేసిన తర్వాత తన ఇద్దరు స్నేహితులతో కలిసి లోపలికి వెళ్లి క్యాష్ బాక్స్‌లో ఉన్న రూ.2 లక్షల నగదుతో పాటు ఐదు రాయల్ సెల్యూట్ లిక్కర్ బాటిళ్లు, ఒక చివాస్ రీగల్, ఒక మొహిట్ చాన్ దాన్ బాటిల్‌ను చోరీ చేసి పబ్‌పై అంతస్తు నుంచి పైపుల ద్వారా కిందకు దిగి పరారయ్యారు. మర్నాడు ఉదయం పబ్ మేనేజర్ మద్యం బాటిళ్లతో పాటు నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. సీసీ ఫుటేజీలు పరిశీలించగా సెక్యూరిటీ గార్డ్ వినీత్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు అగంతకులు నగదు, బాటిళ్లతో కిందకు పైపుల ద్వారా కిందకు జారుతున్న దృశ్యాలను గుర్తించారు. ఆ రోజు నుంచి వినీత్‌కుమార్ విధులకు హాజరుకావడం లేదని, ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ ఉందని మేనేజర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీగిన అవిశ్వాసం

నగర శివార్లలోని మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు వీగిపోయాయి. మణికొండ, నాగారం, తూంకుంట మున్సిపాలిటీల్లో ప్రస్తుత పాలకవర్గంపై అవిశ్వాసం ప్రవేశపెడుతూ పలువురు సభ్యులు తీర్మానం చేయడమే గాక కలెక్టర్లకు వినతిపత్రాలు సైతం అందజేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయా మున్సిపాలిటీల్లో బల నిరూపణకు ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. అయితే, మూడు మున్సిపాలిటీల్లోనూ సభ్యులు గైర్హాజరు కావడంతో అవిశ్వాస తీర్మానాలు వీగిపోయాయి.. ఇందుకు సంబంధించిన వివరాలు..

- మూడు మున్సిపాలిటీల్లోనూ అదే తంతు
- మణికొండలో 10 మంది కౌన్సిలర్లు మాత్రమే హాజరు
- నాగారంలో సభ్యుల గైర్హాజరు.. తూంకుంటలోనూ అంతే

మణికొండ: మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. రాజేంద్రనగర్ నియోజకవర్గం మణికొండ మున్సిపాలిటీకి చెందిన 10 మంది కౌన్సిలర్లు గత నెల కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు లేఖ ఇచ్చారు. దీంతో గురువారం రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. అయితే, సమావేశానికి ముందుగా 8 మంది సభ్యులు హాజరుకాగా, మరి కొందరు వస్తున్నారని.. సమయం పొడిగించాలని కోరారు. కాగా, 11.30 గంటల నుంచి 12.30 వరకు కొనసాగిన సమావేశం మరో గంట పొడిగించగా, మరో ఇద్దరు సభ్యులు వచ్చారు. దీంతో వారి బలం 10కి చేరువ కావడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీఓ ప్రకటించారు. కౌన్సిల్‌లో మెజార్టీ సభ్యుల బలం తమకే ఉందని, నైతిక విజయం తమదేనని అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు ప్రకటించారు. ప్రతిపక్షాలకు బలం లేక తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని తన వర్గం కౌన్సిలర్లతో గోవాలో ఉన్న చైర్మన్ తెలిపారు. తనను పదవి నుంచి దించేందుకు బీఆర్‌ఎస్, బీజేపీలు ఒకటైనా సాధ్యం కాలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, కార్పొరేటర్‌లు పార్టీని వీడి మున్సిపల్ చైర్మన్, మేయర్‌పై అవిశ్వాసాలు పెడుతున్నారు.



విక్టరీ సింబల్ చూపుతున్న మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్, కాంగ్రెస్ కౌన్సిలర్లు

మరోవైపు మణికొండలో మాత్రం కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్మన్‌పై బీఆర్‌ఎస్, బీజేపీ, స్వతంత్ర, కాంగ్రెస్ రెబల్ సభ్యులు అవిశ్వాసం పెట్టడం, అది కూడా వీగిపోవటం చర్చనీయాంశమైంది.

నాగారంలో సభ్యుల డుమ్మా

కీసర: నాగారం మున్సిపల్ చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. కీసర ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డిపై అవిశ్వాస తీర్మానం కోసం నిర్వహించిన సమావేశానికి సభ్యులు హాజరుకాలేదు. దీంతో సమావేశాన్ని మధ్యాహ్నం 1 గంటకు వాయిదా వేసినా సభ్యులు రాలేదు. దీంతో 2 గంటలకు వైస్ చైర్మన్ బండారి మల్లేశ్ యాదవ్‌పై అవిశ్వాస తీర్మాన సమయానికి సభ్యులు డుమ్మా కొట్టడంతో అవిశ్వాసం నెగ్గలేదని అధికారులు వెల్లడించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని ఆర్డీఓ తెలిపారు.

తూంకుంటలోనూ..

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ పన్నాల వాణిపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయిందని మల్కాజ్‌గిరి ఆర్డీఓ శ్యాంప్రకాశ్ తెలిపారు. ఈ నెల 5న చైర్మన్, వైస్ చైర్మన్‌పై 11 మంది కౌన్సిలర్లు తమ అవిశ్వాసంపై సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమయానికి కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు సమయాన్ని పొడిగించారు. అయినా, కౌన్సిలర్లు రాకపోవడంతో చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయిందని ఆర్డీఓ శ్యాంప్రకాశ్ తెలిపారు. అలాగే వైస్ చైర్మన్ పన్నాల వాణిపై పెట్టిన సమావేశానికి కూడా సభ్యులు హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయింది.

వినూత్నమైన మైక్రో స్కూలింగ్

- దేశంలోనే మొట్టమొదటి మైక్రో స్కూల్‌గా డ్రీమ్‌టైమ్ లెర్నింగ్ హబ్
- ప్రాచీన గురుకుల విద్యకు సాంకేతిక హంగులు..
- సహజత్వం, సాంకేతికతలే ప్రామాణికం..: వ్యవస్థాపకురాలు లీనా అషర్



సాక్షి, సిటీబ్యూరో: విద్యా రంగంలో ఎన్నో వినూత్న మార్పులకు నాంది పలికిన హైదరాబాద్ నగరం వినూత్నమైన మైక్రో స్కూలింగ్ విధానానికి కూడా వేదికగా నిలిచిందని డ్రీమ్‌టైమ్ లెర్నింగ్ హబ్ వ్యవస్థాపకురాలు లీనా అషర్ అన్నారు. జూబ్లీహిల్స్ వేదికగా ప్రారంభించిన దేశంలోనే మొట్టమొదటి మైక్రో స్కూల్ 'డ్రీమ్‌టైమ్ లెర్నింగ్ హబ్' ఆధ్వర్యంలో వార్షిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...తాను ఆస్ట్రేలియా నుంచి భారత్ వచ్చిన సమయంలో ఇక్కడి విద్యా విధానాలు, విద్యార్థులపై ఒత్తిడి ప్రమాణాలు చూసి చలించిపోయానన్నారు. భారత్‌లోని పురాతన కాలంనాటి అద్భుతమైన గురుకుల విద్యా విధానానికి అధునాతన హంగులద్ది డ్రీమ్‌టైమ్ లెర్నింగ్ హబ్‌ను ప్రారంభించామన్నారు. ఈ మైక్రో స్కూల్‌లో ఒక తరగతిలో కేవలం 10 మంది విద్యార్థులు మాత్రమే ఉంటారని, వారికి చదువులో స్వేచ్ఛతో పాటు ఆహ్లాదకరమైన సహజమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇందులో కేంబ్రిడ్జ్‌కు చెందిన ఐజీసీఎస్ విద్యా విధానాన్ని అవలంబిస్తూ, విద్యార్థి దశలోనే ప్రాక్టికల్ అవగాహనతో 3డీ, డిజిటల్ విధానంలో బోధన సాగుతుందన్నారు. చిన్నారుల్లో వ్యక్తిత్వ వికాసం, జ్ఞాన సముపార్జన, సామాజిక భావోద్వేగాలను పెంచేలా డిస్కవరీ రూమ్స్, రోబోటిక్ తరగతులు ఉంటాయన్నారు. మల్టీమీడియా, ఏఐ తదితర సాంకేతికతల అనుసంధానంగా కొనసాగే ఈ వినూత్న స్కూల్‌ను రాష్ట్ర ప్రభుత్వ అనుమతి పొందాక కేంబ్రిడ్జ్ నిపుణుల పర్యవేక్షణ అనంతరం నెలకొల్పినట్లు తెలిపారు. ఈ విద్యా విధానాన్ని అతి త్వరలో బెంగళూరు, పూణె, చెన్నై, ఢిల్లీ వంటి నగరాల్లోనూ ప్రారంభించనున్నామని ఆమె వివరించారు. కార్యక్రమంలో డ్రీమ్‌టైమ్ లెర్నింగ్ హబ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ అరుణ రావు, హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకురాలు షారన్ తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకుల్లో ఆకస్మిక తనిఖీలు

- రక్త సేకరణ, నిల్వ, పరీక్షల్లో లోపాలున్నట్లు గుర్తింపు
- 9 బ్లడ్ బ్యాంకులకు డ్రగ్ కంట్రోల్ బ్యూరో నోటీసులు

లక్డీకాపూల్ : నగరంలోని బ్లడ్ బ్యాంకుల్లో ఆకస్మిక సోదాలు జరిగాయి. గురువారం తొమ్మిది బ్లడ్ బ్యాంకులలో డ్రగ్ కంట్రోల్ బ్యూరో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రమాణాలు పాటించని తొమ్మిది బ్లడ్ బ్యాంకులకు నోటీసులు జారీ చేశారు. బ్లడ్ బ్యాంకుల్లో నిల్వలు, రక్త సేకరణ పరీక్షల్లో లోపాలున్నట్లు డ్రగ్ కంట్రోల్ బ్యూరో అధికారులు గుర్తించారు. అంతే కాకుండా ప్లేట్‌లెట్స్ , ప్లాస్మా నిల్వల్లో కూడా లోపాలు ఉన్నట్లు నిర్ధారించారు.

నోటీసులు జారీ చేసిన బ్లడ్ బ్యాంక్‌లివీ..

లక్డీకాపూల్ లోని ఏవీఎస్ బ్లడ్ సెంటర్, హిమాయత్ నగర్‌లోని రుధిర వాలంటరీ బ్లడ్ సెంటర్, సికింద్రాబాద్ లోని ప్రతిమ సాయి బ్లడ్ సెంటర్, కోఠిలోని తలసేమియా రక్షిత వాలంటరీ బ్లడ్ సెంటర్, మలక్‌పేట లోని శ్రీ బాలాజీ బ్లడ్ సెంటర్, చైతన్యపురిలోని నవజీవన్ బ్లడ్ సెంటర్, మెహదీపట్నంలోని వివేకానంద బ్లడ్ సెంటర్, బాలానగర్‌లోని నంది బ్లడ్ సెంటర్, ఉప్పల్ లోని ఎంఎస్ఎన్ బ్లడ్ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు.

కళ్లల్లో కారం చల్లి...

కత్తులతో దాడి చేసి.. వ్యక్తి దారుణ హత్య



సాయికుమార్(ఫైల్)

ఉప్పల్: ఓ వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు కళ్లల్లో కారం చల్లి కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేసిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన పుస్తకాల సాయికుమార్(43) వృత్తి రీత్యా ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. గతంలో అతను ఉప్పల్ ఆదర్శ నగర్‌లో నివాసం ఉండేవాడు. కాగా బుధవారం రాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అతడిని ఉప్పల్ జెన్ ప్యాక్ట్ వద్దకు పిలిపించి కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

వివాహేతర సంబంధమే కారణం?

వివాహేతర సంబంధమే హత్యకు కారణంగా తెలుస్తోంది. ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన మహిళతో సాయికుమార్ వివాహేతర సంబంధాన్ని కొనసాగించేవాడని సమాచారం. గత కొన్నాళ్లుగా సదరు మహిళ సాయికుమార్‌ను దూరం పెట్టడంతో వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో సాయికుమార్ తరచూ ఆమెను వేధిస్తుండటంతో బుధవారం సాయంత్రం మాట్లాడుకుందామని జెన్‌ప్యాక్ట్ ప్రాంతానికి పిలిపించింది. అతను అక్కడికి రాగానే పథకం ప్రకారం మరో యువతి, ఇద్దరు యువకులతో కలిసి సాయికుమార్ కళ్లల్లో కారం చల్లి కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లుగా తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నూతన పథకాలతో అగ్రగామిగా ఎస్‌బీఐ..


జనరల్ మేనేజర్ ప్రకాష్ చంద్ర బరోడ్



సాక్షి, సిటీ బ్యూరో: ఖాతాదారుల నిరంతర సేవలో భారతీయ స్టేట్ బ్యాంక్ అప్రతిహతంగా ముందుకు సాగుతోందని, రోజురోజుకూ పెరుగుతున్న విశ్వసనీయతే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని నగర ఎస్‌బీఐ స్టాఫ్ కాలేజీ జనరల్ మేనేజర్-డైరెక్టర్ ప్రకాష్ చంద్ర బరోడ్ తెలిపారు. ఎస్‌బీఐ ఖాతాదారుల సంఖ్య 50 కోట్లు దాటిన ప్రత్యేక సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.., రెండు శతాబ్దాలకు పైబడి ఖాతాదారులకు సేవలందిస్తూ, వారి నూతన అభిరుచులకు తగినట్లుగా పథకాల్లో మార్పులను చేసుకుంటూ ఖాతాదారులకు సేవలందిస్తూ గణనీయమైన ప్రగతిని సాధించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నూతన పథకాలతో, సాంకేతిక హంగులతో భారతీయ బ్యాంకింగ్ రంగంలో అగ్రగామిగా కొనసాగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో స్టేట్ బ్యాంక్ స్టాఫ్ కాలేజీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం' జోలికి వస్తే జైలుకే!

- భూములు కబ్జా, మోసాలు, ఎగవేతలపై సీరియస్
- ఈ తరహా కేసుల దర్యాప్తునకు ప్రాధాన్యం
- నోటీసులకు బదులు నేరుగా అరెస్టులే
- మోసగాళ్ల పైనా ఉక్కుపాదం మోపాలని నిర్ణయం
- హైదరాబాద్ సీసీఎస్‌లో కీలక సంస్కరణలు మరూ



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పోలీసు వింగ్‌కు గుండెకాయ వంటి నగర నేర పరిశోధన విభాగంలో (సీసీఎస్) కీలక సంస్కరణలు చోటు చేసుకుంటున్నాయి. ప్రాథమిక విచారణ, కేసుల దర్యాప్తు, నిందితులపై చర్యలకు సంబంధించి నిర్దిష్టమైన విధానాలు రూపొందిస్తున్నారు. ప్రభుత్వానికి నష్టం వాటిల్లే కేసులకు కీలక ప్రాధాన్యం ఇవ్వాలని సంయుక్త పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే సీసీఎస్‌లో నమోదయ్యే కేసులకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. 'ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు నష్టం వాటిల్లకుండా చూడటం, బాధితులకు వీలైనంత తర్వగా ఊరట లభించేలా చేయడంతో పాటు వ్యక్తిగత సివిల్ వివాదాలు కేసులుగా మారకుండా చూసేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగమే ఇది' అని రంగనాథ్ పేర్కొన్నారు.

ఆ కేసుల్లో కచ్చితంగా అరెస్టులు...

ఈ విభాగంలో నమోదయ్యే కేసుల్లో దాదాపు ప్రతి ఒక్కటీ భారీ మొత్తాలతో ముడిపడి ఉంటుంది. దీంతో సుదీర్ఘ దర్యాప్తులు అవసరమవుతాయి. న్యాయస్థానం ఆదేశాల మేరకు గడిచిన కొన్నాళ్లుగా పోలీసు విభాగం ఏడేళ్ల లోపు శిక్షపడే సెక్షన్ల కింద నమోదైన కేసుల్లో అరెస్టులకు బదులుగా సీఆర్పీసీ 41-ఏ సెక్షన్ ప్రకారం నోటీసులు ఇస్తున్నారు. సీసీఎస్‌లో నమోదయ్యే కేసుల స్వరూప స్వభావాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన రంగనాథ్ దీనిపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ భూముల కబ్జా, ప్రభుత్వ రంగ సంస్థలకు ఆర్థికంగా నష్టం కలిగించడం, ఆయా విభాగాలకు మోసం చేయడం వంటి కేసుల్లో సెక్షన్లతో సంబంధం లేకుండా కచ్చితంగా అరెస్టు చేసి జైలుకు పంపేలా ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ఆర్టీసీకి రూ.20 కోట్లకు పైగా టోకరా వేసిన నిందితుడిని అరెస్టు చేయడాన్ని న్యాయస్థానం సైతం సమర్థించింది. దీంతో ఇకపై ఇదే విధానం కొనసాగించనున్నారు.


మిగిలిన రెండు రకాల వాటిలో ఇలా...

ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలతో ముడిపడి ఉండే కేసులను సీసీఎస్ అధికారులు మొదటి కేటగిరీలో చేర్చారు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతిలో పాటు ఎక్కువ సంఖ్యలో బాధితులు ఉండే కేసులను రెండో కేటగిరీలోకి చేర్చారు. వీటిలో నిందితులను అరెస్టు చేయడంతో పాటు బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం జరిగేలా చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. సాహితి సంస్థ కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయడం, ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్న చట్టాలు, విధానాలను అధ్యయనం ఈ చర్యల్లో భాగమే. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే ఆర్థిక లావాదేవీలకు సంబంధించి నమోదయ్యే కేసులను సంయుక్త సీపీ మూడో కేటగిరీలో చేర్చారు. ఈ కేసుల దర్యాప్తునకు సముచిత ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ... అరెస్టుల విషయంలో మాత్రం ఆచితూచి వ్యవహరించనున్నారు.

క్షుణ్ణంగా పూర్వాపరాల పరిశీలన...

చీటింగ్ కేసుల నమోదు, దర్యాప్తునకు సంబంధించి సీసీఎస్ పోలీసులు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ తరహా కేసులు నమోదు చేయడానికి ముందు అధికారులు ప్రాథమిక విచారణ (ప్రిలిమినరీ ఎంక్వైరీ) పదేపదే మోసాలు చేసే నేరగాళ్లు చాలా తెలివిగా వ్యవహరిస్తుంటారు. వీలున్నంత వరకు తాను చేసే నేరాలకు సాక్ష్యాధారాలు లేకుండా జాగ్రత్తపడతారు. ఈ కారణంగానే పీఈగా పిలిచే ప్రాథమిక విచారణలో ఆధారాలు లభించక వారు బయటపడుతూ ఉంటారు. దీన్ని గమనించిన ఏవీ రంగనాథ్ పీఈ నిర్వహించే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి గత చరిత్రనూ పరిగణలోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఈడీ జగదీశ్ ప్రసాద్ కన్నుమూత



సాక్షి, సిటీబ్యూరో: ప్రజా రవాణా వ్యవస్థలో 34 ఏళ్ల పాటు విశేష సేవలందించిన ఉమ్మడి ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రిటైర్డ్) జగదీశ్‌ప్రసాద్ (83) హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. జగదీశ్ ప్రసాద్ మృతి పట్ల ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. 1965లో కొవ్వూరు డిపో మేనేజర్‌గా ఆర్టీసీలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆయన.. అంచెలంచెలుగా ఎదిగి 1995లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కడప)గా ఎదిగారు.

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-II
At: Triveni Complex, 1st Floor, Abids, Hyderabad

O.A. No. 809 of 2023

Between:
M/s. YES Bank Ltd ...Applicant
And
Mr. Shaik Alauddin & Anr ....Defendants

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
1. Mr. Shaik Alauddin S/o. Gani Shaik, Aged about 37 years, Occ: Business, R/o. Plot No. 88, Santosh Nagar, Balaji Nagar, Shameerpet, Jawaharnagar, Medchal Malkajgiri District - 500087
2. Mrs. Shaik Saleema W/o. Shaik Alauddin, Aged about 55 years, Occ: Housewife R/o. Plot No. 88, Santosh Nagar, Balaji Nagar, Shameerpet, Jawaharnagar, Medchal Malkajgiri District - 500087 ..... Defendants

Please take the summons in the above O.A. No. 809/2023 filed by the applicant for recovery of money of Rs.24,14,972.33/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "SAAKSHI" daily newspaper and posted the matter to 01/04/2024.

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under: (i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on 01/04/2024 at 10.30 a.m. at Debts Recovery Tribunal - II, 1st floor, Triveni complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this the day 16th of February, 2024.

(By order of the Court)
Sd/- Signature of the Officer
Authorised to issue Summons

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-II
At: Triveni Complex, 1st Floor, Abids, Hyderabad

O.A. No. 806 of 2023

Between:
M/s. YES Bank Ltd ...Applicant
And
M/s. Subbaraja Tirumala & Ors ....Defendants

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
1. M/s. Subbaraja Tirumala, Rep. by its Proprietor Mr. Subbaraja Tirumala Office at # Plot No.37, 38 & 39, Srikrishna Enclave, Jawahar Nagar, Yapral, Medchal - 500087.
2. Mr. Subbaraja Tirumala S/o. Not known Aged Major, Occ : Proprietor of M/s. Subbaraja Tirumala, Office at # Plot No.37, 38 & 39, Srikrishna Enclave, Jawahar Nagar, Yapral, Medchal - 500087.
3. Mrs. Hemalatha Tirumala W/o. Subbaraja Tirumala, Aged about 48 years, Occ: Housewife R/o. Flat No.101, 1st Floor, Shree Home, Shristi Apts, Yapral, Hyderabad - 500087. ...Defendants

Please take the summons in the above O.A. No. 806/2023 filed by the applicant for recovery of money of Rs.36,51,085.83/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "SAAKSHI" daily newspaper and posted the matter to 01/04/2024.

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under: (i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on 01/04/2024 at 10.30 a.m. at Debts Recovery Tribunal - II, 1st floor, Triveni complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this the day 16th of February, 2024.

(By order of the Court)
Sd/- Signature of the Officer
Authorised to issue Summons

కిడ్నీ స్వాప్ మార్పిడికి ప్రభుత్వం యోచన

తెలంగాణ జీవన్‌దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణలత



ఆపరేషన్ చేయించుకున్న రోగులతో జీవన్‌దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణలత, స్టార్ ఎండీ గోపీచంద్

లక్డీకాపూల్: కిడ్నీ స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కి ప్రభుత్వం సానుకూలంగా ఉందని పేర్కొంటూ 'డొనార్ పూల్' ఏర్పాటు చర్యలు చేపట్టనున్నట్టు తెలంగాణ జీవన్‌దాన్ కో ఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణలత తెలిపారు. ప్రభుత్వ సహకారంతో స్వాప్ దాతల సేకరణపై దృష్టి పెట్టనున్నట్టు పేర్కొన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని స్టార్ ఆస్పత్రిలో కిడ్నీ స్వాప్ మార్పిడి ఆపరేషన్లు విజయవంతంగా జరిగిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇందుకు జీవన్‌దాన్ తరహాలోనే కిడ్నీ పెయిర్డ్ డొనేషన్‌కు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ విధానం వల్ల కిడ్నీ మార్పిడికి రోగులు సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండదన్నారు. కిడ్నీ ఫెయిల్డ్ డొనేషన్‌తో ఇద్దరు రోగులకు ఒకే సమయంలో కిడ్నీ మార్పిడి అపరేషన్ చేయాల్సి ఉంటుందన్నారు. బ్లడ్ గ్రూప్ మ్యాచ్ కాకపోయినా కిడ్నీ ఇవ్వడానికి రోగి కుటుంబసభ్యులు ముందుకు వస్తేనే ఇది సాధ్యం అవుతుందన్నారు. దీని వల్ల కిడ్నీ మార్పిడి ఆపరేషన్ కోసం ఎదురు చూసే రోగుల సంఖ్య 40 శాతం వరకు తగ్గిపోతుందని చెప్పారు. స్టార్ గ్రూప్ ఎండీ డాక్టర్ గోపీచంద్ మన్నం మాట్లాడుతూ... మూత్రపిండాల మార్పిడిలో విప్లవాత్మక మార్పులకు స్టార్ ఆస్పత్రి శ్రీకారం చుట్టిందన్నారు. స్వాప్ పద్ధతిలో అనంతపురానికి చెందిన రఘునాథ్ రెడ్డి, సత్యసాయి జిల్లాకు చెందిన మహేశ్వర్ రెడ్డిలకు విజయవంతంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేశామన్నారు. స్టార్ హాస్పిటల్ నెఫ్రాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ గంధే శ్రీధర్, హెచ్‌ఓడి డాక్టర్ స్వప్న, డాక్టర్ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇకెబనా పూల కళాత్మక ప్రదర్శన



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న టగా మస యుకీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-8లోని సప్తపర్ణిలో పిల్లలు, యువతచే ఏర్పాటు చేసిన పర్యావరణ స్నేహపూర్వక ఇకెబనా పూల కళాత్మక ప్రదర్శన గురువారం ముగిసింది. నగరానికి చెందిన 30 మంది చిన్నారుల కళాత్మక ప్రతిభకు వేదికగా నిలిచిన ఈ ప్రదర్శనను ఒహారా స్కూల్ సబ్ గ్రాండ్ మాస్టర్ ఒహ్రియు రేఖారెడ్డి ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు ఈ ప్రదర్శనకు సంబంధించి చిన్నారులు ప్రాక్టీస్ వర్క్‌షాప్‌లో పాల్గొని పూల అమరికలో సరికొత్త అందాలను తీర్చిదిద్ది కళాత్మక ఆకృతులతో ఆకట్టుకున్నారు. ఫ్లిప్‌సైడ్ వర్క్ స్పేస్ నుంచి న్యూరో డైవర్జంట్‌తో బాధపడుతున్న యువతీయువకులు కూడా ఇందులో పాల్గొన్నారు. చిన్నారుల ప్రతిభను కొనియాడిన జపాన్ కాన్సుల్ జనరల్ టగా మస యుకీ వారందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వారి అద్భుత ప్రదర్శనకు ఫిదా అయ్యారు. ఇంత చక్కని కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

రేపు 24వ యూఎస్‌ఏ ఎడ్యుకేషన్ ఫెయిర్

బంజారాహిల్స్: అమెరికాలో ఉన్నత విద్యను చదవాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకోసం ఈ నెల 24వ తేదీన సోమాజిగూడలోని యూనిస్కోలర్స్ కార్యాలయంలో ఉచితంగా యూఎస్‌ఏ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు యూనిస్కోలర్స్ సౌత్ బిజినెస్ హెడ్ రాజ్ నున్న తెలిపారు. గురువారం సంస్థ కార్యాలయంలో ఎడ్యుకేషన్ ఫెయిర్ పోస్టర్‌ను రీజనల్ మేనేజర్ రాజేష్ వెలమర్తి, యూనీ క్రేడ్స్ రీజనల్ మేనేజర్ భవ్య బండలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అమెరికాలో చదువుకోవాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎన్నో సందేహాలు ఉంటాయని వాటిని నివృత్తి చేసేందుకే ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అమెరికా నుంచి 15కు పైగా యూనివర్సిటీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. వారితో నేరుగా మాట్లాడి అడ్మిషన్లు, వీసా ప్రాసెస్, ఏ కోర్సు చదవాలి, ఖర్చు ఎంతవస్తుంది, బ్యాంకర్లు కూడా ఫెయిర్‌లో పాల్గొంటారని వారితో స్కాలర్‌షిప్ ఎంతమేర పొందవచ్చు అనే సందేహాలు కూడా తెలుసుకోవచ్చునని తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫెయిర్ కొనసాగుతుందన్నారు. ఎలాంటి రుసుము చెల్లించకుండా ఈ సేవలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో గురుప్రీత్‌సింగ్, తేజస్విని పాల్గొన్నారు.

ప్రేమను నిరాకరించాడని మాస్టారును వేధించిన యువతి

- ఆయన ఫ్యామిలీ ఫొటోలు మార్ఫింగ్ చేసి వైరల్
- యువతిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

హిమాయత్‌నగర్: గ్రూప్-1 కోచింగ్ ఇచ్చే ఫ్యాకల్టీ ఉపాధ్యాయుడిని ప్రేమించింది ఓ యువతి. ఆయన తన ప్రేమను నిరాకరించాడనే కోపంతో వారి ఫ్యామిలీ ఫొటోలను మార్ఫింగ్ చేసి వాటిని వైరల్ చేసి పగ తీర్చుకోవాలనుకుంది. సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యింది ఆ యువతి. నగర సైబర్ క్రైమ్ పోలీసుల కథనం ప్రకారం... ఏపీలోని అనంతపురం జిల్లా రాయదుర్గానికి చెందిన ఓ యువతి(24) గ్రూప్-1కు కోచింగ్ కోసం నగరానికి వచ్చింది. అశోక్‌నగర్‌లోని ఓ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో జాయిన్ అయ్యింది. అయితే కోచింగ్ సెంటర్‌లోని ఓ ఫ్యాకల్టీ లెక్చరర్‌ను ప్రేమించింది. తనకు పెళ్లైందని ప్రేమను నిరాకరించాడు. దీంతో అతనిపై పగ పెంచుకొని ఆయన ఫ్యామిలీ ఫొటోలను తన 11 ఏళ్ల కూతురు ఫొటోలను ఇన్‌స్టాగామ్‌లో సేకరించి అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి న్యూడ్‌గా ఆ ఫొటోలు, వీడియోలను యూట్యూబ్, ఇన్‌స్టా, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో పోస్టు చేసింది. దీంతో అతను ఫిబ్రవరి 2న నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు, రాయదుర్గం లక్ష్మీబజార్‌లో ఉన్న ఆ యువతిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆమె నుంచి రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

6న స్వర్ణగిరి వెంకటేశ్వర స్వామి ప్రాణప్రతిష్ట



ఆలయ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: యాదాద్రి భువనగిరి జిల్లాలో 22 ఎకరాల్లో నిర్మించిన 'స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి' దేవాలయాన్ని మార్చి 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో ప్రారంభించనున్నట్లు మానేపల్లి ట్రస్ట్ చైర్మన్ మానేపల్లి రామారావు తెలిపారు. 6వ తేదీన ఉదయం 11.6 గంటలకు స్వామివారి ప్రాణప్రతిష్ఠ తదుపరి శ్రీవారి శాంతి కల్యాణం నిర్వహించి ప్రజల దర్శనార్థం సమాజానికి అంకితం చేస్తారన్నారు. గురువారం పంజగుట్టలోని మానేపల్లి ట్రస్ట్ కార్యాలయంలో స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ కేలండర్ ఆవిష్కరణ, దేవాలయం ప్రాణప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను శిల్పి డి.ఎన్.వి.ప్రసాద్, మానేపల్లి మురళీకృష్ణ, మానేపల్లి గోపీకృష్ణలతో కలిసి ఆవిష్కరించారు. భువనగిరి ఎల్లమ్మ ఆలయం ఎదురుగానే స్వర్ణగిరి దేవాలయం ఉంటుందన్నారు.

వేర్వేరు ప్రదేశాల్లో ఇద్దరి అదృశ్యం

వెంగళరావునగర్: కల్లు దుకాణానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... నేమూరి బాల్‌రాజ్ గాజుల రామారంలోని తన కుమారుడు, కోడలు వద్ద నివాసం ఉంటున్నాడు. యూసుఫ్‌గూడలోని కల్లు దుకాణంలో పనిచేస్తాడు. ఈ నెల 20న యూసుఫ్‌గూడకు వెళ్లిన ఆయన ఇంటికి రాలేదు. దాంతో బాల్‌రాజు కోడలు నేమూరి స్వాతి ఈ నెల 21న కల్లు దుకాణానికి వచ్చి విచారించింది. బాల్‌రాజు 20న కల్లు దుకాణానికి వచ్చి వెళ్లిపోయాడని నిర్వాహకులు ఆమెకు తెలిపారు. శుక్రవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉద్యోగం కోసం వెళ్లిన వ్యక్తి...



పాండురంగయ్య

ఖైరతాబాద్: ఉద్యోగం కోసం వెళ్తున్నానంటూ ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీలో మల్లెపోగు సునీత, పాండురంగయ్య దంపతులు ఉంటున్నారు. పాండురంగయ్య క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేశాడు. అది సరిగ్గా నడవకపోవడంతో మూసివేసి ఏడాదిగా ఖాళీగానే ఉంటున్నాడు. దీంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ నెల 19న ఉద్యోగం కోసం వెళ్తున్నానంటూ చెప్పి బయటకు వెళ్లాడు. ఆ తరువాత భార్య ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇంట్లో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

క్లీన్ ఖైరతాబాద్‌కు సహకరించండి

- స్వచ్ఛ ఆటోల్లోనే చెత్త వేయాలి
- బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా తథ్యం
- భవన నిర్మాణ సామగ్రి ఇష్టానుసారంగా డంప్ చేస్తే చర్యలు
- జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ డీసీ జగన్



ఎస్‌ఎఫ్‌ఏ, జవాన్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ డీసీ జగన్, ఏఎంహెచ్‌ఓ ప్రవీణ

బంజారాహిల్స్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం ద్వారా అపరిశుభ్ర వాతావరణం నెలకొనడమే కాకుండా అనారోగ్యాలకు దారి తీస్తుందని, ప్రతి పౌరుడు విధిగా తమ ఇంట్లో ఉన్న చెత్తను రోజూ ఇంటి వద్దకే వచ్చే స్వచ్ఛ ఆటోకు అందించాలని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17 డిప్యూటీ కమిషనర్ జగన్ సూచించారు. సర్కిల్ పరిధిలోని 39 మంది శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎస్‌ఎఫ్‌ఏ), 10 మంది జవాన్లు, రాంకీ వెహికల్ సిబ్బంది, మిక్‌లిన్ సిబ్బంది, సర్కిల్ ఏఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణతో కలిసి గురువారం ఆయన తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్లీన్ హైదరాబాద్, క్లీన్ ఖైరతాబాద్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఎస్‌ఎఫ్‌ఏ, జవాన్ చెత్తను సేకరించడం, తరలించడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కోరారు. ఈ విషయంలో ఏమాత్రం అలసత్వం వహించిన ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కొంతమంది బైక్‌లపై, నడుచుకుంటూ వెళ్తూ రోడ్డుపక్కన ఖాళీ జాగాల్లో చెత్తను పడేస్తూ వెళ్తుంటారని, అలాంటి వారిని గుర్తించి అవగాహన కలిగించి ఇంకోసారి అలా వేయకుండా జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా తమ ఇంటి వద్దకే వచ్చే స్వచ్ఛ ఆటోకు చెత్త వేసేలా ప్రోత్సహించాలన్నారు.

- రోజూ తెల్లవారుజామునే రాంకీ వాహనాలు చెత్తను తీసుకువెళ్లే విషయంలో ఎస్‌ఎఫ్‌ఏలు దృష్టిపెట్టాలని సూచించారు.
- భవన నిర్మాణ వ్యర్థాలను లారీల ద్వారా తీసుకువచ్చి ఇష్టానుసారంగా రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో, పార్కుల్లో డంప్ చేయిస్తున్నారని, వారిని గుర్తించి అవగాహన కల్పించడమే కాకుండా జరిమానా విధించాలన్నారు. రూ. 10 వేల నుంచి రూ. లక్ష వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో ఎస్‌ఎఫ్‌ఏలు బాధ్యతలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కూల్చివేసిన భవన నిర్మాణ వ్యర్థాలను తీసుకెళ్లేందుకు జీహెచ్‌ఎంసీ నుంచి వాహనాలు కూడా ఉంటాయనే విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు.
- టీ కొట్లు, మెస్‌లు, కూరగాయల వ్యాపారులు, హోటళ్లు, వాణిజ్య సముదాయాలు, పాన్‌షాపులు, కొబ్బరిబోండాలు, పూల దుకాణాలు, .. మాల్స్ ఇలా ప్రతిఒక్కరూ తమ ఎస్టాబ్లిష్ ముందు చెత్తను వేసే డబ్బాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇలా ఏర్పాటు చేసుకునే విధంగా ఎస్‌ఎఫ్‌ఏ, జవాన్లు చిరు వ్యాపారులతో పాటు పెద్ద వ్యాపారులకు కూడా అవగాహన కలిగించాలన్నారు.
- ఒకవేళ చెత్తా చెదారాన్ని చెత్త డబ్బాల్లో కాకుండా బయట పడేస్తే వారికి రూ. 500ల నుంచి అంతకు పైమొత్తంలో జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. ఈ విషయంలో కూడా వ్యాపారులకు అవగాహన కలిగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.
- పతి పౌరుడూ తనవంతు బాధ్యతగా క్లీన్ ఖైరతాబాద్- క్లీన్ హైదరాబాద్ కోసం భాగస్వామి అవడమే కాకుండా జీహెచ్‌ఎంసీకి సహకరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ ప్రదేశాల్లో తాము చెత్త వేయకుండా, మిగతావారు కూడా వేయకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

సీసీటీలో ఆకట్టుకుంటున్న హస్త కళాకృతులు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ (సీసీటీ) హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ తరాషా క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో విభిన్న రకాల హస్త కళాకృతులు ఆకర్షణీయంగా ఉన్నాయి. దేశంలోని వివిధ సంస్కృతుల సంగమంతో ఎన్నో కుటీర పరిశ్రమలుగా వెలుగొందిన విభిన్న హస్తకళల పూర్వవైభవానికి విశేష ఆదరణ పెరిగిన నేపథ్యంలో ఈ ప్రదర్శనలో వివిధ ప్రాంతాల హస్తకళాకృతులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. జ్యూట్‌తో తయారుచేసిన బ్యాగ్‌లు ప్రదర్శనలో హైలెట్‌గా నిలిచాయి. దేనికదే ప్రత్యేకతను సంతరించుకుంటూ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఆలయం, కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

రహమత్‌నగర్: క్వారీ స్థలంలో అమ్మవారి ఆలయం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 2000 గజాల మేర స్థలం కేటాయించాలని తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ సర్కిల్-19డీఎంసీకు గురువారం వినతి పత్రం సమర్పించారు.

నిమ్స్‌లో కేంద్ర ఎన్‌హెచ్‌ఏ బృందం పర్యటన

లక్డీకాపూల్ : నిజామ్ వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్)ను నేషనల్ హెల్త్ అథారిటీ(ఎన్‌హెచ్‌ఏ) బృందం సందర్శించింది. గురువారం తెలంగాణ ఆరోగ్య శ్రీ సీఈఓ ఎస్ఆర్ విశాలాక్షితో కలిసి కేంద్ర ప్రభుత్వ బృందం సభ్యులు ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఎన్‌హెచ్‌ఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దీప్తి గౌర్‌ముఖర్జీ, అడిషనల్ సీఈఓ డాక్టర్ బసంత్ గార్గ్ డయాలసిస్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న పలువురు రోగులతో మాట్లాడారు. అనంతరం నిమ్స్ బోర్డు రూమ్‌లో పాలకవర్గంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. నెఫ్రాలజీ విభాగంతో పాటు ఇతర అన్ని విభాగాల్లో ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు అందుతున్న సేవలను ఎన్‌హెచ్‌ఓ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డీన్ డాక్టర్ లిజ రాజశేఖర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ కేవీ.కృష్ణా రెడ్డి, డాక్టర్ లక్ష్మీ భాస్కర్, నెఫ్రాలజీ విభాగం అధిపతులు డాక్టర్ గంగాధర్, డాక్టర్ స్వర్ణలత, వివిధ శాఖాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ నుంచి వ్యక్తి పరార్

పంజగుట్ట: అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని స్థానికులు పోలీసులకు పట్టివ్వగా అతడు పోలీస్ స్టేషన్ నుంచి పరారైన ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఎర్రమంజిల్‌లో నిమ్స్ నూతన భవణాల నిర్మాణం జరుగుతున్న చోట గురువారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో అనుమానాస్పదంగా ఒక వ్యక్తి తిరుగుతున్నాడు. అతను నిర్మాణసామగ్రి చోరీ చేసేందుకొచ్చినట్లు అనుమానించి అక్కడి సెక్యురిటీ సిబ్బంది అతన్ని పట్టుకుని పంజగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా అతని పేరు టిల్లు అని తనకు ఎవరూలేరని ఫుత్‌పాట్‌పై పడుకుంటానని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం 5:50 గంటలప్రాంతంలో పోలీసులు ఏమరుపాటుగా ఉండటంతో స్టేషన్ రెండవ అంతస్తు క్రైమ్ విభాగం నుంచి మెల్లిగా దిగి పారిపోయాడు. నెలరోజుల వ్యవధిలోనే ఇద్దరు పోలీసుల కళ్లుకప్పి పారిపోవడం చర్చనీయాంశంగా మారింది. జనవరి 27వ తేదీన మహ్మద్ అమీర్ అలీ అనే వ్యక్తి జూమ్ కారులో కారును అద్దెకు తీసుకుని తిరిగి ఇవ్వకుండా తిరుగుతూ ఓనర్ కనిపించగానే తప్పించుకునేందుకు వేగంగా వచ్చి పలువురు వాహనదారులను ఢీకొట్లాడు. అతన్ని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించగా అదే రోజున గాంధీ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తీసుకెళ్లగా పోలీసుల కళ్లు కప్పి పారిపోయాడు. ఇప్పుడు టిల్లు ఏకంగా పోలీస్ స్టేషన్ నుంచే తప్పించుకుపోవడంతో ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

'డబుల్' ఇళ్లిప్పిస్తానని మోసం

: బీఆర్ఎస్ నేతపై మహిళల ఫిర్యాదు

రహమత్‌నగర్: డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని, తిరిగి చెల్లించమంటే బెదిరింపులకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకుడిపై బోరబండ పోలీస్ స్టేషన్‌లో బాధిత మహిళలు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్ కమలానగర్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్లను చెప్పి బోరబండ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ విజయసింహ పలువరు మహిళల వద్ద నుండి రూ. 4.5 లక్షలు వసూలు చే య డం జరిగిందని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మనిషినని తాను ఆయనతో చెప్పి ఇళ్లు ఇప్పిస్తానని బాధిత మహిళలను నమ్మించాడు. ఈ క్రమంలోనే గత మే నెలలో కమలానగర్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపు జరిగిన నేపథ్యంలో సదరు మహిళలు జయసింహను నిలదీయగా, అతను బెదిరింపులకు పాల్పడుతున్నాడని చెప్పారు. రూ. 2 లక్షలు తీసుకోవడమే కాకుండా తనకు శారీరకంగా వాడుకున్నాడని బాధిత మహిళ విలపించింది. కేసు నమోదు చేసిన దర్యాప్తు ప్రారంభించారు.

చిన్న ఫార్మా కంపెనీలపై అధికారుల వేధింపులు సరికాదు

పంజగుట్ట: చిన్న ఫార్మా కంపెనీలపై ప్రభుత్వ అధికారుల దాడులు, వారిని ఇబ్బందులకు గురిచేడం సరికాదని జైభీమ్ యూత్ ఇండియా, తెలంగాణ పర్యావరణ పరిరక్షణ మండలి అధ్యక్షుడు సింధన్ కోరారు. తప్పు చేసిన ఫార్మా సంస్థలపై తప్పక చర్యలు తీసుకోవాలని కానీ అనవసరంగా చిన్న సంస్థలను ఇబ్బందులకు గురిచేసి వాటిని మూయించే ప్రయత్నం చేస్తే పెద్దపెద్ద సంస్థలు వారు నిర్ణయించిన రేటుకు మందులు దొరకక పేదలు ఇబ్బందులు పడతారన్నారు. అదే సమయంలో నిరుద్యోగులు కూడా పెరుగుతారని వారు అభిప్రాయపడ్డారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బహుజన స్టూడెంట్ పెడరేషన్ అధ్యక్షుడు వేల్పుల సంజయ్, శ్రీహరిలతో కలిసి మాట్లాడుతూ... ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం ఫార్మా హబ్‌గా కొనసాగుతుందని ఇలాంటి దాడులవల్ల తెలంగాణ ప్రతిష్ట పాడయ్యే అవకాశం ఉందన్నారు. చిన్న ఫార్మా సంస్థలు ఉండడంవల్లే మందులు వేసుకోగలుగుతున్నామన్నారు. కేవలం పెద్ద సంస్థలే ఉంటే సామాన్యుడు మందులు కొనుక్కొలేని పరిస్థితి ఉంటుందన్నారు. సమావేశంలో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికను ప్రేమిస్తున్నానని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు



నిందితుడు శ్రీనివాస్

బంజారాహిల్స్: పదో తరగతి చదువుతున్న బాలిక వెంటపడుతూ నిన్ను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని వేధిస్తున్న ఓ యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యూసుఫ్‌గూడ కృష్ణానగర్‌కు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి గత కొంతకాలంగా స్థానికంగా పదో తరగతి చదివే బాలిక వెంటపడుతూ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని వేధిస్తున్నాడు. బాధితురాలి కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు శ్రీనివాస్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగు చోరీ

బంజారాహిల్స్: బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగు చోరీకి గురైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జూబ్లీహిల్స్ నందగిరి హిల్స్‌లో నివాసముండే సతీష్, సి.హెచ్.పద్మావతి దంపతులు ఈ నెల 14న బంధువుల వివాహం ఉండటంతో గుంటూరుకు బయలు దేరారు. ఈ సమయంలో 26 గ్రాముల నక్లెస్, 56 గ్రాముల బ్లాక్ బీడ్స్, నాలుగు గ్రాముల విలువ చేసే రెండు బంగారు ఉంగరాలు, మూడు గ్రాముల వజ్రాలు పొదిగిన కమ్మలు, 32 గ్రాముల బంగారు గాజులు ఇతర అభరణాలను ఓ బ్యాగులో పెట్టుకొని వెళ్లారు. ఈ నెల 17న బస్సులో నగరానికి చేరుకున్నారు. అమీర్‌పే సారథి స్టూడియో వద్ద బస్సు దిగాక అభరణాలు ఉన్న బ్యాగు కనిపించలేదు. వెంటనే ఆటోలో నందగిరిహిల్స్ చేరుకొని ఇంట్లో వెతికారు. కనిపించకపోవడంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్ ఆర్డీఓగా దశరథ్‌సింగ్

బంజారాహిల్స్: సికింద్రాబాద్ ఆర్డీఓగా నియమితులైన దశరథ్ సింగ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఆర్డీఓగా పనిచేసిన ఆయనను సికింద్రాబాద్ ఆర్డీఓగా బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ ఆర్డీఓగా పనిచేసిన రవి ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన దశరథ్‌సింగ్‌కు సికింద్రాబాద్, అమీర్‌పేట, మారేడ్‌పల్లి, తిరుమలగిరి, ఖైరతాబాద్, ముషీరాబాద్, షేక్‌పేట తహసీల్దార్లు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సికింద్రాబాద్ ఆర్డీఓ పరిధి కిందకు ఏడు మండలాలు వస్తాయి.

మౌలానా ఆజాద్‌కు నివాళి

లిబర్టీ: దేశం కోసం పాటుపడిన మహనీయులను త్యాగధనులను యోధులను స్ఫూర్తిగా తీసుకోవాలని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరి వెంకటరాజేశ్వరరావు అన్నారు. స్వాతంత్ర సమరంలో ప్రధాన భూమిక పోషించి దేశం కోసం ఆత్మ బలిదానం చేసిన యోధుల వారసత్వాన్ని యువతరం తీసుకొని దేశ అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. తొలి విద్యాశాఖ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతి సభను గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ... స్వాతంత్ర ఉద్యమంలో మహాత్మాగాంధీ, నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి వారితో ఆజాద్ పని చేసి స్వాతంత్ర సంగ్రామంలో ముందు వరుసలో ఉన్నారన్నారు. స్వాతంత్రం సిద్ధించిన తర్వాత దేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలందించారని గుర్తుచేశారు. నేతలు పి.వి.శ్రీనివాసరావు, పి.వి.సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

పంజగుట్ట: ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలను పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు కామన్ గురుకులాల అంశాన్ని తీసుకురావడం సరికాదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇప్పుడిప్పుడే ప్రాథమిక విద్యను పూర్తిచేసుకుని ఉన్నతవర్గాల ప్రజలతో కొంతమేర పోటీ పడుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విద్యార్థులను తిరిగి కామన్ గురుకులం అనే పేరుతో అణచివేసేందుకు యత్నిస్తున్నారని అన్నారు. సమావేశంలో ఎమ్.శంకర్, ప్రసాద్, సుధాకర్, స్వామి, శివకుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాలను కలిగి ఉండాలి



రహమత్‌నగర్: గ్యార్వీ షరీఫ్ మాసంలో ముస్లింలు విరివిగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబాఫసీయుద్దీన్ అన్నారు. భరత్‌నగర్‌లోని యువకులు గురువారం ఏర్పాటు చేసిన గ్యార్వీ షరీఫ్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబా మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని సూచించారు. నాయకులు కాసుల మహేష్‌గౌడ్, బండారి అశోక్, ఇమ్రాన్, భరత్‌నగర్ బస్తీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా ఎన్‌సీసీ 11కేవీ ఫీడర్ మాదాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఎన్‌సీసీ బిల్డింగ్స్ ఏరియా, నెక్టార్ గార్డెన్ ఏరియా, రత్నదీప్ సూపర్‌మార్కెట్ ఏరియాల్లో విద్యుత్ ఉండదన్నారు.

బాలికపై సోదరుడి లైంగిక దాడి

బంజారాహిల్స్: అభం శుభం తెలియని చిన్నారిపై సొంత పెద్ద నాన్న కుమారుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఫిలింనగర్ పోలీసు స్టేషన్పరిధిలో ఉండే ఓ బాలిక(6) స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలలో ఫస్ట్ క్లాస్ చదువుతోంది. బాలిక తల్లి అనారోగ్యం బారిన పడటంతో శస్త్రచికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరింది. బాలిక అదే బస్తీలో నివాసముండే పెద్దనాన్న ఇంట్లో ఉంటుంది. ఈ నెల 17న బాలిక ఆడుకుంటుండగా పెద్దనాన్న కుమారుడు(20) చాక్లెట్ ఇప్పిసానని పిలిచాడు. బాలికను గదిలోకి తీసుకువెళ్లి లైంగిక దాడి చేశాడు. ఈ విషయం ఎవరి చెప్పవద్దని బెదిరించాడు. ఈ నెల 20న బాలిక తల్లి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చింది. బాలిక తనకు కడుపులో తీవ్ర మైన నొప్పి వస్తుందని చెప్పింది. దీంతో అనుమానం వచ్చిన తల్లి ప్రశ్నించగా బాలిక జరిగింది చెప్పింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాబాకు అనాస రసంతో అభిషేకం

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12 లోని విశ్వ సాయి మందిరంలో కొలువు దీరిన సాయిబాబాకు గురువారం అనాస రసం తో అభిషేకం నిర్వహించారు. రంగు రంగుల పూల మాలలతో బాబాను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకున్నారు.


గద్దెల ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు


కుటుంబసభ్యులకు పుణ్యస్నానం చేయిస్తున్న భక్తురాలు


అమ్మవార్ల సన్నిధిలో సెల్ఫీ తీస్తున్న యువతి


ఎదురు యాటతో భక్తుడు..


కోడితో మొక్కు చెల్లిస్తున్న మహిళ


పూనకంతో ఊగిపోతున్న భక్తురాలు

జనసంద్రమైన మేడారం జంపన్నవాగు పరిసరాలు (ఏరియల్ వ్యూ)



గుట్ట దిగి.. గుండెల్లో కొలువై

వెన్నెలమ్మ దీపమై వెలిగింది. చల్లని గాలి ఈలలు వేసింది. జంపన్న వాగు జలకాలాడింది. చిలకలగుట్ట చిందులు వేసింది. చెట్టూ.. చేమ.. పుట్ట.. పురుగు పరవశం చెందింది. ప్రకృతి మాత గద్దెకు పయనమైంది. గాల్లోకి వదిలిన తూటా.. సల్లని తల్లికి స్వాగతం పలికింది. దారెంటా మొలిచిన ముగ్గులు.. తల్లి పాదాలకు రంగులద్దాయి. అమ్మ నిండిన గుండె పూనకాలేసింది. కోయదొరల డోలు వాయిద్యం.. కొత్త ఉత్సాహాన్నిచ్చింది.. భక్తి నిండిన మనసు తన్మయత్వం చెందింది.

గద్దెకు చేరిన సమ్మక్క..

- చిలకలగుట్ట నుంచి ఎదురేగిన భక్తులు
- దారి పొడవునా నీరాజనం
- ఒడి బియ్యం, యాట బలులు, ఎదురుకోళ్లు..
- ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు.. శివసత్తుల పూనకాలు
- గాల్లో కాల్పులతో సమ్మక్కకు స్వాగతం పలికిన ఎస్పీ
- మొక్కులు చెల్లించేందుకు బారులుదీరిన భక్తులు
- నేడు మేడారానికి సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

మేడారం నుంచి సాక్షిప్రతినిధి, వరంగల్

మేడారం వనాలు సమ్మక్క నామస్మరణతో మార్మోగాయి. అడవంతా భక్తజనంతో నిండిపోయింది. ఆదివాసీ జాతరలో అతి ముఖ్యమైన ఘట్టం ఆవిష్కృతమైంది. సమ్మక్క గుట్ట దిగి వచ్చింది. ఈఘట్టాన్ని కనులారా వీక్షించేందుకు లక్షలాది మంది చిలకలగుట్ట వద్దకు తరలివచ్చారు. అక్కడి నుంచి మేడారం వరకు కిలోమీటరున్నర దారి జనంతో నిండిపోయింది. గురువారం సాయంత్రం 6.21 గంటలకు ఎస్పీ డా.పి.శబరీశ్ ఏకే–47తో గాల్లోకి కాల్పులు జరిపి సమ్మక్కకు స్వాగతం పలికారు. అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న చిలకలగుట్ట జై సమ్మక్క నినాదాలతో దద్దరిల్లిపోయింది. పోలీసు అధికారుల గౌరవ వందనాలు, సంప్రదాయ ఎదురుకోళ్ల ఘట్టంతో భక్తులు సమ్మక్క స్వాగతం పలికారు.

పూజ రహస్యం.. నిరీక్షణ ఆద్యంతం

వెదురుబుట్టలో ఉంచిన పసుపుకుంకుమ భరిణె చుట్టూ ఎర్రగుడ్డ కప్పి గద్దెపైకి తీసుకెళ్లే క్రమంలో భక్తులకేమీ కనిపించకపోయినా.. ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే ఆసక్తితో అనుసరించారు. పూజా విధానం రహస్యంగా జరిగింది.


అమ్మవారి రాక సందర్భంగా కేరింతలు కొడుతున్న భక్తజనం


తల్లి రాకను చెట్టెక్కి వీక్షిస్తున్న భక్తులు

కాగా గద్దెల వద్దకు చేరుకునే దారిలో తల్లికి ఎదురేగిన భక్తులు ఎదురు కోళ్లతో స్వాగతం పలికారు. కోళ్లను అక్కడికక్కడే బలి ఇచ్చారు. మొదట పాము పుట్ట వద్ద, ఆ తర్వాత సమ్మక్క గుడి వద్ద పూజలు జరిపారు. మాఘశుద్ధ ఘడియలు మొదలు కాగా.. లాంఛనంగా జాతర ప్రారంభమైనట్లేనని పూజారులు తమ సంప్రదాయంతో అమ్మవారిని గద్దెపైకి చేర్చారు.

కొలువుదీరిన వనదేవతలు

మేడారంలో మాఘ పౌర్ణమి వెలుగుల్లో కొలువుదీరిన అమ్మల గద్దెల వద్దకు వచ్చే అశేష జన సందోహంతో జాతర ప్రాంగణమంతా కిటకిటలాడింది. తల్లుల దర్శనానికి తెలంగాణతో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి గిరిజనులు, గిరిజనేతరులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గురువారం రాత్రి నుంచే దర్శనానికి క్యూ కట్టారు. శుక్రవారం రాత్రి వరకు కిక్కిరిసిన జనంతో మేడారం జనసంద్రం కానుంది.

మేడారానికి నేడు గవర్నర్, సీఎం

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం వేర్వేరుగా మేడారం రానున్నారు. ఉదయం 10 గంటలకు గవర్నర్, మధ్యాహ్నం 12 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర మంత్రులు రానున్నారని జిల్లా పౌర సంబంధాల శాఖ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

ఉద్విగ్న క్షణాలు


సమ్మక్కను తీసుకువస్తున్న పూజారి వెంట వస్తున్న భక్తులు

మేడారం జాతరలో రెండోరోజైన గురువారం ఉదయమే సమ్మక్క పూజారులు వనదేవత గుట్టకు వెళ్లి వెదురు కర్రలు తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. సమ్మక్క పూజారులు ఐదుగురు.. సిద్ధబోయిన మునీందర్, కొక్కెర క్రిష్ణయ్య, చందా బాబూరావు, సిద్దబోయిన మహేశ్, సిద్ధబోయిన నితిన్ ప్రతిష్ఠించిన అనంతరం వరుస సంఖ్యలో రోప్ పార్టీ పోలీసుల భద్రత మధ్య పూజారులు సమ్మక్క ఆలయానికి చేరుకున్నారు. చిలకలగుట్టపై నార చెట్టుకింద ఉన్న కుంకుమ భరిణె రూపంలోని సమ్మక్కను తెచ్చేందుకు పూజారులు బయల్దేరారు. ఈసమయంలో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. సమ్మక్క రాక కోసం ఎదురు చూస్తున్న లక్షలాది మంది చిలకలగుట్టకు చేరుకున్నారు. వరాలతల్లిని కనులారా చూడాలని తపించిపోయారు. ప్రధాన పూజారితో పాటు ఐదుగురు గుట్టపైకి వెళ్లి రహస్యంగా పూజలు జరిపారు. ఆతర్వాత గుట్టపై నుంచి కుంకుమ భరిణె రూపంలోని అమ్మవారితో దిగివచ్చిన పూజారిని తోటి పూజారులు అనుసరించారు.


గాలిలోకి కాల్పులు జరుపుతున్న ఎస్పీ


కొలువుదీరిన వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

ఆకాశమార్గాన అమ్మవార్ల దర్శనానికి..

మేడారం(కాళేశ్వరం/కాజీపేట రూరల్): పచ్చని వనాన్ని.. ఇసుకేస్తే రాలని జనాన్ని ఆకాశంలో విహరిస్తూ చూడాలనుందా? మేఘాల మధ్య నుంచి ప్రయాణం చేస్తూ.. మేడారానికి వెళ్లాలనుందా? అయితే ఇంకెందుకాలస్యం.. మేడారం మహాజాతరకు వెళ్లేందుకు కాజీపేట నుంచి గురువారం హెలికాప్టర్ సేవలు ప్రారంభమయ్యాయి. బెంగళూరుకు చెందిన తుంబి ఏవియేషన్ ప్రైవేట్ లిమిడెట్ సంస్థ 25వ తేదీ వరకు ఈసర్వీసుల్ని నడుపుతోంది. ప్రతీ రోజు కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ మైదానం నుంచి ఉదయం 8, 10:30, మధ్యాహ్నం 1:30, 3:30 గంటలకు సర్వీస్‌లు అందుబాటులో ఉంటాయి. కాజీపేట నుంచి మేడారం జాతరకు అప్ అండ్ డౌన్, దర్శనానికి కలిపి టికెట్ ధర రూ.29,000 అని ఏవియేషన్ టికెట్ నిర్వాహకుడు అభిషేక్ పాండే తెలిపారు. ఆరుగురు ప్రయాణికుల కెపాసిటీ కలిగిన ఈహెలికాప్టర్, అప్ అండ్ డౌన్ సమయం 45 నిమిషాలు పడుతుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా టికెట్ పొందవచ్చు. కాగా.. మేడారంలోనూ ఈహెలికాప్టర్ చక్కర్లు కొడుతోంది. ఒక్కో భక్తుడు రూ.4300 చెల్లించి ఏరియల్ వ్యూకు వెళ్లొచ్చు.


కాజీపేట నుంచి హెలికాప్టర్‌లో మేడారానికి వెళ్తున్న భక్తులు



మేడారంలోనే ట్రైబల్ వర్సిటీ

- ఇప్పటికే 337 ఎకరాల భూసేకరణ
- ఈఏడాది నుంచే ప్రవేశాలు
- రేపు మేడారానికి కేంద్ర మంత్రి అర్జున్ ముండా రాక
- కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

మేడారం(వరంగల్) : అమ్మవార్ల పేరిట అంతర్జాతీయ స్థాయిలో మేడారంలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సమ్మక్క–సారలమ్మ దర్శనానికి గురువారం ఆయన మేడారానికి వచ్చారు. హెలిపాడ్ నుంచి నేరుగా గద్దెల ప్రాంగణానికి చేరుకుని తల్లులను దర్శించుకున్నారు. అనంతరం నిలువెత్తు బంగారాన్ని సమర్పించుకుని, మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మీడియా పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు లేకుండా పాడి పంటలతో దేశం సుభిక్షంగా ఉండాలని తల్లులను కోరుకున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. మేడారం జాతరకు కేంద్రం రూ.3.14 కోట్లు అందించిందన్నారు. రూ.900 కోట్లతో సమ్మక్క–సారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈమేరకు తాత్కాలిక సిబ్బందిని నియమిస్తామని చెప్పారు.

స్థానిక బిడ్డలకే ప్రాధాన్యం

జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ)లో తాత్కాలిక భవనం ఏర్పాటు చేసి ఈ ఏడాది నుంచే ప్రవేశాలు కల్పిస్తామన్నారు. అందులో స్థానిక గిరిజన బిడ్డలకే అత్యధిక సీట్లు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు. నూతన యూనివర్సిటీ అయినందున సలహాదారుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో యూనివర్సిటీ నిర్మాణ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం శాశ్వత భవన నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు చెప్పారు. ఈమేరకు భవన నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్మాణ పనుల కోసం ఇప్పటికే ఏజెన్సీలను గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 337 ఎకరాల భూమిని కలెక్టర్ సేకరించారని, మరింత భూమి సేకరించాల్సి ఉందన్నారు. శుక్రవారం కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా మేడారం రానున్నట్లు తెలిపారు.


సారలమ్మకు మొక్కుతున్న కిషన్‌రెడ్డి

జాతీయ హోదా కల్పించాలి..

మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలని రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన.. ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్



ప్యాచ్‌వర్క్ ఆర్ట్

యంగ్ లుక్ రావాలంటే డ్రెస్సింగ్‌లో ఏమైనా మార్పులు చేయాలనుకునేవారు సింపుల్‌గా ప్యాచ్‌వర్క్ డిజైన్‌ని ఎంచుకుంటే చాలు. క్యాజువల్ నుంచి పార్టీవేర్ వరకు ప్రత్యేకంగా అనిపించే ఈ డ్రెస్ డిజైన్స్ ఫ్యాషన్ వేదికలపైనా కొత్తగా తళుక్కుముంటున్నాయి. రాబోయే వేసవి సీజన్‌కి కంఫర్ట్‌గా కలర్‌ఫుల్‌గా అనిపించేలా ప్యాచ్‌వర్క్‌ని అన్ని రకాల మెటీరియల్‌తోనూ డిజైన్‌వేర్‌గా మార్చేయడం డిజైనర్ల క్రియేటివిటీకి అద్దం పడుతుంది. మోడర్న్ ఆర్ట్‌లో తనదైన కొత్తదనం చూపుతుంది.











హ్యాండ్ ఎంబ్రాయిడరీ

మన దేశంలో ముఖ్యంగా గుజరాతీ, రాజస్థానీ హ్యాండ్ ఎంబ్రాయిడరీ చేసి డ్రెస్సులకు, దుపట్టాలకు ప్యాచ్‌వర్క్‌గా ఉపయోగించడం చూస్తుంటాం. అవి ఖరీదు కూడా ఉంటాయి. సింపుల్‌గా ఉంటూనే స్టైలిష్ లుక్‌తో మెరిపించడానికి ఈ డిజైన్ సాధారణ డ్రెస్సులకూ విస్తరిస్తుంది. మల్టీకలర్ కాంబినేషన్‌లో ఎంచుకున్న మెటీరియల్‌తో కుర్తాలు, టాప్స్, ఇండో–వెస్టర్న్ డ్రెస్సులకు కొత్తదనం తీసుకువస్తున్నారు డిజైనర్లు.

అతుక్కుపోవాల్సిందే!

వివిధ రంగుల్లో ఉన్న మెటీరియల్‌ను కావల్సిన పద్ధతుల్లో కట్ చేసి, అతుకులతో కొత్త డిజైన్‌ని సృష్టించడమే దీనిలోని టెక్నిక్. అతుకుల డిజైన్‌కి ఎవరి చూపులైనా అతుక్కుపోవాల్సిందే అన్నట్టుగా యువతరాన్ని ఆకట్టుకుంటున్నాయి ప్యాచ్‌వర్క్ డ్రెస్సులు.

లైట్ షేడ్స్

లేత రంగుల కాటన్ మెటీరియల్‌తో ఎంచుకున్న మల్టీకలర్ ప్యాచ్ వర్క్ ఫ్రాక్‌లు, టాప్స్, కుర్తీలు మధ్యవయసువారిని కూడా యంగ్‌లుక్‌తో అట్రాక్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్నాయి.

డెనిమ్ స్టైల్

ఏ సీజన్‌కైనా డెనిమ్ వాడకం ఇటీవల బాగా పెరిగిపోయింది. పలచటి డెనిమ్ కూడా మార్కెట్లో అందుబాటులోకి వచ్చింది. కాలానుగుణంగా ఈ మెటీరియల్‌తోనూ వివిధ షేపుల్లో ప్యాచ్ వర్క్ డిజైన్‌తో ఆకట్టుకుంటున్నాయి.

వంటిల్లు

వేసవికి స్వాగతం

ఆరోగ్యం కోసం...
ఒక పూట చపాతీ తినడం అలవాటు చేసుకున్నాం.
కాలం మారింది... చలిపోయి వేడి పెరుగుతోంది.
ఇప్పుడు చపాతీ తింటే మరీ వేడి చేస్తుందో ఏమో!
మరి... రెండుసార్లు అన్నం తింటే షుగర్ పెరిగిపోతుంది.
ఏం చేద్దాం మరి... ప్రకృతి ఎండలతోపాటు
వేడి తగ్గించే కూరగాయలనూ ఇచ్చింది.
సొరకాయతో చపాతీ చేద్దాం...
పాలు పోసి కూర చేద్దాం. ఖీర్‌ని ఆస్వాదిద్దాం...
వెయిట్‌లాస్ జ్యూస్ కూడ.
సొరకాయలు కోసినట్లు
కోతలు కోయట్లేదు.
ఇవి నిజంగా హెల్దీ రెసిపీలే...
ట్రై చేయండి.

సొరకాయ చపాతీ



కావలసినవి: సొరకాయ తురుము – రెండు కప్పులు; పచ్చిమిర్చి తరుగు – టీ స్పూన్ ; గోధుమపిండి – రెండున్నర కప్పులు ; గరం మసాలా – అర టీ స్పూన్ ; ఉప్పు – చిటికెడు ; ఇంగువ– చిటికెడు ; నూనె – రెండు టేబుల్ స్పూన్‌లు. **తయారీ:** ● వెడల్పుగా ఉన్న పాత్రలో గోధుమపిండి, సొరకాయ తురుము, తరిగిన పచ్చిమిర్చి, గరం మసాలా పొడి, ఉప్పు, ఇంగువ వేసి కలపాలి. మొదట తేమ సరిపోదనిపించినప్పటికీ సొరకాయలో నీరు వదిలేకొద్దీ సరిపోతుంది. పది నిమిషాల సేపు పక్కన ఉంచితే నీరు బయటకు వస్తుంది. నీరు వదిలిన తర్వాత పిండిని కలిపి చూసుకుని అప్పటికీ పొడిగా అనిపిస్తే కొద్దిగా నీటిని చిలకరించుకుని మిశ్రమం మొత్తాన్ని చపాతీ పిండిలా చేసుకుని వస్త్రాన్ని కప్పి పావు గంట సేపు పక్కన ఉంచాలి ● పిండిని పెద్ద నిమ్మకాయంత గోళీలు చేసుకుని చపాతీల్లా వత్తుకుని పెనం వేడి చేసి నూనె వేస్తూ చపాతీని రెండు వైపులా కాల్చాలి. **గమనిక:** చపాతీ వత్తేటప్పుడు పిండి జారుడుగా ఉన్నట్లనిపిస్తే పొడి పిండి చల్లుకుని బాగా కలిసే వరకు మర్దనా చేసి అప్పుడు చపాతీ చేసుకోవాలి. సొరకాయ చపాతీ సాధారణ గోధుమ పిండి చపాతీలా సమంగా ఒకే మందంలో రావడం కష్టం. మరీ పలుచగా కూడా వత్తకూడదు. కొంచెం మందంగానే ఉండాలి. వేడిగా తింటే మృదువుగా, రుచిగా ఉంటాయి. వేసవిలో చపాతీలు తింటే వేడి చేస్తుందని భయపడేవాళ్లు సొరకాయ చపాతీ ప్రయత్నించవచ్చు.

★★★

సొరకాయ పాలు కూర



కావలసినవి: సొరకాయ ముక్కలు – 3 కప్పులు ; ఉల్లిపాయ – 1 (తరగాలి) ; పచ్చిమిర్చి – 3 (చీరాలి) ; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; పాలు – కప్పు (కాచినవి) ; కరివేపాకు – 2 రెమ్మలు ; పసుపు – అర టీ స్పూన్ ; కొత్తిమీర తరుగు – ఒక టేబుల్ స్పూన్ ; ఎండు మిర్చి – 2 ; పచ్చి శనగపప్పు – 2 టీ స్పూన్‌లు ; మినప్పప్పు – టీ స్పూన్ ; ఆవాలు – అర టీ స్పూన్ ; వెల్లుల్లి – 2 రేకలు (తరగాలి) ; నూనె – టేబుల్ స్పూన్. **తయారీ:** ● స్టవ్ మీద బాణలి పెట్టి నూనె వేడి చేసి ఆవాలు వేయాలి. అవి వేగాక ఒకదాని తర్వాత ఒకటిగా ఎండుమిర్చి, మినప్పప్పు, శనగపప్పు, పచ్చిమిర్చి, కరివేపాకు వేయాలి. ఇప్పుడు ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేగిన తర్వాత సొరకాయ ముక్కలు వేయాలి. ఇవి వేడెక్కేటప్పుడు అందులో పసుపు, ఉప్పు వేసి కలిపి అందులో పావు కప్పు నీటిని పోసి పదిహేను నిమిషాల సేపు ఉడికించాలి. సొరకాయ ముక్కను నొక్కి చూసి ఉడికిన తర్వాత అందులో పాలు పోసి కలిపి, కొత్తిమీర, వెల్లుల్లి తరుగు చల్లి దించేయాలి. పాలు పోసిన తర్వాత ఎక్కువ సేపు మంట మీద ఉంచితే పాలు విరిగిపోతాయి. వెంటనే దించేస్తే గ్రేవీ రుచిగా ఉంటుంది. వెల్లుల్లిని ఇష్టపడని వాళ్లు మినహాయించుకోవచ్చు. ఈ కర్రీ అన్నం, చపాతీ, పూరీల్లోకి బాగుంటుంది.

★★★

లౌకీ కీ ఖీర్



కావలసినవి: సొరకాయ తురుము – 200 గ్రాములు ; నెయ్యి – టేబుల్ స్పూన్ ; వెన్న తీయని పాలు– రెండున్నర కప్పులు ; కుంకుమ పువ్వు – చిటికెడు ; చక్కెర – 5 టేబుల్ స్పూన్‌లు (రుచిని బట్టి మార్చుకోవచ్చు) ; యాలకుల పొడి– అర టీ స్పూన్ ; జీడిపప్పు – 20 పలుకులు, బాదం, పిస్తా – 20 పలుకులు. **తయారీ:** ● అరకప్పు పాలలో కుంకుమ పువ్వు వేసి పక్కన ఉంచాలి ● స్టవ్ మీద మందపాటి పాత్రను పెట్టి నెయ్యి వేడి చేసి అందులో జీడిపప్పు వేయించి తీసి పక్కన పెట్టాలి ● సొరకాయను కడిగి చెక్కు తీసి తురమాలి. స్టవ్ మీద జీడిపప్పు వేయించగా మిగిలిన నెయ్యిలో సొరకాయ తురుము వేసి చిన్న మంట మీద దోరగా వేయించాలి. తురుము కొంచెం మగ్గిన తర్వాత మంట మీడియంలో పెట్టి గరిటతో కలుపుతూ నాలుగైదు నిమిషాల సేపు వేయించాలి. సొరకాయ తురుము రంగు మారిన తర్వాత అందులో పాలు పోసి కలిపి ఉడికించాలి. పాలు చిక్కబడేటప్పుడు మంట తగ్గించి అడుగుకు అంటుకోకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. ఇలా నాలుగు నిమిషాల సేపు ఉడికిన తర్వాత కుంకుమ పువ్వు కలిపిన పాలను పోసి కలిపి పది నిమిషాల సేపు ఉడికించాలి. పాలు చిక్కబడి పరిమాణం తగ్గిన తర్వాత అందులో చక్కెర వేసి కలపాలి. చక్కెర కరిగిన తర్వాత మిశ్రమం కొంత జారుడుగా మారుతుంది. ఇప్పుడు యాలకుల పొడి, జీడిపప్పు వేసి కలిపి దించేయాలి. లౌకీ కీ ఖీర్ రెడీ. అంటే తెలుగులో సొరకాయ పాయసం. ఈ ఖీర్‌ని వేడివేడిగా సర్వ్ చేయవచ్చు. ఒక మోస్తరు వేడితోనూ తినవచ్చు. చల్లగా ఇష్టపడేవాళ్లు ఐదారు గంటల సేపు ఫ్రిజ్‌లో పెట్టుకుని తినవచ్చు.

గమనిక : ● పాయసం వేడి తగ్గేకొద్దీ చిక్కబడుతూ ఉంటుంది. కాబట్టి స్టవ్ మీద నుంచి దించేటప్పుడు పలుచగా ఉందనే ఆందోళన అక్కర లేదు. దగ్గరయ్యే వరకు ఉడికించే ప్రయత్నం చేయకూడదు ఇష్టమైన వాళ్లు ఇందులో గులాబీ రేకులు కూడా వేసుకోవచ్చు.

బాటిల్ గార్డ్ జ్యూస్



కావలసినవి: సొరకాయ ముక్కలు – కప్పు ; దాల్చిన చెక్క – అర టీ స్పూన్ ; నిమ్మరసం– టీ స్పూన్ ; బ్లాక్ సాల్ట్ – చిటికెడు పుదీనా – నాలుగు ఆకులు
తయారీ: ● సొరకాయను చెక్కు తీసి తరగాలి. ఆ ముక్కలను జ్యూస్ బ్లెండర్‌లో వేసి రసాన్ని గ్లాసులో పోసి అందులో దాల్చినచెక్క పొడి, నిమ్మ రసం, బ్లాక్‌సాల్ట్, పుదీనా కలిపి తాగాలి. ఈ జ్యూస్‌ని నాలుగు వారాలపాటు రోజూ ఒక గ్లాసు తాగితే బరువు తగ్గడంతోపాటు కొలెస్ట్రాల్, షుగర్ లెవెల్స్ కూడా తగ్గుతాయి.

పేరెంటింగ్

తిట్టడం సులభం ఫలితం అనూహ్యం

ఇంటికి రెండు గంటలు అలస్యంగా వచ్చిన టీనేజ్ కుమారుణ్ణి తల్లిదండ్రులు మందలిస్తే ఆ కుర్రవాడు ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన తాజా ఘటన ఇది. తల్లిదండ్రులు పిల్లల నడవడికను సరి చేయాలని ఆందోళన చెందడం మంచిదే కాని పిల్లల వయసును దృష్టిలో పెట్టుకుని వారి పొరపాట్లకు కారణాలను తెలుసుకోకుండా వారు చెప్పేది అర్థం చేసుకోకుండా తిడితే అసలుకే ప్రమాదం వస్తుంది. టీనేజ్ పిల్లలతో తల్లిదండ్రులు ఎలా వ్యవహరించాలి?



ఇంటర్ చదివే కుర్రాడు కాలేజ్ అయిపోయాక రెండు గంటల ఆలస్యంగా ఇంటికొచ్చాడు.

తల్లిదండ్రుల ఆలోచన: వీడు టైమ్ వేస్ట్ చేస్తున్నాడు. ఏ పనికిమాలిన బ్యాచ్‌తోనో తిరుగుతున్నాడు. ఏదో సినిమాకు వెళ్లి ఉంటాడు. ఇలా అయితే వీడు ర్యాంక్ తెచ్చుకున్నట్టే. వీడు ఎన్నిసార్లు చెప్పినా మారడం లేదు. ఇవాళ వీడికి బాగా పడాలి.

కుర్రాడి ఆలోచనలు: ఉదయం నుంచి సాయంత్రం వరకూ క్లాసులు చాలా స్ట్రెస్‌గా ఉంటున్నాయి. కొంచెం కూడా రిలాక్స్ అవడానికి లేదు. మా బ్యాచ్ అంతా కాసేపు బేకరీకి వెళ్దామంటున్నారు. నేను వెళ్లకపోతే వాళ్లు నన్ను ఐసొలేట్ చేస్తారు. అలుగుతారు. బ్యాచ్ నుంచి కట్ చేస్తారు. అందరూ వెళుతుంటే నేనెందుకు వెళ్లకూడదు. వెళ్లి ఇంటికి వెళతా.

రెండు వెర్షన్‌లు సరైనవే. కాని ఒక వెర్షన్ వారికి ఆధిపత్యం ఉంటుంది. మరో పక్షం వారికి ఆందోళన ఉంటుంది. తల్లిదండ్రులు ఇంటి యజమానులు. కుర్రాడికి కూడా యజమానులు. వారు యజమానులు కాకుండా తల్లిదండ్రులు ఎప్పుడవుతారంటే ఆ కుర్రాడు ఏదీ దాచకుండా తల్లిదండ్రులకు చెప్పినప్పుడు. చెప్పుకునే వాతావరణం ఉన్నప్పుడు. దానిని అర్థం చేసుకుని ఎంతవరకు అలా చేయాలో అంత వరకూ అలా చేయగలిగినప్పుడు.

పై సందర్భంలో ఆ కుర్రాడు ‘మా బ్యాచ్ అంతా బేకరీకి వెళ్దామంటున్నారు’ అని కాల్ చేస్తే తల్లిదండ్రులు ‘సరే.. వెళ్లు. కాని దాని వల్ల నీ టైమ్ వేస్ట్ అవుతుంది. అలాగని వెళ్లకపోతే బాగుండదు. ఒక గంట సేపు ఉండి వచ్చెయ్’ అనగలిగితే ఆ కుర్రాడు 45 నిమిషాలే ఉండి వచ్చే అవకాశం ఉంది.

కాని తిడతారనే భయంతో చెప్పకుండా, లేట్‌గా ఇంటికొచ్చినప్పుడు... తల్లిదండ్రులు ముందు వెనుకా చూడకుండా చెడామడా తిడితే ఆ చిన్న హృదయం ఎంత ఇబ్బంది పడుతుంది? సెన్సిటివ్ పిల్లలు అయితే అఘాయిత్యానికి పాల్పడితే?

అంగీకరించాలి: టీనేజ్‌లోకి వచ్చిన పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల ప్రస్తుత స్థితిని అంగీకరించాలి మొదట. తమ టీనేజ్ కాలానికి ఇప్పటి టీనేజ్ కాలానికి కాలం చాలా మారిపోయి ఉంటుందని గ్రహించాలి. తమలాగే తమ పిల్లలు ఉండాలనుకుంటే అది కాలానికి విరుద్ధం. ఈ కాలంలో పిల్లలు ఎలా ఉండాలనుకుంటారో అలా ఉంటారు. అందులో ఏ మేరకు చెడు ఉందో చూసి దానిని పరిహరించడానికి మాత్రమే తల్లిదండ్రులు ప్రయత్నించాలి.


పిల్లలకు సవాళ్లు: మీ పిల్లలు మీకు సమస్య సృష్టిస్తున్నారా? లేదా మీరు మీ పిల్లలకు సమస్య సృష్టించారా? మీ పిల్లలు వారికి ఇష్టమైన కోర్సు చదివేలా చూశారా? వారు యావరేజ్ స్టూడెంట్ అయినా ఫస్ట్ ర్యాంక్ రావాలని వెంట పడుతున్నారా? వారి జ్ఞాపకశక్తి పరీక్షలకు వీలుగా ఉందా? వారికి అన్ని సబ్జెక్టులు అర్థం అవుతున్నాయా? వారికి పరీక్షల వొత్తిడి ఎలా ఉంది? వారికి ఏ మాత్రమైన ఆహ్లాదం అందుతోంది? ఇవన్నీ గమనించకుండా పిల్లలు మరబొమ్మల్లా ఎప్పుడూ చెప్పినట్టల్లా వింటూ కేవలం పుస్తకాలు మాత్రమే పట్టుకుని కూచోవాలని ఆశిస్తే ఆ పిల్లలకు ఉక్కిరిబిక్కిరి ఎదురవుతుంది. దాని నుంచి బయటపడాలని తల్లిదండ్రులకు తెలియకుండా దొంగపద్ధతులకు దిగుతారు. అది తల్లిదండ్రులకు ఇంకా తప్పుగా కనిపిస్తుంది. వారు తప్పు చేసేలా చేసింది తల్లిదండ్రులే మరి.

పనిష్మెంట్ వద్దు ఇన్‌స్పిరేషన్ ముఖ్యం: పిల్లలు టీనేజ్‌లోకి వచ్చాక మానసికంగా, శారీరకంగా ఒక ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ఉంటారు. ఆ సమయంలో వారు ఫోకస్ పెట్టి చదవాలని అనుకున్నా కొన్ని డిస్ట్రాక్షన్‌లు ఉంటాయి. అంతేగాక ఈ సమయంలో వారు ఎన్నో సందేహాలతో ప్రవర్తనకు సంబంధించి సంశయాలతో ఉంటారు. తల్లిదండ్రులు ఎంతో సన్నిహితంగా ఉంటూ వారితో సంభాషిస్తూ ‘ఏదైనా మాతో చెప్పి చేయండి’ అనే విధంగా మాట్లాడితే చాలా సమస్యలు తీరుతాయి. చదువు పట్ల, ప్రవర్తన పట్ల వారిని తల్లిదండ్రులు ఇన్‌స్పైయిర్ చేసేలా ఉండాలి తప్ప పనిష్మెంట్ చేసేలా ఉండకూడదు. తిట్టడం, కొట్టడం అనేవి కాదు చేయాల్సింది. బుజ్జగించడం, బతిమాలడం కూడా కాదు. కేవలం స్నేహంగా గైడ్ చేయడం. వారి వల్ల జరిగే తప్పులను, పొరపాట్లను జడ్జ్ చేయకుండా వారి వైపు నుంచి ఆలోచించి వారికి అర్థమయ్యేలా సరి చేయడం.

టీనేజ్‌లో ఉన్న పిల్లలకు పెద్దవాళ్లు చెప్పేది అర్థమవ్వాలంటే వారు పెద్దవాళ్లంత వయసుకు చేరాలి. కాబట్టి తల్లిదండ్రులే పిల్లల వయసుకు దిగి పిల్లలతో వ్యవహరించడం ఇరుపక్షాలకు శ్రేయస్కరం.

యువర్స్

• వర్డ్ పవర్



ప్రఫన్‌డిటీ
ఒక సబ్జెక్ట్, అంశానికి సంబంధించిన ఇంటలెక్చువల్ డెప్త్.
ఉదా: హర్ బుక్స్ ఆర్ ఏ మిక్చర్ ఆఫ్ ప్లేఫుల్‌నెస్ అండ్ ప్రఫన్‌డిటీ

పాండర్
ఒక విషయం గురించి నిశితంగా ఆలోచించడం
ఉదా: హీ సీమ్‌డ్ టు పాండర్ ఫర్ ఏ మూమెంట్

ప్లాకేట్
మాటల ద్వారా లేదా ఇతరత్రా చర్యల ద్వారా ఒకరి కోపాన్ని తగ్గించే ప్రయత్నం.
ఉదా: దే అటెమ్టెడ్ టు ప్లాకేట్ ది స్టూడెంట్స్ విత్ ప్రామిసెస్

• గేమింగ్

వేయి కళ్లతో వేట మొదలైంది...



యాక్షన్ రోల్-ప్లేయింగ్ గేమ్ 'ఫైనల్ ఫాంటసీ 7 రీబర్త్' వచ్చే వారం విడుదల అవుతుంది. ఫైనల్ ఫాంటసీ రీమేక్ (2020)కు సీక్వెల్‌గా వస్తున్న గేమ్ ఇది. 'రియల్-టైమ్ యాక్షన్'తో కూడిన 'స్ట్రాటజిక్' 'రోల్-ప్లేయింగ్' ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయి. ప్లేయర్స్ 'క్లౌడ్ స్ట్రైఫ్'ను కంట్రోల్ చేయాల్సి ఉంటుంది.

ఫైనల్ ఫాంటసీ గేమ్‌లలో 'క్లౌడ్' కథానాయకుడు. ఈ ప్రపంచాన్ని జయించాలని లక్ష్యంగా పెట్టుకున్న షిన్రాతో పోరాడడానికి ఎకో-టెర్రరిస్ట్ గ్రూప్‌లో చేరుతాడు.

సిరీస్: ఫైనల్ ఫాంటసీ **ఇంజిన్:** అన్‌రియల్ ఇంజిన్ 4
ప్లాట్‌ఫామ్: ప్లేస్టేషన్ 5 **జానర్:** యాక్షన్-రోల్ ప్లేయింగ్ **మోడ్:** సింగిల్ ప్లేయర్

• ఇన్నోవేషన్



రామన్, లక్ష్మణన్
'బ్యాక్ యార్డ్ క్రియేటర్స్' ఫౌండర్స్

రామలక్ష్మణ విజయం

పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్న వారి కోసం తక్కువ ధరలో, సౌకర్యవంతమైన ఇయర్ ఇంప్లాంట్‌ను డెవలప్ చేశారు మదురైకి చెందిన ట్విన్స్ రామన్, లక్ష్మణన్. బోయింగ్ ఇండియా (బెంగళూరు) బోయింగ్ యూనివర్శిటీ ఇన్నోవేషన్ లీడర్‌షిప్ అండ్ డెవలప్‌మెంట్(బిల్డ్) గ్రాంట్ పొందిన వారిలో రామన్, లక్ష్మణన్ ఒకరు...

పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్న అమ్మాయికి తల్లిదండ్రులు వైద్యం చేయించాలనుకున్నారు. తమ ఆస్తిని అమ్మగా వచ్చిన డబ్బుతో కూతురుకి నెల రోజులు మాత్రమే వైద్యం చేయించగలిగారు. ఈ విషయం రామ్, లక్షణ్ సోదరులకు తెలిసింది. ఈ ట్విన్స్ మదురైలోని ఒక కాలేజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ చదువుతున్నారు. స్క్రాప్ మెటీరియల్‌తో వెంటిలేటర్‌ను తయారుచేయాలని ప్రయత్నిస్తున్న సోదరులు అమ్మాయి విషయం తెలిసిన తరువాత ఇయర్ ఇంప్లాంట్‌ను డెవలప్ చేయాలని నిర్ణయించుకున్నారు.

పుట్టుకతో వచ్చే వినికిడి లోపానికి చికిత్స చేయడానికి నాన్-ఇన్వేసివ్ హియరింగ్ ఇంప్లాంట్ డెవలప్ చేయడంలో విజయం సాధించారు.

సంప్రదాయ ఇంప్లాంట్‌లతో పోల్చితే దీని ధర తక్కువ. ఫస్ట్ ప్రోటోటైప్‌ను తమ పెరట్లో(బ్యాక్ యార్డ్)లో క్రియేట్ చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని తమ వెంచర్‌కు 'బ్యాక్‌యార్డ్ క్రియేటర్స్' అని పేరు పెట్టుకున్నారు.

ఖర్చును తగ్గించడంతో పాటు సౌకర్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఇంప్లాంట్ ఇది.

బోయింగ్ యూనివర్శిటీ ఇన్నోవేషన్ లీడర్‌షిప్ అండ్ డెవలప్‌మెంట్ (బిల్డ్-బెంగళూరు) గ్రాంట్ పొందిన విజేతల్లో రామ్,లక్ష్మణన్‌లు ఉన్నారు. చెవి వెనుక భాగంలో ఉంచే ఈ పరికరం విద్యుత్ తరంగాలను విడుదల చేసి నరాలను తాకి ఉత్తేజపరుస్తుంది. ఎలాంటి అసౌకర్యం లేకుండా వినడానికి సహాయపడుతుంది.

'మాగ్నటిక్ ఇంప్లాంట్‌కు ఉండే పరిమితులు మా డివైజ్‌లో ఉండవు' అంటున్నాడు రామన్.

మన దేశంలో ప్రారంభ దశ స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి 2019లో 'బిల్డ్'ను ప్రారంభించారు. కస్టమర్ సెగ్మెంటేషన్ గురించి ఎంత బాగా ఆలోచించారు....మొదలైన విషయాల ఆధారంగా విజేతలను ఎంపిక చేస్తారు. ఈ ఏడాది 1200 ఐడియాలు వచ్చాయి. 'గ్రాంట్' మొదలైనప్పటి నుంచి ఇంత పెద్ద మొత్తంలో ఐడియాలు రావడం ఇదే మొదటి సారి. ఒక్కో స్టార్టప్‌కు పది లక్షల రూపాయలు ఇస్తారు.

రామన్, లక్ష్మణన్‌లతో పాటు ప్రితీష్ కుందు (గ్రీన్ ఎనర్జీ ఫర్ ఏవియేషన్ సెక్టార్), ఐశ్వర్య కర్నాటకి, పరీక్షిత్ మిలింద్ సోహోని-ముంబై (గ్లోవ్‌ట్రిక్స్-సైన్‌లాంగ్వేజ్‌ను స్పీచ్ అండ్ టెక్ట్స్‌లోకి ట్రాన్స్‌లేట్ చేసే పరికరం),

సత్యవ్రత శతపథి-ఒడిశా (బన్యీ ఏరో), దేవేంద్ర ప్రధాన్, బిశ్వజిత్ (సిటీపీఎల్-భువనేశ్వర్)లు 'బిల్డ్' గ్రాంట్‌కు ఎంపికైన వారిలో ఉన్నారు.



దేవేంద్ర ప్రధాన్, బిస్వజిత్

మన దేశంలో డ్యామ్‌లు, బ్రిడ్జీలు... మొదలైన వాటికి సంబంధించిన అండర్‌వాటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించి ఇన్‌స్పెక్షన్, ఆపరేషన్ అనేది సవాలుగా మారింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రూర్కెలాలో చదువుకున్న దేవేంద్ర ప్రధాన్, బిశ్వజిత్ ఈ సమస్యకు పరిష్కారం కనుకొన్నారు.

అండర్ వాటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పర్యవేక్షణను వేగవంతం, సురక్షితం చేయాలనే లక్ష్యంతో 'సిటీపీఎల్' కంపెనీ స్థాపించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, ఏఐ-బేస్డ్ టెక్నాలజీతో అటానమస్ అండర్‌వాటర్ వెహికిల్(ఏయూవీ), రిమోట్లీ ఆపరేట్ వెహికిల్ (ఆర్‌వోవీ)ని డెవలప్ చేశారు. 'అండర్‌వాటర్ రోబోటిక్స్‌కు సంబంధించిన రంగంలో మన దేశంలో నాలుగు స్టార్టప్‌లు మాత్రమే ఉన్నాయి. అందులో సిటీపీఎల్ ఒకటి' అంటున్న దేవేంద్ర మెర్సిడెస్ బెంజ్ 'ఆర్ అండ్ డీ' విభాగంలో చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకొని జర్మనీ నుంచి ఇండియాకు వచ్చి బిస్వజిత్‌తో కలిసి 'సిటీపీఎల్'ను స్టార్ట్ చేశాడు. మెకట్రోనిక్స్, ఆటోమేషన్ ఇంజినీరింగ్ చేసిన బిశ్వజిత్ స్టార్టప్ కోసం చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నాడు.

• మ్యూజిక్ వరల్డ్

స్వరరాగ ఉత్సవం



ఉత్సవి ఝా

స్కూల్ రోజుల నుంచి ఉత్సవి ఝా పాటలు రాయడమే కాదు అడపాదడపా రాసేది కూడా. వెస్టన్ వోకల్స్, సెమీ -క్లాసికల్ వోకల్‌లో శిక్షణ పొందింది. 'తొలి పాట విడుదల అయినప్పుడు చాలా భయంగా ఉంటుంది. శ్రోతలు ప్రశంసిస్తారా? తిరస్కరిస్తారా? అనేది ఆ భయం' అంటుంది ఉత్సవి. అయితే ఆమె డెబ్యూ సాంగ్ సూపర్ హిట్ కావడంతో సింగర్‌గా స్పీడ్ పెరిగింది. ఇండిపెండెంట్ ఆర్టిస్ట్‌గా రాణించడానికి ఎన్నో సవాళ్లు ఉంటాయి. అలాంటి ఎన్నో సవాళ్లను అధిగమించి మ్యూజిక్ వరల్డ్‌లో తన దైన సిగ్నేచర్‌ను క్రియేట్ చేసింది ఉత్సవి. నాన్-కమర్షియల్ మ్యూజిక్‌తో శ్రోతలను మెప్పించడం మరో సవాలు. దీన్ని కూడా అవలీలగా అధిగమించింది.'సాంజ్' సాంగ్ గురించి ప్రస్తావన వచ్చినప్పుడు 'ప్రపంచం పట్ల నాకు ఉన్న ప్రేమను వ్యక్తపరచాలనే కోరిక నుంచి పుట్టిందే సాంజ్. ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో పాడినప్పుడు మంచి స్పందన వచ్చింది. 'సరైన మ్యూజిక్ ప్రొడ్యూసర్‌ని వెతకడంలో ఆలస్యం అయినా సాంజ్‌కు లభించిన స్పందన నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది' అంటుంది ఉత్సవి ఝా. ముంబైకి చెందిన ఝా సింగర్-సాంగ్ రైటర్‌గానే కాదు నటనలోనూ మంచి మార్కులు తెచ్చుకుంది.

• టెక్... టాక్



శాంసంగ్ గెలాక్సీ ఏ15 5జీ

సైజ్: 6.50 అంగుళాలు **బరువు:** 200 గ్రా.
రిజల్యూషన్: 1080× 2340 పిక్సెల్ రిజల్యూషన్
వోఎస్: ఆండ్రాయిడ్ 14
మెమోరీ: 128జీబి 4జీబి ర్యామ్/ 128జీబి 6జీబి ర్యామ్/ 128జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 8జీబి ర్యామ్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
కనెక్టివిటీ: 5జీ హైబ్రిడ్ డ్యూయల్ సిమ్

హువావే మేట్‌బుక్ డీ16 2024



సైజ్: 16 అంగుళాలు
బరువు: 1.72 కేజీలు
రిజల్యూషన్: 1920× 1200 పిక్సెల్స్
వోఎస్: విండోస్ 11
కలర్స్: బ్రైట్‌మూన్ సిల్వర్, స్పేస్ గ్రే
మెమోరీ: 16జీబి ర్యామ్

మీమ్స్ మేకింగ్ కోసం..

మీమ్స్ అంటే యూనివర్సల్ లాంగ్వేజ్. ఐవోఎస్ అండ్ ఆండ్రాయిడ్‌కు పనికి వచ్చే నాలుగు మీమ్ క్రియేటర్ యాప్స్...



జంబో డ్రోయిడ్ మీమ్ జెనరేటర్: ఈ ఫ్రీ యాప్‌లో రెండు వేలకి పైగా హై-క్వాలిటీ మీమ్‌లు ఉన్నాయి. దీనిలో మీమ్స్‌ను కస్టమైజ్ చేయడం సహజంగా జరుగుతుంది. **మెమాటిక్:** హ్యాండీ టెంప్లెట్స్‌తో కూడిన స్ట్రీమ్‌లైన్‌డ్ మీమ్ జెనరేటర్ ఇది. క్లాసిక్ మీమ్ ఫార్మట్‌లకు ప్రీసెట్ లేబొట్లు ఉంటాయి.'జంబోడ్రోయిడ్'లాగా విస్తృతమైన మీమ్ డేటాబేస్ లేదు. మీమ్స్‌తో పాటు ఫోటో కొలాజ్‌ను జెనరేట్ చేస్తుంది మెమాటిక్. **మీమ్స్.కామ్ అండ్ మీమ్స్ మేకర్:** నెక్స్ట్ లెవెల్ హ్యూమర్ కోసం ఇమేజ్, వీడియో మీమ్స్ రెండిటినీ క్రియేట్ చేయడానికి అనుమతిస్తుంది. సౌండ్, ఎఫెక్ట్‌లను యాడ్ చేయవచ్చు. పర్సనల్ ఫోటోలను అప్‌లోడ్ చేయవచ్చు. అప్‌డేటెడ్ మీమ్ టెంప్లెట్లను ఉపయోగించవచ్చు. **మీమ్‌హౌజ్:** తమ మీమ్ డేటాబేస్‌ను ప్రతిరోజూ అప్‌డేట్ చేస్తామని చెబుతుంది మీమ్ హౌజ్. రీమిక్స్‌కు తాజా మెటీరియల్‌ను అందిస్తుంది. ఇతర యాప్‌లలాగే స్వంత చిత్రాలు, టెంప్లెట్లను ఉపయోగించి మీమ్‌లను రూపొందించవచ్చు. ఎక్స్‌పీరియన్స్‌కు ఎంటర్‌టైన్‌మెంట్ జత చేసే డిఫరెంట్ మోడల్ ఇది.

సినిమా

కళ్లప్పగించి అలా చూస్తూ ఉండిపోయా



• సమంత

సమంత.. పరిచయం అక్కర్లేని పేరు. దక్షిణాదిలోని స్టార్ హీరోయిన్లలో ఒకరిగా తనకంటూ ఎంతో క్రేజ్, ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఈ బ్యూటీ బాలీవుడ్‌లోనూ రాణిస్తున్నారు. అయితే మయోసైటిస్ వ్యాధి వల్ల ఏడాదిపాటు సినిమాల నుంచి సమంత బ్రేక్ తీసుకున్న సంగతి తెలిసిందే. కానీ, ఆమె సినిమాలకు బ్రేక్ ఇచ్చినా ఎప్పటికప్పుడు తన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేస్తూ తన క్రేజ్ ఏమాత్రం తగ్గకుండా చూసుకున్నారు సమంత. మయోసైటిస్ వ్యాధి నుంచి కోలుకుంటున్న ఆమె మళ్లీ నటించడానికి సిద్ధం అంటూ ఇటీవల తెలిపిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇదిలా ఉంటే.. హీరోయిన్ సాయిపల్లవిపై సమంత చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి. సాయి పల్లవి హీరోయిన్ కాకముందు పలు డ్యాన్స్ షోలలో పాల్గొన్న సంగతి తెలిసిందే. వాటిలో ఓ షోలో సాయి పల్లవి డ్యాన్స్ చేసిన ఓ ఎపిసోడ్‌కు సమంత జడ్జిగా వ్యవహరించారు. ''సాయిపల్లవి మంచి డ్యాన్సర్ అనే విషయం నాకు తెలుసు. గతంలో తను పాల్గొన్న ఓ డ్యాన్స్ షోకి నేను జడ్జిగా కూడా వెళ్లాను. తను డ్యాన్స్ చేస్తుంటే దృష్టి మరల్చలేక కళ్లప్పగించి అలా చూస్తూ ఉండిపోయాను. తన డ్యాన్స్ అద్భుతం'' అన్నారు. ఇలా తోటి హీరోయిన్‌పై ప్రశంసలు కురిపించిన సమంతపై ఆమె అభిమానులు సోషల్ మీడియా వేదికగా అభినందిస్తున్నారు. ప్రస్తుతం 'సిటాడెల్' అనే హిందీ వెబ్‌సిరీస్‌ను పూర్తి చేసే పనిలో ఉన్నారు సమంత.

జోడీ రిపీట్



• వరుణ్ ధావన్

బాలీవుడ్ మూవీ 'బవాల్' లో(2023) జోడీగా కనిపించి ఆడియన్స్‌ను మెప్పించారు హీరో వరుణ్ ధావన్, హీరోయిన్ జాన్వీ కపూర్. తాజాగా ఈ జోడీ రిపీట్ అవుతోంది. బాలీవుడ్‌లో 'ధడక్', 'బద్రీనాథ్ కీ దుల్హనియా' సినిమాలను తెరకెక్కించిన శశాంక్ కేతన్ తాజాగా 'సన్నీ సంస్కారీకి తులసీ కుమారి' అనే కొత్త సినిమాని ప్రకటించారు. ఈ సినిమాలో వరుణ్ ధావన్, జాన్వీ కపూర్ హీరోహీరోయిన్లుగా నటించనున్నట్లు గురువారం అధికారిక ప్రకటన వెల్లడైంది. ఈ చిత్రంలో సన్నీగా వరుణ్ ధావన్, కుమారిగా జాన్వీ కపూర్ నటిస్తారు. కరణ్ జోహార్, యశ్ జోహార్, అపూర్వ మెహతా, శశాంక్ కేతన్ ఈ మూవీ నిర్మించనున్నారు. వేసవిలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని బాలీవుడ్ సమాచారం. 2025 ఏప్రిల్ 18న ఈ చిత్రం విడుదల కానుంది. మరోవైపు తెలుగులో ఎన్టీఆర్ 'దేవర' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు జాన్వీ కపూర్.



• జాన్వీ కపూర్

గోవా టు హైదరాబాద్!



• ధనుష్



• నాగార్జున

ధనుష్, నాగార్జున హీరోలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో 'డీఎన్ఎస్' (వర్కింగ్ టైటిల్) అనే చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ముంబై మాఫియా నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే తిరుపతి పరిసర ప్రాంతాల్లో తొలి షెడ్యూల్ చిత్రీకరణను, గోవాలో మరో షెడ్యూల్‌ను పూర్తి చేశారు మేకర్స్. ధనుష్, నాగార్జున పాల్గొనగా కీలక సన్నివేశాలను తీశారు. కాగా ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ చిత్రీకరణ ఈ వారంలో హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. ధనుష్, నాగార్జున పాల్గొనే ఈ షెడ్యూల్‌లోనే హీరోయిన్ రష్మికా మందన్నా కూడా జాయిన్ అవుతారట. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.



• రాహుల్ రామకృష్ణ, శ్రీవిష్ణు, ప్రియదర్శి

ఓం భీమ్ బుష్!

'సామజవరగమన'(2023) వంటి హిట్ మూవీ తర్వాత శ్రీ విష్ణు హీరోగా నటించిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. 'నో లాజిక్ ఓన్లీ మ్యాజిక్' అన్నది ఉపశీర్షిక. 'హుషారు' ఫేమ్ శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, అయేషా ఖాన్ కథానాయికలుగా నటించారు. ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ కీలక పాత్రలు చేశారు. యువీ క్రియేషన్స్ సమర్పణలో వి సెల్యులాయిడ్స్‌పై సునీల్ బలుసు నిర్మించారు. ఈ సినిమాకి 'ఓం భీమ్ బుష్' అనే టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ వ్యోమగామి దుస్తులు ధరించి, తమ చేతుల్లో కరపత్రాలతో నడుచుకుంటూ వస్తున్న ఫస్ట్ లుక్ ఆసక్తిగా ఉంది. ''పూర్తి వినోదాత్మకంగా రూపొందిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. మార్చి 22న సినిమాని రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: సన్నీ ఎం.ఆర్.

మార్చిలో వ్యూహం



• రామ్‌గోపాల్ వర్మ

అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'వ్యూహం'. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'శపథం' ఉంటుంది. రామదూత క్రియేషన్స్‌పై దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమాల విడుదల తేదీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. 'వ్యూహం' సినిమా నేడు (ఫిబ్రవరి 23), 'శపథం' చిత్రాన్ని మార్చి 1న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే 'వ్యూహం' ను మార్చి 1న, 'శపథం' ను మార్చి 8న రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు రామ్‌గోపాల్ వర్మ. ''వ్యూహం'ను మార్చి 1కి, 'శపథం'ను మార్చి 8కి వాయిదా వేశాం. ఈ సారి కారణం లోకేష్ కాదు. కొన్ని సాంకేతిక పరమైన కారణాలు, మేం కోరుకున్న థియేటర్స్ లేనందున వాయిదా వేశాం'' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు రామ్‌గోపాల్ వర్మ. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి మరణం నుంచి ఆయన తనయుడు ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసే వరకు 'వ్యూహం' ఉంటుందన్నారు రామ్‌గోపాల్ వర్మ.

ఇద్దరికీ కొత్తే



• సురేశ్‌బాబు, హేమచంద్రా రెడ్డి

కె. హేమచంద్రా రెడ్డి హీరోగా 'ఇద్దరికీ కొత్తేగా' సినిమా ప్రారంభమైంది. కృష్ణ క్రియేషన్స్‌పై కుల్లపరెడ్డి సురేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి నిర్మాతలు సి.కల్యాణ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, చదలవాడ శ్రీనివాసరావు క్లాప్ కొట్టారు. నిర్మాత కె.ఎల్. దామోదర ప్రసాద్ దర్శకత్వం వహించారు. హైకోర్టు న్యాయమూర్తి శ్వేత, ప్రసన్న కుమార్, దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, మాజీ జడ్జి మాల్యాద్రి, మేక మేనక స్క్రిప్ట్‌ను సురేశ్‌బాబుకు అందించారు. ''గతంలో నేను 'వకాలత్ నామా' సినిమాలో హీరోగా చేశాను. ఇప్పుడు 'ఇద్దరికీ కొత్తేగా' కి తీస్తున్నాను. నిర్మాత కేయస్ రామారావుగారు మాకు అండగా నిలిచారు''అన్నారు కుల్లపరెడ్డి సురేశ్‌బాబు. ఈ చిత్రానికి కెమెరా: కోట తిరుపతిరెడ్డి, సంగీతం: ఎం.ఎం.ఎస్.

సాక్షి బిజినెస్
శుక్రవారం
23-2-2024

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▲	నిఫ్టీ ▲
535	162
73,158	22,217

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్‌	15,960	▲ 379
డోజోన్స్‌	38,878	▲ 265
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,684	▲ 22
డాక్స్‌	17,370	▲ 252
షాంఘై	2,988	▲ 37
నికాయ్‌	39,099	▲ 836

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,155	▼ 103
బంగారం (99.5 స్వచ్ఛత)	61,906	▼ 103
వెండి (కిలో)	70,396	▼ 312

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	82.51	83.53
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	103.62	106.16
€	యూరో	ఎస్‌బీఐ	88.61	90.97
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	54.76	56.00
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	53.58	55.50
S$	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	59.41	64.01
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	21.22	22.79
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	21.96	23.49
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	10.42	12.49

మారుత్‌ డ్రోన్స్‌కు తొలి యుటిలిటీ పేటెంట్‌

డ్రోన్ల సాయంతో వరిసాగు

హైదరాబాద్‌: మారుత్‌ డ్రోన్స్‌ ప్రపంచంలోనే తొలి యుటిలిటీ పేటెంట్‌ను (మేథో సంపత్తి హక్కు) 20 ఏళ్ల కాలానికి సొంతం చేసుకుంది. ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ (పీజేటీఎస్‌ఏయూ) సహకారంతో మారుత్‌ డ్రోన్స్‌ అభివృద్ధి చేసిన డైరెక్ట్‌ సీడింగ్‌ డ్రోన్‌కు ఈ పేటెంట్‌ దక్కింది. క్షేత్రస్థాయిలో వరిసాగు కోసం డైరెక్ట్‌ సీడింగ్‌ డ్రోన్లను విస్తృతంగా వినియోగించే దిశగా పనిచేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. 2030 నాటికి మిలియన్‌ హెక్టార్లలో విత్తు నాటాలన్న లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకున్నట్లు మారుత్‌ డ్రోన్స్‌ వ్యవస్థాపకుడు, సీఈవో ప్రేమ్‌ కుమార్‌ విస్లావత్‌ తెలిపారు.



మూడేళ్లలో రూ. 10 వేల కోట్ల ఆదాయం

డెకరేటివ్‌ పెయింట్స్‌ వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్‌



న్యూఢిల్లీ: కొత్త వెంచర్‌ అయిన డెకరేటివ్‌ పెయింట్స్‌ వ్యాపార విభాగం నుంచి వచ్చే మూడేళ్లలో రూ. 10,000 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్‌ చైర్మన్‌ కుమార మంగళం బిర్లా తెలిపారు. అప్పటికల్లా లాభాల్లోకి మళ్లగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బిర్లా ఓపస్‌ బ్రాండ్‌ కింద డెకరేటివ్‌ పెయింట్ల వ్యాపారంతో పాటు మూడు పెయింట్‌ ప్లాంట్లను గురువారం ఆయన ప్రారంభించారు. పానిపట్‌ (హరియాణ), లూధియానా (పంజాబ్‌), చెయ్యార్‌ (తమిళనాడు)లో ఈ ప్లాంట్లు ఉన్నాయి. బిర్లా ఓపస్‌ పెయింట్లు మార్చి నుంచి పంజాబ్‌, హరియాణ, తమిళనాడులో లభ్యమవుతాయి. జూలై నుంచి 1 లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణాల్లో ఇవి లభిస్తాయని బిర్లా చెప్పారు. ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి 6,000 పట్టణాలకు కార్యకలాపాలు విస్తరించాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు. గ్రూప్‌లో కీలకమైన గ్రాసిమ్‌ ఇండస్ట్రీస్‌ గతేడాది డెకరేటివ్‌ పెయింట్ల వ్యాపారంలోకి అడుగు పెడుతున్నట్లు ప్రకటించింది. 2025 నాటికి రూ. 10,000 కోట్లతో దేశీయంగా ఆరు తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే రూ. 5,000 కోట్లు వెచ్చించినట్లు బిర్లా ఓపస్‌ బిజినెస్‌ హెడ్‌ హిమాంశు కపానియా తాజాగా చెప్పారు. దేశీయంగా డెకరేటివ్‌ పెయింట్స్‌ మార్కెట్‌ దాదాపు రూ. 80,000 కోట్ల స్థాయిలో ఉంది. ఏషియన్‌ పెయింట్స్‌, బర్జర్‌ పెయింట్స్‌, నెరోలాక్‌, అక్జో నోవెల్‌ (డ్యూలక్స్‌) ఈ విభాగంలో దిగ్గజాలుగా ఉన్నాయి.

వొడా ఐడియా నిధుల బాట

- ఈ నెల 27న బోర్డు సమావేశం
- కంపెనీ బలిమికి కట్టుబాటు
- కుమార మంగళం బిర్లా వెల్లడి

న్యూఢిల్లీ: మొబైల్‌ టెలికం దిగ్గజం వొడాఫోన్‌ ఐడియా నిధుల సమీకరణకు ప్రతిపాదించింది. ఈ అంశంపై చర్చించేందుకు కంపెనీ బోర్డు ఈ నెల 27న సమావేశం కానున్నట్లు కంపెనీ పేర్కొంది. నిధుల సమీకరణకున్న అన్ని అవకాశాలను బోర్డు పరిశీలించనున్నట్లు తెలియజేసింది. రైట్స్‌, పబ్లిక్‌ ఆఫర్‌, ప్రిఫరెన్షియల్‌ కేటాయింపులు, క్విప్‌ తదితర మార్గాలతోపాటు.. ఒకేసారి లేదా దశలవారీగా నిధుల సమీకరణకు తెరతీసే అంశంపై నిర్ణయించనున్నట్లు వివరించింది. వెరసి ఈక్విటీ లేదా రుణ మార్గాలలో నిధుల సమీకరణ చేపట్టనున్నట్లు బీఎస్‌ఈకి వొడాఫోన్‌ ఐడియా తాజాగా వెల్లడించింది.



విదేశీ ఇన్వెస్టర్లకు చోటు

నగదు సవాళ్లను ఎదుర్కొంటున్న వొడాఫోన్‌ ఐడియా కంపెనీ బలిమికి కట్టుబడి ఉన్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్‌ చైర్మన్‌ కుమారమంగళం బిర్లా తాజాగా స్పష్టం చేశారు. బిర్లా గ్రూప్‌ డెకరేటివ్‌ పెయింట్ల బిజినెస్‌లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా వొడాఫోన్‌లో విదేశీ ఇన్వెస్టర్లకు చోటు కల్పించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. అయితే బోర్డులో విదేశీ ఇన్వెస్టర్లు ఎప్పుడు ప్రవేశిస్తారన్న అంశంపై ఇప్పుడే చెప్పలేమన్నారు. ఇందుకు వ్యూహాత్మకంగా తగిన ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. వొడాఫోన్‌ ఐడియాలో ఆదిత్య బిర్లా గ్రూప్‌ సహప్రమోటర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. కాగా.. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం(అక్టోబర్‌–డిసెంబర్‌)లో కంపెనీ రూ. 6,986 కోట్లకు నికర నష్టాన్ని తగ్గించుకుంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 7,990 కోట్ల నష్టం ప్రకటించింది. దాదాపు రూ. 756 కోట్ల అనూహ్య లాభాలు నష్టాలు తగ్గేందుకు సహకరించాయి. భారీ రుణ భారాన్ని మోస్తున్న వొడాఫోన్‌ ఐడియా మొబైల్‌ టెలికం రంగంలోని ప్రత్యర్థి సంస్థలు రిలయన్స్‌ జియో, భారతీ ఎయిర్‌టెల్‌నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొంటోంది.

నిధుల సమీకరణ వార్తలతో వొడాఫోన్‌ ఐడియా షేరు బీఎస్‌ఈలో 6.3 శాతం జంప్‌చేసి రూ. 16.30 వద్ద ముగిసింది.

-542 నుంచి +535

కనిష్టాల నుంచి మార్కెట్‌ ర్యాలీ



- నాలుగో రోజు నిఫ్టీ సరికొత్త రికార్డు
- ట్రేడింగ్‌లో భారీ ఒడిదుడుకులు

ముంబై: మిడ్‌సెషన్‌ నుంచి ఆటో, ఐటీ, టెక్నాలజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్‌ సూచీలు గురువారం కనిష్ఠ స్థాయిల నుంచి బౌన్స్‌ బ్యాక్‌ అయ్యాయి. యూరో జోన్‌ తయారీ, సేవా రంగ పీఎంఐ డేటా అంచనాలకు మించి నమోదవడంతో పాటు అమెరికా టెక్‌ కంపెనీల క్యూ3 ఆర్థిక ఫలితాలు మెప్పించడం దేశీయ ఈక్విటీ మార్కెట్ల రికవరీ ర్యాలీకి తోడ్పాటు అందించాయి. ఉదయం స్తబ్దుగా ట్రేడింగ్‌ ప్రారంభించిన సూచీలు రోజంతా తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. ఇంట్రాడేలో 542 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్‌ చివరికి 535 పాయింట్ల లాభంతో 73,158 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 1176 పాయింట్ల రేంజ్‌లో 72,081 వద్ద కనిష్టాన్ని, 73,256 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 180 పాయింట్ల నష్టం తేరుకొని 162 పాయింట్లు బలపడి 22,217 వద్ద స్థిరపడింది. ఒక దశలో 197 పాయింట్లు పెరిగి వరుసగా నాలుగోరోజూ 22,252 వద్ద జీవితకాల గరిష్టాన్ని లిఖించింది. ఈ సూచీకి ముగింపు(22,217)కూడా కొత్త రికార్డు కావడం విశేషం. ఆటో, ఐటీతో పాటు క్యాపిటల్‌ గూడ్స్‌, పారిశ్రామిక, విద్యుత్‌ రంగాల షేర్లు రాణించాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈలో మిడ్‌, స్మాల్‌ క్యాప్‌ సూచీలు వరుసగా 0.92%, 0.54% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,410 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,824 కోట్ల షేర్లు కొన్నారు. ఆసియాలో ఇండోనేసియా మినహా అన్ని దేశాల స్టాక్‌ సూచీలు 2% వరకు ర్యాలీ చేశాయి. యూరప్‌లో ఫ్రాన్స్‌, జర్మనీ ఎక్స్ఛేంజీలు 1.50% లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు 2% లాభాల్లో ట్రేడవుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) సీజన్‌లో చెరకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.25 మేర పెంచుతున్నట్లు ఆర్థిక వ్యవహారాల కేబినెట్‌ కమిటీ నిర్ణయం తీసుకోవడంతో చక్కెర ధరలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈలో రానా షుగర్స్‌, మవాన షుగర్స్‌, శ్రీ రేణుక షుగర్స్‌, దాల్మియా షుగర్స్‌, భరత్‌ షుగర్‌ అండ్‌ ఇండస్ట్రీస్‌, ఈఐడీ ప్యారీ షుగర్స్‌ షేర్లు 3% – 1% చొప్పున నష్టపోయాయి.

డాలర్‌ మారకంలో రూపాయి విలువ 11 పైసలు బలపడి 82.85 వద్ద స్థిరపడింది.

కొత్త చందాదారుల ఆకర్షణలో జియో టాప్‌

డిసెంబర్‌లో 40 లక్షల కస్టమర్లు • ఎయిర్‌టెల్‌లోకి 18.5 లక్షలు • 119 కోట్లకు టెలికం చందాదారులు



న్యూఢిల్లీ: కొత్త కస్టమర్లను ఆకర్షించడంలో మరోసారి రిలయన్స్‌ జియో ముందుంది. 2023 డిసెంబర్‌ నెలకు గాను 39.94 లక్షల మొబైల్‌ చందాదారులను జియో సొంతం చేసుకుంది. భారతీ ఎయిర్‌టెల్‌ కిందకు కొత్తగా 18.5 లక్షల మంది కస్టమర్లు వచ్చి చేరారు. అదే సమయంలో ఎప్పటి మాదిరే వొడాఫోన్‌ ఐడియా మరో 13.68 లక్షల కస్టమర్లను డిసెంబర్‌లో కోల్పోయింది. ప్రభుత్వరంగ బీఎస్‌ఎన్‌ఎల్‌ 1.5 లక్షల కస్టమర్లు, ఎంటీఎన్‌ఎల్‌ 4,420 మంది కస్టమర్ల చొప్పున నష్టపోయాయి. మొత్తం టెలికం చందాదారులు 2023 నవంబర్‌ నాటికి 1,185.73 మిలియన్లుగా ఉంటే, డిసెంబర్‌ చివరికి 1,190.33 మిలియన్లకు (119 కోట్లకు) చేరారు. నెలవారీగా ఇది 0.39 శాతం వృద్ధికి సమానం. బ్రాడ్‌బ్యాండ్‌ చందాదారులు సైతం 90.4 కోట్లకు పెరిగారు. వైర్‌లైన్‌ టెలిఫోన్‌ చందాదారుల సంఖ్య నవంబర్‌ చివరికి 3.15 కోట్లుగా ఉంటే, డిసెంబర్‌ చివరికి 3.18 కోట్లకు పెరిగింది. వైర్‌లైన్‌ విభాగంలో జియో 2.46 లక్షల కొత్త కస్టమర్లను సాధించింది. ఎయిర్‌టెల్‌ 82,317 మంది, వొడాఫోన్‌ ఐడియా 9,656, క్వాంట్రంట్‌ 6,926 కస్టమర్ల చొప్పున సొంతం చేసుకున్నాయి. బీఎస్‌ఎన్‌ఎల్‌ 34,250 మంది, టాటా టెలిసర్వీసెస్‌ 22,628 మంది చొప్పున కస్టమర్లను కోల్పోయాయి.

సి.ఎం.ఆర్‌. ప్రచారకర్తగా మృణాల్‌ ఠాకూర్‌

హైదరాబాద్‌: ప్రముఖ వస్త్ర స్వర్ణాభరణాల సంస్థ సి.ఎం.ఆర్‌.షాపింగ్‌ మాల్‌ నూతన బ్రాండ్‌ అంబాసిడర్‌గా సినీ నటి మృణాల్‌ ఠాకూర్‌ నియమితులయ్యారు. తెలుగువారి ప్రతి వేడుకలో భాగమైన సి.ఎం.ఆర్‌.కు ప్రచారకర్తగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని మృణాల్‌ ఠాకూర్‌ ఈ సందర్భంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శుభ కార్యాలకు ప్రత్యేక పట్టువస్త్రాలు, యువత మెచ్చే సరికొత్త ఫ్యాషన్స్‌, అద్భుతమైన డిజైన్లతో కిడ్స్‌ వేర్‌ కలెక్షన్స్‌ ఇక్కడ లభిస్తాయన్నారు. ''మృణాల్‌ ఠాకూర్‌ మా సంస్థకు బ్రాండ్‌ అంబాసిడర్‌గా ఉండటం సంతోషంగా ఉంది. ప్రపంచ స్థాయి ఫ్యాషన్‌ ట్రెండ్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు సరికొత్త కలెక్షన్స్‌ మా వద్ద లభిస్తాయి'' అని సంస్థ మేనేజింగ్‌ డైరెక్టర్‌ మావూరి మోహన్‌ బాలాజీ తెలిపారు



అశోక్‌ లేలాండ్‌ @ 30 లక్షలు



చెన్నై: హిందూజా గ్రూప్‌ కంపెనీ, వాణిజ్య వాహనాల తయారీలో ఉన్న అశోక్‌ లేలాండ్‌ సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఉత్తరాఖండ్‌లోని పంత్‌నగర్‌ వద్ద ఉన్న కంపెనీ ప్లాంటు మొత్తం 30 లక్షల యూనిట్లను తయారు చేసి కొత్త రికార్డు సృష్టించింది. అత్యంత విశ్వసనీయ ఉత్పత్తులను తయారు చేయడంలో, అగ్రశ్రేణి కస్టమర్‌ సేవలను అందించడంలో సుస్థిర ఖ్యాతికి ఈ మైలురాయి నిదర్శనం అని అశోక్‌ లేలాండ్‌ ఎండీ, సీఈవో శేణు అగర్వాల్‌ గురువారం తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

23-2-2024	
విశాఖ	525–00
చిత్తూరు	603–00
ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్‌ ధర (డజను)	72.00
22-2-2024 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	534–00
వరంగల్‌	536–00
రిటైల్‌ ధర	5.95

సాక్షి స్పోర్ట్స్‌



ఐపీఎల్‌ నుంచి షమీ అవుట్‌

భారత పేస్‌ బౌలర్‌ షమీ ఎడమ కాలి మడమ గాయం కారణంగా ఐపీఎల్‌–2024 సీజన్‌ మొత్తానికి దూరమయ్యాడు. గత నెలలో లండన్‌లో ఈ గాయానికి చికిత్స తీసుకునే క్రమంలో మడమకు అతను ప్రత్యేక ఇంజక్షన్‌లు తీసుకున్నాడు. అయితే అవి ప్రభావం చూపించకపోవడంతో శస్త్ర చికిత్స చేయించుకోవడం తప్పనిసరిగా మారింది. త్వరలోనే అతను మళ్లీ లండన్‌కు వెళతాడు. వన్డే వరల్డ్‌ కప్‌లో 24 వికెట్లతో భారత్‌ను ఫైనల్‌ చేర్చడంలో కీలక పాత్ర పోషించిన షమీ ఆ తర్వాత మరే మ్యాచ్‌లోనూ బరిలోకి దిగలేదు.

నేటి నుంచి రంజీ ట్రోఫీ క్వార్టర్‌ ఫైనల్స్‌

రంజీ ట్రోఫీ క్రికెట్‌ టోర్నీ ఎలైట్‌ డివిజన్‌ క్వార్టర్‌ ఫైనల్‌ మ్యాచ్‌లు శుక్రవారం మొదలుకానున్నాయి. ఇండోర్‌లో మధ్యప్రదేశ్‌తో ఆంధ్ర జట్టు... ముంబైలో బరోడాతో ముంబై జట్టు... నాగ్‌పూర్‌లో కర్ణాటకతో విదర్భ... కోయంబత్తూరులో తమిళనాడుతో డిఫెండింగ్‌ చాంపియన్‌ సౌరాష్ట్ర తలపడనున్నాయి.

చెన్నై X బెంగళూరు

మార్చి 22న ఐపీఎల్‌ మొదటి పోరు

- తొలి దశ షెడ్యూల్‌ విడుదల
- వైజాగ్‌లో రెండు ఢిల్లీ జట్టు మ్యాచ్‌లు



బెంగళూరు కెప్టెన్‌ డు ప్లెసిస్‌, చెన్నై కెప్టెన్‌ ధోని (ఫైల్‌)

న్యూఢిల్లీ: ఇండియన్‌ ప్రీమియర్‌ లీగ్‌ (ఐపీఎల్‌)–2024కు అధికారికంగా నగారా మోగింది. మార్చి 22న జరిగే టోర్నీ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్‌ చాంపియన్‌ చెన్నై సూపర్‌ కింగ్స్‌ తమ సొంతగడ్డపై రాయల్‌ చాలెంజర్స్‌ బెంగళూరు జట్టుతో తలపడుతుంది. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీసీసీఐ రెండు దశల్లో ఐపీఎల్‌ను నిర్వహించాలని నిర్ణయించింది. అందుకే తొలి దశలో మార్చి 22 నుంచి ఏప్రిల్‌ 7 మధ్య జరిగే 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే విడుదల చేసింది. లీగ్‌లో మొత్తం 74 మ్యాచ్‌లు జరుగుతాయి. ఎన్నికల షెడ్యూల్‌ విడుదలైన తర్వాత మిగిలిన 53 మ్యాచ్‌ల తేదీలు, వేదికలను బోర్డు ప్రకటిస్తుంది. గత రెండు సీజన్ల తరహాలోనే 10 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ టీమ్‌ లీగ్‌ దశలో 14 మ్యాచ్‌లు ఆడుతుంది. టోర్నీ ఫైనల్‌ మే 26న జరిగే అవకాశం ఉంది. తొలి 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌లో నాలుగు తేదీల్లో ఒకేరోజు రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. ఈ 17 రోజుల్లో ఢిల్లీ, గుజరాత్‌, బెంగళూరు గరిష్టంగా ఐదేసి మ్యాచ్‌ల చొప్పున ఆడతాయి.

అందుకే విశాఖలో...

ఆంధ్ర క్రికెట్‌ అభిమానులకు ఐదేళ్ల విరామం తర్వాత ఐపీఎల్‌ మ్యాచ్‌లు చూసే అవకాశం దక్కుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్‌ టీమ్‌ తమ రెండు 'హోమ్‌' మ్యాచ్‌లను వైజాగ్‌లో ఆడాలని నిర్ణయించుకుంది. క్యాపిటల్స్‌ సొంత వేదిక ఫిరోజ్‌షా కోట్లా మైదానం మార్చి 17న జరిగే డబ్ల్యూపీఎల్‌ ఫైనల్‌ సహా మొత్తం 11 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తోంది. దాంతో ఐపీఎల్‌కు ముందు గ్రౌండ్‌ సన్నద్ధతకు తగినంత సమయం లభించడం లేదు. ఈ కారణంగా క్యాపిటల్స్‌ తమ వేదికను వైజాగ్‌కు మార్చింది. విశాఖలో వైఎస్‌ఆర్‌ ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ఇప్పటి వరకు 13 ఐపీఎల్‌ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చింది. ఆఖరి సారిగా 2019 లీగ్‌లో ఎలిమినేటర్‌, క్వాలిఫయింగ్‌–2 మ్యాచ్‌లు ఇక్కడే జరిగాయి. మరోవైపు పంజాబ్‌ కింగ్స్‌ కూడా తమ హోమ్‌ వేదికను మార్చింది. ఇప్పటి వరకు మొహాలి ఈ టీమ్‌ సొంత గ్రౌండ్‌గా ఉండగా... చండీగఢ్‌ శివార్లలో ముల్లన్‌పూర్‌లో కొత్తగా నిర్మించిన స్టేడియంలో ఇకపై తమ హోమ్‌ మ్యాచ్‌లు ఆడుతుంది.

ఐపీఎల్‌ తొలి దశ షెడ్యూల్‌

తేదీ	మ్యాచ్‌	వేదిక
మార్చి 22	చెన్నై X బెంగళూరు	చెన్నై
మార్చి 23	పంజాబ్‌ X ఢిల్లీ	చండీగఢ్‌
మార్చి 23	కోల్‌కతా X హైదరాబాద్‌	కోల్‌కతా
మార్చి 24	రాజస్తాన్‌ X లక్నో	జైపూర్‌
మార్చి 24	గుజరాత్‌ X ముంబై	అహ్మదాబాద్‌
మార్చి 25	బెంగళూరు X పంజాబ్‌	బెంగళూరు
మార్చి 26	చెన్నై X గుజరాత్‌	చెన్నై
మార్చి 27	హైదరాబాద్‌ X ముంబై	హైదరాబాద్‌
మార్చి 28	రాజస్తాన్‌ X ఢిల్లీ	జైపూర్‌
మార్చి 29	బెంగళూరు X కోల్‌కతా	బెంగళూరు
మార్చి 30	లక్నో X పంజాబ్‌	లక్నో
మార్చి 31	గుజరాత్‌ X హైదరాబాద్‌	అహ్మదాబాద్‌
మార్చి 31	ఢిల్లీ X చెన్నై	వైజాగ్‌
ఏప్రిల్‌ 1	ముంబై X రాజస్తాన్‌	ముంబై
ఏప్రిల్‌ 2	బెంగళూరు X లక్నో	బెంగళూరు
ఏప్రిల్‌ 3	ఢిల్లీ X కోల్‌కతా	వైజాగ్‌
ఏప్రిల్‌ 4	గుజరాత్‌ X పంజాబ్‌	అహ్మదాబాద్‌
ఏప్రిల్‌ 5	హైదరాబాద్‌ X చెన్నై	హైదరాబాద్‌
ఏప్రిల్‌ 6	రాజస్తాన్‌ X బెంగళూరు	జైపూర్‌
ఏప్రిల్‌ 7	ముంబై X ఢిల్లీ	ముంబై
ఏప్రిల్‌ 7	లక్నో X గుజరాత్‌	లక్నో

నోట్‌: తొలి మ్యాచ్‌ ఒక్కటే రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుండగా... మిగతా రాత్రి మ్యాచ్‌లన్నీ గం.7:30 నుంచి... మధ్యాహ్నం మ్యాచ్‌లన్నీ గం. 3:30 నుంచి జరుగుతాయి.

సిరీస్‌ లక్ష్యంగా...

ఐదుటెస్టుల సిరీస్‌లో భారత్‌ మూడో టెస్టుతో పైచేయి సాధించింది. ఇప్పుడు రాంచీలో సిరీస్‌ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. రోహిత్‌ శర్మ బృందానికి ఇప్పుడు యువ ఆటగాళ్లే బలంగా మారారు. యశస్వి జైస్వాల్‌, సర్ఫరాజ్‌ ఖాన్‌ అవకాశాల్ని బాగా అందిపుచ్చుకున్నారు. ఇపుడు ఇదే బలగంతో ఒక మ్యాచ్‌ మిగిలుండగానే సిరీస్‌ను ఇక్కడే ముగించాలని టీమిండియా ఆశిస్తోంది.

- సమరోత్సాహంతో టీమిండియా
- నేటి నుంచి ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు
- ఒత్తిడిలో స్టోక్స్‌ బృందం
- ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్‌–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



స్టోక్స్‌



రోహిత్‌

రాంచీ: తొలి టెస్టులో ఇంగ్లండ్‌ చేతిలో అనూహ్యంగా ఓడిన భారత్‌ ఆ తర్వాత వరుసగా రెండు, మూడు టెస్టుల్లో గెలిచింది. రెండో టెస్టులో బుమ్రా పేస్‌, మూడో టెస్టులో జడేజా స్పిన్‌ కీలక భూమిక పోషిస్తే... ఈ రెండు టెస్టుల్లోనూ యువ సంచలనం యశస్వి డబుల్‌ సెంచరీలు కామన్‌గా కలిసొచ్చాయి. రోహిత్‌, గిల్‌లతో టాపార్డర్‌కు ఏ ఢోకా లేదు. మిడిలార్డరే అనుభవలేమితో ఉంది. రజత్‌ పటిదార్‌కు రెండు మ్యాచ్‌ల్లోనూ అవకాశమిచ్చినా ఏమాత్రం మెప్పించలేకపోయాడు. గత మ్యాచ్‌ ఆడిన సర్ఫరాజ్‌ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ నిరూపించుకున్నాడు. జడేజా శతకం మిడిలార్డర్‌ను నిలబెట్టింది. బుమ్రా లేని పేస్‌ బౌలింగ్‌కు తొలిసారిగా సిరాజ్‌ పెద్దదిక్కయ్యాడు. ఇన్నాళ్లు షమీ, బుమ్రాలతో బంతిని పంచుకునే అతను రాంచీలో ప్రధాన పేసర్‌గా బరిలోకి దిగబోతున్నాడు. స్పిన్‌ వికెట్‌ కాబట్టి ముగ్గురు రెగ్యులర్‌ స్పిన్నర్లు బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. గురువారం నెట్స్‌లో ఆకాశ్‌దీప్‌ గంటల తరబడి శ్రమించాడు. ఒకవేళ సిరాజ్‌కు జోడీగా అతన్ని పరిశీలించవచ్చు.

సమం కోసం ఇంగ్లండ్‌ సమరం

ప్రస్తుత భారత్‌తో పోలిస్తే స్టోక్స్‌, రూట్‌, డకెట్‌, క్రాలీ, పోప్‌, అండర్సన్‌లతో కూడిన ఇంగ్లండే అనుభవజ్ఞులతో మేటిగా ఉంది. అయినాసరే సిరీస్‌లో భారత కుర్రాళ్ల జోరుకు కళ్లెం వేయలేక డీలా పడుతోంది. రాజ్‌కోట్‌లో అయితే మొదటి ఇన్నింగ్స్‌లో అదరగొట్టిన స్టోక్స్‌ సేన రెండో ఇన్నింగ్స్‌కు వచ్చేసరికి చేతులెత్తేసింది. రూట్‌, ఒలీ పోప్‌, బెయిర్‌స్టోల వైఫల్యం జట్టుకు ప్రతికూలంగా మారింది. చాన్నాళ్ల తర్వాత కెప్టెన్‌ స్టోక్స్‌ బౌలింగ్‌ వేసేందుకు నెట్స్‌లో ప్రాక్టీస్‌ చేశాడు. గతేడాది యాషెస్‌ సిరీస్‌ మధ్యలోనే మోకాలి గాయం వల్ల స్టోక్స్‌ పూర్తిగా బ్యాటింగ్‌కే పరిమితమయ్యాడు. గత జూన్‌ నుంచి బౌలింగ్‌కే దిగలేదు. ఇప్పుడు మాత్రం బంతిపట్టే యోచనలో పడ్డాడు. వరుస మ్యాచ్‌ల ఓటమిలతో ఇంగ్లండ్‌ తుది జట్టులో మార్పులు చేసింది. లెగ్‌ స్పిన్నర్‌ రేహన్‌ అహ్మద్‌ స్థానంలో ఆఫ్‌స్పిన్నర్‌ షోయబ్‌ బషీర్‌ను హార్ట్‌లీకి జోడీగా బరిలోకి దించుతోంది. మార్క్‌ వుడ్‌ను తప్పించి రాబిన్సన్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు.

జట్లు (అంచనా)

భారత్‌: రోహిత్‌ (కెప్టెన్‌), జైస్వాల్‌, శుబ్‌మన్‌ గిల్‌, పటిదార్‌, సర్ఫరాజ్‌, ధ్రువ్‌ జురెల్‌, జడేజా, అశ్విన్‌, సిరాజ్‌, కుల్దీప్‌, ముకేశ్‌/ఆకాశ్‌దీప్‌.

ఇంగ్లండ్‌: స్టోక్స్‌ (కెప్టెన్‌), క్రాలీ, డకెట్‌, ఒలీ పోప్‌, జో రూట్‌, బెయిర్‌స్టో, ఫోక్స్‌, హార్ట్‌లీ, బషీర్‌, రాబిన్సన్‌, అండర్సన్‌.



డబ్ల్యూపీఎల్‌ ట్రోఫీతో కెప్టెన్లు స్మృతి, బెత్‌ మూనీ, అలీసా హీలీ, మెగ్‌ లానింగ్‌, హర్మన్‌ప్రీత్‌

మహిళల లీగ్‌కు వేళాయె...

నేటి నుంచి డబ్ల్యూపీఎల్‌	బరిలో 5 జట్లు, 22 మ్యాచ్‌లు	తొలి మ్యాచ్‌లో ముంబైతో ఢిల్లీ 'ఢీ'	మార్చి 17న ఫైనల్‌ పోరు

రాత్రి గం. 7:30 నుంచి స్పోర్ట్స్‌–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: మహిళల ప్రీమియర్‌ లీగ్‌ (డబ్ల్యూపీఎల్‌) టి20 క్రికెట్‌ టోర్నీ రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. గత ఏడాది తొలి సీజన్‌లో అభిమానులను ఆకట్టుకొని పలువురు యువ క్రికెటర్లను వెలుగులోకి తెచ్చిన ఈ లీగ్‌ మరోసారి అదే స్థాయిలో ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది. నేడు చిన్నస్వామి స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో గత సీజన్‌ విజేత ముంబై ఇండియన్స్‌తో రన్నరప్‌ ఢిల్లీ క్యాపిటల్స్‌ తలపడుతుంది. మిగతా మూడు జట్లు రాయల్‌ చాలెంజర్స్‌ బెంగళూరు, యూపీ వారియర్స్‌, గుజరాత్‌ జెయింట్స్‌ కూడా ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. గత ఏడాదిలాగే ఈసారి కూడా టోర్నీలో మొత్తం 22 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మార్చి 17న ఢిల్లీ వేదికగా ఫైనల్‌ జరుగుతుంది.

తాజా సీజన్‌ విశేషాలు....

- గత సీజన్‌లో ఒక్క ముంబైలోనే అన్ని మ్యాచ్‌లు జరిగాయి. ఈసారి బెంగళూరు, ఢిల్లీలను వేదికలుగా ఎంపిక చేశారు.
- తొలి సీజన్‌లాగే పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు 'ఎలిమినేటర్‌' మ్యాచ్‌లో తలపడతాయి.
- గత ఏడాది ఐదు టీమ్‌లకు కెప్టెన్లుగా వ్యవహరించిన వారే ఈసారి సారథులుగా ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌ నుంచి రిటైర్‌ అయిన మెగ్‌ లానింగ్‌ (ఢిల్లీ), అలీసా హీలీ (యూపీ), బెత్‌ మూనీ (గుజరాత్‌) ఆస్ట్రేలియన్లే కాగా...హర్మన్‌ప్రీత్‌ (ముంబై), స్మృతి మంధాన (బెంగళూరు) భారత స్టార్లు. భారత్‌ మినహా ఆసీస్‌ నుంచే గరిష్టంగా 13 మంది ప్లేయర్లు బరిలోకి దిగుతున్నారు.
- 2023 సీజన్‌లో సత్తా చాటిన సైకా ఇషాక్‌, శ్రేయాంక పాటిల్‌ ఆ తర్వాత భారత జట్టుకు ఎంపికయ్యారు. గత ఏడాది వీరిని కనీస ధర రూ.10 లక్షలకు తీసుకోగా... రెండు సీజన్ల మధ్య భారత జట్టుకు ఆడటంతో బీసీసీఐ నిబంధనల ప్రకారం వీరిద్దరికి రూ. 30 లక్షల చొప్పున లభిస్తాయి.
- ఈ సీజన్‌ వేలంలో కాశ్వీ గౌతమ్‌ను రూ.2 కోట్లకు గుజరాత్‌ జెయింట్స్‌ టీమ్‌ ఎంచుకుంది. అయితే గాయం కారణంగా ఆమె ఈ సీజన్‌ నుంచి అనూహ్యంగా తప్పుకోవడం గమనార్హం.
- హైదరాబాద్‌, ఆంధ్ర జట్ల నుంచి 8 మంది ఈసారి డబ్ల్యూపీఎల్‌లో బరిలోకి దిగనున్నారు. హైదరాబాద్‌ ప్లేయర్లు అరుంధతి రెడ్డి (ఢిల్లీ), త్రిష పూజిత (గుజరాత్‌), యశశ్రీ, గౌహర్‌ సుల్తానా (యూపీ) జట్లకు... ఆంధ్ర క్రికెటర్లు స్నేహ దీప్తి (ఢిల్లీ), సబ్బినేని మేఘన (బెంగళూరు), షబ్నమ్‌ (గుజరాత్‌), అంజలి శర్వాణి (యూపీ) టీమ్‌ల తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.

క్లుప్తంగా...

వెలుగు చూసిన పాతరాతి యుగం గొడ్డలి

వికారాబాద్ జిల్లాలో గుర్తింపు



సాక్షి, హైదరాబాద్: తొలి పాతరాతి యుగం(అషూలియన్)కు చెందినదిగా భావిస్తున్న ఒక రాతి ఆయుధం తాజాగా వికారాబాద్ జిల్లాలో వెలుగుచూసింది. దోమ మండలం కొత్తపల్లి గ్రామం, కులకచర్ల మండలం చెల్లాపూర్ గ్రామం మధ్య శివారు ప్రాంతంగా ఉన్న బుర్కగడ్డ పొలాల్లో ఆరో తరగతి బాలుడు దొబ్బలి శివకుమార్ దీన్ని గుర్తించి ఉపాధ్యాయులు ఎ.శాంతకుమార్, ఎం.కృష్ణకు చూపించాడు. ఈ ఉపాధ్యాయులు గొడ్డలి విషయాన్ని అంతర్జాతీయ ప్రాక్చరిత్రకారుడు రవి కొరిషెట్టర్(కర్ణాటక), కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ దృష్టికి తీసుకురాగా, వారు పరిశీలించి అది తొలి పాతరాతి యుగం లేదా అషూలియన్ రాతి పనిముట్టు అని తేల్చారు. రాతి గొడ్డలిగా భావిస్తున్న దాని పొడవు 12.5 సెం.మీ., వెడల్పు 8.5 సెం.మీ., మందం 3.5 సెం.మీ. ఉన్నాయి. అది కనీసం లక్ష సంవత్సరాలకు ముందటిదే అయి ఉంటుందని వారు పేర్కొన్నారు.

కృష్ణానదిలో నీటి కుక్కలు



నదీతీరంలో తిరుగుతున్న నీటికుక్కలు

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు దిగువన కృష్ణానది తీరంలో గురువారం నీటికుక్కలు కనిపించాయి. ఇవి నీటిలోని చేపలను తింటూ జీవిస్తాయని, అరుదైన జాతికి చెందినవని అటవీ శాఖ అధికారులు వివరించారు. నీటి కుక్కలు సాగర్ వద్ద పదేళ్ల క్రితం ఒకసారి కనిపించగా.. డ్యాం సిబ్బంది వాటిని నీటి పిల్లులుగా భావించి బయటకు తీసుకువచ్చారు. అప్పుడు వాటిలో కొన్ని చనిపోగా.. మిగిలినవి నీటిలోకి వెళ్లిపోయాయి. తిరిగి ఈ నీటికుక్కలు గత సంవత్సరం సాగర్ డ్యాం సమీపంలో కనిపించగా అటవీ అధికారులు సంరక్షించారు. ఇటీవల వాటి సంతతి పెరిగినట్లు అధికారులు చెప్పారు. గురువారం ప్రాజెక్టు దిగువన శివాలయం ఘాట్ సమీపంలో నీటిలో ఈదుతూ, నది తీరంలోకి వస్తూ సందడి చేశాయి. సమీపంలోని పర్యాటకులు వాటిని చూసేందుకు గుంపులుగా వెళ్లడంతో నీటిలోకి వెళ్లిపోయాయి.

ప్రభుత్వంలోనే దోషులు!

'ఐఎంజీ భారత'కు చంద్రబాబు భూ కేటాయింపుల్ని తప్పుబట్టిన హైకోర్టు

2004లో ఆపద్ధర్మ ప్రభుత్వంలోనే జీవోలు విడుదల చేసేసిన చంద్రబాబు

- కంపెనీ ఏర్పాటైన 5 రోజులకే రూ.వేల కోట్ల విలువైన 850 ఎకరాల్ని కట్టబెట్టిన బాబు
- హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన భూకేటాయింపులో అడుగడుగునా అక్రమాలు
- ఏ అంతర్జాతీయ కంపెనీతోనూ సంబంధాల్లేని ఐఎంజీ భారత సంస్థ
- 2004లో బాబు ఓటమి... 2006లో కేటాయింపుల రద్దు
- దాన్ని సవాలు చేసిన ఐఎంజీ భారత... నాటి ప్రభుత్వంలోనే దోషులున్నారన్న కోర్టు
- తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా



సాక్షి, హైదరాబాద్: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 850 ఎకరాలు.. కారుచౌక ధరకు.. అదీ హైదరాబాద్‌లో అత్యంత విలువైన ప్రాంతం గచ్చిబౌలిలో.. ఒక్క రోజులో చకచకా అనుమతులిచ్చేశారు. కంపెనీ ఏర్పాటైన 5 రోజులకే రూ.వేల కోట్ల విలువైన భూమి అప్పగించేశారు. ఆపద్ధర్మ ప్రభుత్వంగా ఉంటూ 'ఐఎంజీ అకాడెమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంజీబీపీఎల్)'కు 850 ఎకరాలు కేటాయించేలా చంద్రబాబు సర్కారు అవగాహన ఒప్పందం(ఎంవోయూ) చేసుకుంది. వెంటనే 400 ఎకరాలను సేల్‌డీడ్ ద్వారా ధారాదత్తం చేసేసింది. క్రీడా మౌలిక వసతుల కల్పన కోసం అంటూ 2003లో నాటి చంద్రబాబు నాయుడి సర్కారు చేసిన నిర్వాకంలో... ప్రభుత్వ పెద్దల తీరును తెలంగాణ హైకోర్టు తప్పుబట్టింది. ఏకపక్షంగా అంత భూమిని అప్పగించడంలో ప్రభుత్వంలోనూ దోషులున్నారని కోర్టు వ్యాఖ్యానించింది. తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం 2006లో సేల్‌డీడ్‌ను రద్దు చేయటాన్ని కోర్టు ప్రస్తావిస్తూ... భూములను వెనక్కి తీసుకున్న ప్రభుత్వం దీనికి కారకులైన అధికారులు, నాయకులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించింది. నాడు ప్రభుత్వం భూముల కేటాయింపును రద్దు చేయటాన్ని సవాలు చేస్తూ 2006లో బిల్లీరావు వేసిన పిటిషన్, ఇతర పిటిషన్లపై గురువారం హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటితో కూడిన ధర్మాసనం విచారణ జరిపిన సందర్భంగా పై వ్యాఖ్యలు చేసింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఏ.సుదర్శన్‌రెడ్డి సుదీర్ఘ వాదనలు వినిపించారు.

5 రోజులకే 850 ఎకరాలు...

ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'ఐఎంజీ అకాడెమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్‌తో రాష్ట్ర(చంద్రబాబు) ప్రభుత్వం 2003 ఆగస్టు 9న 850 ఎకరాలు కేటాయించేలా ఎంవోయూ కుదుర్చుకుంది. విచిత్రమేంటంటే.. అంతకు కేవలం 5 రోజుల ముందే 2003, ఆగస్టు 5న కంపెనీ ఏర్పాటైంది. అలాంటి కంపెనీకి ఎలాంటి టెండర్లు, బిడ్డింగ్ లేకుండా బంజారాహిల్స్ నుంచి శిల్పారామం మార్గంలోని మాదాపూర్ పరిధిలోకి వచ్చే రూ.వేల కోట్ల విలువైన ప్రజల భూమిని చంద్రబాబు ప్రభుత్వం స్వల్ప ధరకు అప్పగించింది. యువజన, సాంస్కృతిక, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శితోపాటు నాటి ముఖ్యమంత్రి(చంద్రబాబు)తో కలిపి 6 దశల ఐఎంజీబీ ఒప్పందానికి ఆగమేఘాల మీద ఒక్కరోజులోనే అన్ని అనుమతులు జారీ చేశారు. 2003, నవంబర్ 14న అప్పటి ముఖ్యమంత్రి అభ్యర్థన మేరకు అసెంబ్లీని గవర్నర్ రద్దు చేయడం గమనార్హం (అంటే.. అసెంబ్లీ రద్దుకు 3 నెలల ముందు ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు). 2004, ఫిబ్రవరి 10న 400 ఎకరాల భూమిని ఐఎంజీబీకి అప్పగిస్తూ సేల్ డీడ్ చేశారు. అయితే ఏ అంతర్జాతీయ సంస్థతో సంబంధం లేని ఐఎంజీ భారత్‌కు రూ.వేల కోట్ల భూముల అప్పగింతపై రాష్ట్ర ప్రభుత్వం 2006లో కమిటీ నియమించింది. ఆ కమిటీ నివేదిక మేరకు ఐఎంజీ భారత్‌తో ఎంవోయూను, సేల్‌డీడ్‌ను ప్రభుత్వం రద్దు చేసింది' అని వెల్లడించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం... తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది.

కృష్ణా తీరంలో అరుదైన బాదామి చాళుక్య ఆలయాలు



సాక్షి, హైదరాబాద్: కృష్ణా తీరంలో బాదామి చాళుక్యుల కాలం నాటి ఆలయాల చరిత్ర వెలుగు చూసింది. నల్లగొండ జిల్లా ముదిమాణిక్యం గ్రామంలో నాటి దేవాలయాలు, బాదామి చాళుక్య చివరి కాలంనాటి లిపితో ఉన్న లఘు శాసనాల్ని పబ్లిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హిస్టరీ, ఆర్కియాలజీ, హెరిటేజ్ (ప్రిహా)కు చెందిన డాక్టర్ ఎం.ఎ.శ్రీనివాసన్, ఎస్.అశోక్ కుమార్ ల బృందం వెలుగులోకి తెచ్చింది. గ్రామం చివర కృష్ణా నది ఒడ్డునే ఉన్న అరుదైన రెండు ఆలయాలు నేటికీ ఎక్కువ శిథిలం కాకుండా నిలిచే ఉన్నాయి. క్రీస్తు శకం 543–750 సం .మధ్య కాలంలో ఈ ఆలయాలను నిర్మించారని తెలుస్తోంది. 8 లేదా 9వ శతాబ్దానికి చెందిన లఘు శాసనం కూడా ఇక్కడ వెలుగు చూసింది. 'గండశౌఱ్రు'అని రాసి ఉన్న ఈ శాసనం గ్రామంలో ఉన్న ఐదు గుళ్లలో (పంచకూట) ఒక గుడిలోని స్తంభంపై ఉంది. ఇందులోని మొదటి రెండు అక్షరాలైన 'గండ'కు అర్థం కన్నడలో వీరుడని, ఈ లఘు శాసనం ఒక వీరుడి బిరుదు అయి ఉండవచ్చని ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎపిగ్రఫీ శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.మునిరత్నంరెడ్డి పేర్కొన్నారు.

మోడల్ స్కూళ్ల ప్రవేశ దరఖాస్తుల గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మోడల్‌స్కూళ్లలో 6,7, 8, 9, 10 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి దరఖాస్తుల గడువును పొడిగించినట్లు మోడల్ స్కూళ్ల విభాగం అదనపు సంచాలకుడు సీహెచ్.రమణకుమార్ తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఈనెల 22వ తేదీతో ముగిసిందని పేర్కొన్నారు. కానీ తల్లిదండ్రుల వినతుల మేరకు మార్చి 2 వరకు దరఖాస్తులకు వీలు కల్పించినట్లు వెల్లడించారు.

జెన్‌కో ఇన్‌చార్జి జేఎండీగా కృష్ణభాస్కర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా డి.కృష్ణభాస్కర్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయనకు జెన్‌కోలోని ఫైనాన్స్, కమర్షియల్ విభాగాలను అప్పగించారు.

సింగరేణిలో 272 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో 272 పోస్టుల భర్తీకి గురువారం నోటిఫికేషన్ జారీ అయింది. మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) పోస్టులు 139, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎఫ్ అండ్ ఏ) పోస్టులు 22, మేనేజ్‌మెంట్ ట్రైనీ(పర్సనల్) పోస్టులు 22, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఐఈ) పోస్టులు 10, జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ పోస్టులు 10, మేనేజ్‌మెంట్ ట్రైనీ(హైడ్రో-జియాలజిస్ట్) పోస్టులు 2, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సివిల్) పోస్టులు 18, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ పోస్టులు 3, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులు 30, సబ్-ఓవర్సీస్ ట్రైనీ(సివిల్) పోస్టులు 16 ఇందులో ఉన్నా యి. మార్చి 1 నుంచి 18 వరకు ఆన్‌లైన్‌లో దర ఖాస్తులను స్వీకరించనున్నారు. వైద్యాధికారి పోస్టు మినహా మిగిలిన పోస్టులకు గరిష్ట వయోపరిమితి 30 ఏళ్లు. వైద్యాధికారి పోస్టుకు గరిష్ట వయోపరిమితి 45 ఏళ్లు. అన్ని పోస్టుల విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5 ఏళ్ల గరిష్ట వయోపరి మితి మినహాయింపు వర్తిస్తుంది. సింగరేణి ఉద్యోగులకు మాత్రం ఎలాంటి వయోపరిమితి లేదు. పూర్తి వివరాల కోసం మార్చి 1 నుంచి సింగరేణి సంస్థ వెబ్‌సైట్ (https://scclmines.com) లోని 'కెరీర్'విండోను సందర్శించాలని సంస్థ యాజమాన్యం సూచించింది.

ప్రజలతో స్నేహంగా, నేరస్తులతో కఠినంగా ఉండాలి

కానిస్టేబుల్ ట్రైనీ కేడెట్లతో డీజీపీ రవిగుప్తా



సాక్షి, హైదరాబాద్: పోలీసులు విధుల్లో ప్రజలతో స్నేహంగా, నేరస్తులతో కఠినంగా ఉండాలని కానిస్టేబుల్ శిక్షణ కేడెట్లకు డీజీపీ రవిగుప్తా సూచించారు. సమాజ రక్షణ కోసం పోలీస్ ఉద్యోగాన్ని ఎంచుకోవడం గర్వకారణమన్నారు. పోలీస్ కానిస్టేబుల్ శిక్షణలో భాగంగా గురువారం తెలంగాణ పోలీస్ అకాడమీలో 685 మంది కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ రవిగుప్తా వారినుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత బ్యాచ్‌లో 200 మందికిపైగా కేడెట్లు కంప్యూటర్ విద్య నేపథ్యాన్ని కలిగి ఉన్నారని, వీరంతా సైబర్ నేర దర్యాప్తులో పోలీస్‌శాఖకు గొప్ప శక్తిగా మారతారని పేర్కొన్నారు. పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ..కేడెట్లు ఎలాంటి ఒత్తిడి లేకుండా శిక్షణను పూర్తి చేయాలని సూచించా రు. ట్రైనింగ్ ఐజీ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ..శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచేలా కేడెట్లు కృషిచేయాలన్నారు. కాగా, సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన కేడెట్లకు అంబర్‌పేట్ పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో ఇంటెలిజెన్స్ అదనపు డీజీ బి.శివధర్‌రెడ్డి శిక్షణను ప్రారంభించారు.

గంజాయితో దొరికిన బిగ్‌బాస్ ఫేం షణ్ముఖ్

- ఓ కేసు విషయంలో అతని సోదరుడిని విచారించేందుకు వెళ్లిన పోలీసులు
- అదే సమయంలో ఇంట్లో గంజాయితో రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన షణ్ముఖ్
- ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు



సంపత్, షణ్ముఖ్(ఫైల్)

మణికొండ: బిగ్‌బాస్ ఫేం షణ్ముఖ్ జస్వంత్ గంజాయి తీసుకుంటూ పోలీసులకు అడ్డంగా దొరికాడు. తన అన్నపై ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంట్లో తనిఖీలు చేసేందుకు పోలీసులు రాగా అదే సమయంలో షణ్ముఖ్ గంజాయి తాగుతూ చిక్కాడు. నార్సింగి ఏసీపీ జీవీ రమణగౌడ్ చెప్పిన వివరాల మేరకు.. యూట్యూబ్ వెబ్ సిరీస్‌లు, సినిమాల్లో అవకాశం కల్పిస్తానని ఓ యువతితో 2015 సంవత్సరంలో ఫ్రెండ్‌షిప్ మొదలుపెట్టిన షణ్ముఖ్ ఆ తర్వాత ఆమెను తన అన్న సంపత్ వినయ్‌కు పరిచయం చేశాడు. ఈ క్రమంలో ప్రేమించాననీ పెళ్లి చేసుకుంటానని సంపత్‌ను ఆమెను లోబరుచుకున్నాడు. గర్భం దాల్చడంతో గర్భస్రావం చేయించాడు. వారం రోజుల్లో పెళ్లి చేసుకుంటానని ఎప్పటికప్పుడు చెబుతూ వచ్చిన వినయ్‌కు అప్పటికే పెళ్లి అయిందని అతని తల్లిదండ్రుల ద్వారా ఆమెకు తెలిసింది. దీంతో తనను మోసం చేశారంటూ ఆమె వినయ్‌తో పాటు కుటుంబ సభ్యులపై నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు విచారణలో భాగంగా బుధవారం రాత్రి వారి ఇంట్లో పోలీసులు తనిఖీలు చేస్తున్న క్రమంలో సంపత్ సోదరుడు షణ్ముఖ్ గంజాయి తాగుతూ కనిపించటంతో పాటు అతని వద్ద 18 గ్రాముల గంజాయి లభించింది. ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) యాక్ట్ కింద షణ్ముఖ్‌పై కేసు నమోదు చేశామనీ, యువతిని మోసగించిన ఆరోపణలపై వినయ్‌పై కేసు పెట్టి ఇద్దరినీ రిమాండ్‌కు తరలించామని ఏసీపీ చెప్పారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.